Rivera's Objectivity

(rivera kavtitvam pai tatvika paramarsha)

Ankalla Prudhvi Raj

"రివేరా కవిత్వం గుణాత్మకంగా పరివర్తన చెందడాన్ని గ్రహించాలి. ఈ పరివర్తనలో వాస్తవికతను చిత్రించేదిగా సాగడం అనగా వాస్తవికతను పున:సృష్టి చేసే ప్రతిఫలనంలో తన ప్రయత్నపూర్వక చైతన్యయుత కార్యాన్ని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఈ చైతన్యయుత కార్యం యొక్క సాధారణ కారణాలను అవగాహన చేసుకోవడం దగ్గరే మన దృక్పథాన్ని వెల్లడిస్తుంది. అయితే ఈ దృష్టి అనివార్యంగా సాహిత్యంపై వాస్తవిక దృక్పథంగా ఉండటంలో యథాతథవాదంగా ఉన్నదా లేక గతితార్కికంగా సాగుతుందా అవగాహన చేసుకోవాలి. కావున ఇక్కడ మనం రివేరా విప్లవోద్యమం యొక్క వాస్తవ పరిస్థితిని చాలా చక్కగా తన ప్రయత్నపూర్వకంగా అనగా తాను సాధారణీకరణ సాంప్రదాయ రూపంలో వ్యక్తం చేసే స్థితి నుండి తనవంతుగా వ్యక్తిగత రూపంలో సృష్టించే వాతావరణం అనే స్థితి దగ్గర చర్చించే స్థాయికి చేరుకోవడం జరుగుతుంది. ఈ వ్యక్తిగత రూపాన్ని కూడా మనం ఒక సామాజిక రూపంగా గ్రహించాలి, గుర్తించాలి. అయితే ఈ సాధారణీకరణ మరియూ వ్యక్తిగతం అనే రెండూ మనవ సామాజిక ఆచరణలో భాగంగానే అవగాహన చేసుకోవాలి. ఇక సాధారణీకరణ అనగా మానవుని ఆచరణ అనే నిర్దిష్ట సామాన్యత నుండి అనివార్యంగా ప్రతిఫలించే వాస్తవిక చైతన్యపు సాపేక్ష-విప్లవ స్వభావాలుగా ప్రతిఫలించడం. వ్యక్తిగతం అనగా మానవుడి సామాజిక ప్రత్యేక రూపం నుండి ప్రతిఫలించే చైతన్యం. ఈ రెండు విధాల చైతన్యాన్ని కవిత్వం ద్వారా ప్రతిఫలించడం రివేరా పనిగా సాగడాన్ని గమనించవచ్చు."

స్పైరల్ పబ్లికేషన్స్

రివేరాస్ ఆబ్జెక్టివిటీ

(రివేరా కవిత్వంపై తాత్త్విక పరామర్శ)

పరామర్శకుడు

అంకాళ్ల పృథ్విరాజ్

‘రివేరాస్’ ఆబ్జెక్టివిటీ

(రివేరా కవిత్వంపై తాత్త్వీక పరామర్శ)

పరామర్శకుడు

అంకాళ్ళ పృథ్వీరాజ్

స్పైరల్ పబ్లికేషన్స్

'రివేరాస్' ఆబ్జెక్టివిటి
(రివేరా కవిత్వంపై తాత్త్విక పరామర్శ)

రచయిత : అంకాళ్ళ పృథ్వీ రాజ్

ప్రచురణ : స్పైరల్ పబ్లికేషన్స్

ప్రచురణ కాలం : జనవరి, 2020

వెల : 120/-

అంకితం...

కనుమరుగౌతున్న
మన కాలపు మార్క్సిస్టు మహా తాత్త్వికుడు
అభిమైల్ గుజ్‌మన్ (గొంజాలో) *

---

* *పెరూ కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) కేంద్ర కార్యదర్శి, 1992 నుండి కారాగారంలో ఖైదీగా 28 సంవత్సరాలుగా నిర్బంధంలో ఉన్నారు.*

నా మాట

ఈ విమర్శనాత్మక పరిశోధన పత్రం యొక్క నేపథ్యం ఏమంటే, ఒకటి– ఒకానొక సాహిత్య మిత్రుడు మీరు తాత్త్విక అధ్యాయణంలో మునుగితేలుతుంటే సాహిత్యాన్ని పట్టించుకోవడం, అధ్యాయణం చేయడం జరగదని, అసలు తాత్త్విక అధ్యాయణ పరులకు సాహిత్యంలో ఏ ప్రవేశం ఉంటుందని, సాహిత్యకారులపై సాహిత్యం అంటే ఏమిటో కూడా తెలియకుండా విమర్శ చేయడం ఏమిటీ అని ప్రశ్నించారు, ఈ ప్రశ్నకు సమాధానంగా భౌతికవాద గతితార్కిక దృక్పథంతో ఈ పత్రాన్ని ప్రచురిస్తున్నాను. రెండు–నూతన విద్యా విధానంలో ఎమ్.ఫిల్ పరిశోధనను రద్దు చేయడంతో ఒక స్వీయ పరిశోధనను ఈ రద్దుకు నిరసరనగా రచించాలనే సంకల్పమే ఈ పత్రం. మూడు–కొన్ని రోజులుగా సత్త–సాంఖ్య, శూన్యవాదలపై విమర్శనాత్మక పరిశీలన అనే సిద్ధాంత గ్రంథ రచనను చేస్తున్నాను, ఐతే ఈ మహత్తర కార్యానికి ముందుగా నన్ను నేను పరిశోధనా చట్రపు పరిధిలో శిక్షణా ప్రయత్నంగానే ఈ పత్రాన్ని రచించడం జరిగింది. ఈ పత్రాన్ని సెప్టెంబర్ నెలలో ప్రచురించిన నా సత్యపథం అనే గ్రంథం తరువాత తక్షణమే ప్రారంభించాల్సి ఉండే కానీ అనుకోని నా వ్యక్తిగత సమస్యల నుండి తేరుకుంటూ నవంబరు నెలలో ప్రారంభించడం జరిగింది. అబద్ధాలు– తప్పుడు ఆరోపణలు–నీచాతి నీచ నిందలు–అవహేళనలు విలయతాండవం చేస్తున్న వేల దీనిని రచించడం ఒక ఉద్దేశపూర్వకం అని నీచమైన వాదానికి తెరలేపారు కూడా, ఈనాడు వాస్తవాలను గ్రహించలేని హేతుబద్ధత మన లోపంగా మారిపోయింది. ఈ లోపాన్ని ఆసరా చేసుకునే ఒకరకమైన గోబెల్స్ విష ప్రచారం ఇప్పటకీ ఆగని వాతావరణంలోనే నా ఈ విమర్శనాత్మక పరిశోధనను తీసుకురావడం జరుగుతుంది.

నిజానికి కాలమే వీటికి(గోబెల్స్) సమాధానం చెబుతుంది కూడా, అందుకే ఎటువంటి నీచాతి నీచ ప్రేలాపాలైనా నా భౌతికవాద గతితార్కిక అధ్యాయణాన్ని-పరిశోధనని అడ్డుకోలేవని అందుకు సమాధానంగా ఈ పత్రం వెలువడుతుందని గ్రహించాలి.

నా పరిశోధన వివరాన్ని వినిన వెంటనే అంగీకరించి, ఓర్పుగా చర్చకు పూనుకుని ఆమోదం తెలిపిన రచయిత-కవి రివేరా గారికి, ఈ పత్రాన్ని భాగాలుగా ప్రచురించిన ప్రజాకాంక్ష దినపత్రికకు మరీ ముఖ్యంగా పత్రిక సంపాదకులు కృష్ణ గారికి, ఈ రచనా పనిలో మునిగిపోయిన సందర్భంలో నా ఆహార-పానియాలు సైతం పర్యవేక్షించిన, వెన్నెంటే ఉన్న కేతుబోయిన వెంకటేశ్వర రావు(బాబా)గారికి, సూచనలు-సలహాలు ఇచ్చిన మిత్రులు కట్టా.కిరణ్, నరేష్, శంకర్, అనీల్, సుధాకర్, చందన్, తిరుపతి అన్నకు, చంద్రయ్య అన్నకు, మల్లేష్ అన్నకు మరియు నిరంతరం ఈ రచనను అధ్యాయనం చేస్తూ ప్రోత్సాహించిన డప్పు రమేష్ అన్న మరియు జ్యోతక్కలకు అలాగే ఈ రచనలోని లోతును గ్రహించి చర్చకు పెట్టిన దేవేంద్ర అక్కకు, నా గురువర్యులు వెన్నెలకంటి రామారావు గారికి, పుస్తకాన్ని చదివి మెచ్చుకున్న శ్రీ రామకవచం సాగర్ గారికి, పి.డి.యస్.యు రామకృష్ణ అన్నకు, అరసవెల్లి కృష్ణ గారికి, బండి దుర్గాప్రసాద్ అన్నకు, అలాగే మా తల్లిదండ్రులు, భీమారావు గారికి (చిన్నా బాబాయ్) చెల్లెలు అవనికి మరియు నా రాకీకు (కుక్క పిల్ల) కృతజ్ఞతలు.

'రివేరాస్' ఆబ్జెక్టివిటి

భారతీయులు కవిత్వాన్ని శరణాగతి వ్యవహారంగా భావించి అభివృద్ధికి చేరుకోవడం అభ్యుదయాంశము, కానైతే ఈ శరణాగతి అనే ప్రక్రియ భావవాదపూరిత అంశంగా చలామణి అవ్వడంలో పరిమితిని కలిగియుండటాన్ని, ఏర్పర్చుకోవడాన్ని గ్రహించవలసిన విషయం, ఎందుకంటే అది సంపూర్ణ దైవారాదన మరియూ దైవీక సమర్పనగా వ్యవహరించడంగా చలామణి అవుతుంది. అందుకే శరణాగతి అనేది దైవీకమైన శరణాగతా లేక అదైవీకమైన శరణాగతా అని గమనించాలి ఐతే దైవీక శరణాగతి యొక్క భౌద్ధికాభివృద్ధిలో బహుసంఖ్యాక ప్రకృతి శక్తుల ఆరాధన స్థానంలో ఏకేశ్వరోపాసన క్రమంలో శరణాగతి యొక్క పద్ధతులు లేక దశల అభివృద్ధిని గ్రహిస్తే మర్కట కిశోర న్యాయం మరియూ మార్జాల కీశోర న్యాయాలుగా ప్రతిఫలమయ్యాయి. ఐతే భౌతికవాద అభివృద్ధిలో భాగంగా శరణాగతి యొక్క భావవాద ఛాయలను విమర్శిస్తూ విప్లవ శరణాగతిగా పరిణమించిందని భావన, ఈ విప్లవ శరణాగతి అనేది భౌతిక పరిస్థితులల్లో వచ్చే సమూల మార్పును ప్రతిఫలిస్తూ ఆ మార్పు యొక్క ఆహ్వానంలో తమను తాము సంపూర్ణ సమర్పణంగా పరిణమించడంగా ఉంటుంది. అయితే ఈ విప్లవ శరణాగతి ఖచ్చితంగా మర్కట కిశోర న్యాయాన్ని మరియూ

మార్జాల కిశోర న్యాయాన్ని భౌతికవాదం వైపుగా మోసుకెలుతూ ఉన్నతంగావించడం జరిగింది. కావున విప్లవ శరణాగతి ఖచ్చితమైన స్థల-కాల పరిమిత పరిస్థితుల వ్యవహారంగా ఉంటుంది. అందుకే విప్లవం అనే అంశం పునాదిని గమనిస్తే ఆయా నిర్ధిష్ట ఉత్పత్తి శక్తుల చారిత్రక దశ యొక్క ప్రతిఫలనంగా ఉత్పత్తి సంబంధాలు ఉద్భవిస్తాయి, ఈ నిర్ధిష్ట చారిత్రక దశ ఉత్పత్తి సంబంధాల యొక్క అన్వయాత్మక నియతి ప్రతిబింబంగా ఉపరితలం మరియూ ఆయా భావజాలాంశాలు ముందుకు వస్తాయి. ఫలితంగా కవిత్వం దానికదిగా భావజాలంగా పరిగణించాలి, అయితే భావజాలం యొక్క నిర్వచనాన్ని లోతుగా అర్ధం చేసుకుంటే అది మానవ చైతన్యంగా పరిగణించబడుతున్న వాస్తవికతపై విలోమ స్థితిగా గ్రహింపు, కానైతే వాస్తవికతే మానవ ఆచరణాత్మకతలో ఆవశ్యకమైనదిగా నిరూపితమైనదై సాగుతుంది అయితే ఈ వాస్తవికతపై విలోమ స్థితి అయిన భావజాల అంశం సంపూర్ణ మానవ అధ్యారోపిత వ్యవహారంగా మానవ సామాజిక ఆచరణలో సామాజిక అధ్యాస (దానికదే భావజాలం) ఫలితంగా ఉద్భవిస్తుంది. అయితే ఈ పరిణామ క్రమం ఒక ఖచ్చితమైన నిర్ధిష్టానుసారమైన స్థల-కాలాల అనుసరణగా ముందుకు సాగుతుంది. ఈ స్థితి ప్రాధాన్యంలో భావజాలం యొక్క ఖచ్చితమైన మానవ ప్రయోజనార్ధ వ్యవహారం నుండి ఉపయోగ పరిస్థితి నుండి సజీవ చలామణిగా భావించడం కద్దు, కానైతే అది భావల సమన్వయంగా సాగే స్థితిలో ఆధిపత్య భావాలుగా పరిణమించడం, రూఢీ కావడం ఆనవాయితి. అందుకే శరణాగతి యొక్క దృక్పథం నిర్ధిష్టమైన స్థితిలో అభ్యుదయంగా అలాగే ఛాందసంగా వ్యవహరిస్తూ మనకు దాని విశిష్టతను ఎరుక పరుస్తుంది. అందుకే ఈ గ్రహింపును గుర్తించడంలో ఒక కొలమానం నేటికీ కరువైనదనే సత్యాన్ని గుర్తించడం మన ప్రధాన కర్తవ్యంగా సాగుతుంది. ఈ గుర్తింపు నుండి మన పరిశీలనలో విమర్శనాత్మక స్థాయిని అందుకోవడం ఒక సమూల కార్యాచరణ గెంతుగా

గుణాత్మక వ్యవహారంగా ముందుకు వస్తుంది. అది ఉత్పత్తి శక్తుల ఉత్పత్తి సంబంధాల మధ్య ఉన్న వైరుధ్య ఫలితమని గ్రహించాలి. ఇకపోతే భాషను భావీకరించడమనేది మానవ ఆచరణాత్మక చైతన్యంగా పరిగణించాల్సిన అవసరం ఉంటుంది. అందుకే మానవ ఆచరణ యొక్క ప్రతిఫలనంగా భాషను అవగాహన చేసుకోవాలి. భాష సామాజిక మానవ ఆచరణగా, శబ్ధతరంగాల వ్యవస్థగా పరిగణన అయితే భాష యొక్క విభిన్నతల రూపాలకు స్థల-కాల ప్రతిబింబమే మూలంగా అవగాహన కానైతే ఆర్జిత ప్రతిచర్యగా, ద్వితీయ సంకేతాల వ్యవస్థగా-భాషా రూపంలో వ్యక్తమయ్యే చైతన్య కార్యకలాపంగా విషయము. అందుకే భాష ఉత్పత్తి సాధనంగా నిరంతర గుణాత్మక కొనసాగింపుగా వర్గస్వాభావరహితాంశముగా చెప్పుకుంటాము. అందుకే భాషను ప్రజల భాష మరియు అపభ్రంశ భాషగా చెప్పుకున్నా లేదా ఏ వర్గానికో లేదా మాండలికానికో ముడిపెట్టినా అది ప్రజల భాషా పునాదిపై ఆధారపడి ఏర్పడే భాషగా చెప్పుకోవాల్సిన అవసరం ఉంటుంది. అలాకాక భాషను ఉపరితలంగా భావించే వ్యవహారంతో వర్గ వైరుధ్యాన్ని మోపడం ఒక బలహీనమైన సైద్ధాంతిక వ్యవహారంగా తేల్చవచ్చు, అందుకే ఈ భాష ఏ రూపమైనా దాని యొక్క భావాత్మక చైతన్యపు ప్రతిఫలనం అనగా సాహిత్య రూపమైన భావజాలాంశం మాత్రమే వర్గ వైరుధ్యాన్ని ఉద్భవింప చేస్తుందని గ్రహించాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఈ సాహిత్యాంశపు వర్గ వైషమ్యము ఖచ్చితమైన అభ్యుదయాన్ని, ఛాందసాన్ని బహిరంగపర్చుడం మరియూ నూతనమైన, ఉన్నతమైన రూపంలోకి మారుతున్న అభ్యాదయం దిక్సూచిగా పరిణమిస్తుంది కూడా. ఐతే ఈ శరణాగతి యొక్క సారం అనివార్యంగా ఉన్నతీకరించుకుంటూ సాగడాన్ని మనం గమనించాల్సిన ఆవశ్యకత ఉంటుంది. అందుకే శరణాగతి యొక్క పరిమితి చెదిరిపోతుందని భావించే స్థితిలో పరిభ్రమణ చలనం విమర్శించబడి అది గతితార్కీకరించబడుతుంది. అందుకే

శరణాగతి రూపం అనివార్యంగా కవిత్వ సాంప్రదాయంగా వ్యవహరించేదిగా సాగుతుంది, ఇందుకు ప్రధాన కారణం శరణాగతి భావజాలాంశముగా, విలోమ మానవ చైతన్య రూపంగా ఉండటమే కారణమని గ్రహించడం కీలకం. అయితే మానవ ఆచరణ విలోమ ప్రతిఫల కవిత్వమనే భావజాలంలో కవులు పశ్చాతాపం అనే స్వీయ విమర్శనాత్మక ప్రక్రియను తడుముతున్నప్పుడు మనుషులు తమ బలహీనతలను అధిగమించకుండా, బలహీనతకులోనై పశ్చాతాపడుతూ ఉంటారు. బలహీనతకు నిరంతరం గురౌతూ ఉంటారు. పశ్చాతాపమూ బలహీనతే–బలహీనతే పశ్చాతాపము–అందుకే తమ బలహీనతలు వారిని అధిగమిస్తూ ఉంటాయి. ఈ బలహీనతలు అంతర్గతమైనవి– బహిర్గతమైనవి. అందుకే నిజానికి మానవ బలహీనతలు మరియూ పశ్చాతాపాలు వర్గ స్వభావ సమాహారాల వ్యక్తీకరణలుగా ఉద్భవిస్తాయి. అందుకే ఆయా వర్గ స్వభావాల రిత్యా వ్యవహరిస్తాయి. ఈ అంతర్గతమైనవి బహిరంగంగా వ్యవహరించవచ్చు. బహిర్గతమైనవి అంతర్గతంగా నెలకొనవచ్చు. ఇదొక సామాజీకరణ ప్రక్రియ. సమయం–సందర్భాల వ్యవహారాలు. పశ్చాతాపానికి మించిన ప్రాయశ్చిత్తం మొరకటి లేదని వాపోతూ ఉంటారు. నిజానికి పశ్చాతాపాన్ని చూస్తే మొరక కోణం తెలియాల్సి ఉంటుంది. పశ్చాతాపం వైరుధ్యంలోని ఒకానొక విరుద్ధాంశం. నిజానికి విరుద్ధాంశం పక్షపు కొనసాగింపు ఫలిత ఆవిర్భావమే, అందుకే దాని అర్ధం పూర్తిగా వ్యవహారానికి భిన్నమైనది. మానవుల మానసిక రుగ్మతలు– మానసిక ఆందోళనలు– ఒత్తిడులు మనుషులను తీవ్ర బలహీనతలకు లోనైయ్యేట్లు చేస్తుంటాయని ఇటీవల అధ్యాయణాలు వెల్లడిస్తున్నాయి. నిజానికి ఈ బలహీనతల మరొక కోణం సమాజంలో కొత్తగా ఏర్పడినవి కావు. బలహీనతలనేవి పాత వ్యవస్థ తాలూకు సామాజీకాంశాలు నూతన వ్యవస్థలో పరోక్ష రూపంలో చలామణి అవుతుండటం, పరిస్థితులల్లో వర్గ స్వభావాన్ని తనని తాను నిరూపించుకొనే

వాతావరణం, అల్ప సంతోషం, ఆధిపత్యం గుర్తించాలి అనే పరిస్థితి కూడా ఏర్పడుతుంది. కొన్ని భావాలు, అభిప్రాయాలు ఏర్పర్చుకుంటాము. వీటి నుండి చూస్తాము. అవి శాశ్వతం కావు. పరిస్థితులు మార్పు చెందుతాయి. నిరూపణకూ ప్రయత్నం జరుగుతుంది. అందుకే కవి తన కవిత్వం ద్వారా వ్యక్తీకరించేవి తన వర్గ స్వభావ ప్రతిఫలనంగా ఉంటుంది, అది ఖచ్చితంగా తన వర్గ స్వభావపూరిత రూపం నుండి గ్రహించే ప్రక్రియ.

* * *

శరణాగతి ఖచ్చితమైన దోషాల నివారణను ముందుకు తేవడాన్ని మనం గమనించవచ్చు, ఐతే ఈ నివారణల భావాలు కేవలం భావవాదమనే స్థితిలో పరిగణించడం ఒక పొరపాటు కావచ్చు కానీ భావ రూప ధోరణులనే శక్తులుగా పరిమితించడం కేవలం మూస పద్ధతిలో అర్ధం చేసుకునే వ్యవహారంగా ఉంటుంది, సాగుతుంది. నిజానికి భావరూప శక్తులు మానవ మెదడు ద్వారా గ్రహించబడి తిరిగి ప్రతిఫలించబడేవి కావున మానవ చైతన్య ప్రక్రియ క్రమములో భాగంగా గ్రహించవచ్చు కూడా, ఐతే శరణాగతి యొక్క భావవాద దృక్పథం నిర్దిష్ట పన్నెండు నిరూపణములను గుర్తించి వాటి యందు తగు జాగ్రత్తలు వహించాలని, వాటిని దొర్లకుండా సమానత్వ భావాన్ని నిర్దేశించినది. ఇక ఈ నిరూపణములైన జన్మ నిరూపణము అనగా పుట్టుక రిత్యా ఉండే వర్గ-వర్ణ వ్యత్యాసాలను పరిగణించకపోవడంగా సాగాలి, శరీర నిరూపణము అనగా జన్మ రిత్యా లింగ భేదమును అనుసరించి పరిగణించే దోషాన్ని వ్యతిరేకించడం, పాక నిరూపణము అనగా వయస్సు రిత్యా వ్యత్యాసమును పరిగణించకూడదని, ఆశ్రమ నిరూపణము అనగా ఏ విధమైన స్థితిలో ఉన్నా అనగా వివాహి, బ్రహ్మచారి అయిననూ అందరినీ సమన్యాయంగా పరిగణించాలని, అవయవ నిరూపణం అనగా శరీర రుగ్మతలను దృష్టిలో ఉంచుకుని వ్యత్యాసం చూపకూడదని, ఆలస్య నిరూపణము

అనగా శుభ్రాశుభ్రములను పరిగణించకుండా మనుషులను గౌరవించాలని, వాస నిరూపణము అనగా ఏ ఊరివారైనా, ఏ ప్రదేశము వారైనా ఒకటిగా పరిగణించాలి, బన్ధు నిరూపణము అనగా బందు ప్రీతి లేకుండా, ప్రకాశ నిరూపణము అనగా ఇతరులపై అసూయా, ద్వేషములు కలిగియుండటం, ప్రకార నిరూపణము అనగా శ్రామిక జన సంబంధితులను గౌరవించడం, వర్తన నిరూపణము అనగా ఏ వృత్తి నైననూ గౌరవించడం ప్రధానము, దోష నిరూపణము అనగా ఇతరుల దోషమును వెతుకులాటలో గడుపుతూ తమ దోషముల నివారణను పరిగణించకపోవడం. ఈ నిరూపణముల దోషములు దొర్లకుండా వ్యవహరించే ప్రవర్తనా నియమావళిని ఏర్పర్చడం జరిగినది. ఈ ఏర్పాటు అనివార్యంగా తమ కవిత్వానికి లక్ష్యాన్ని, మార్గాన్ని కల్పించడాన్ని గ్రహించవచ్చు. అయితే కవిత్వమే ఈ దోషాల సవరణ-నివారణా భావాల నేపథ్యమైన స్థితిని గమనించవచ్చు. ఐతే ఈ నిరూపణలు భావవాదపూరిత శరణాగతి స్థితిలో అభివృద్ధిని, ఉద్భవించడాన్ని పరిగణించడం జరగవలసి ఉన్నది. అయితే ఈ భావవాదపూరిత శరణాగతి అనివార్యంగా కర్మ-జ్ఞాణ-భక్తి మార్గాలను మోక్షప్రాప్తి సిద్ధములుగా ఆ మార్గాల భావవాద దృక్పథం అనివార్యంగా స్వియాత్మక మరియూ వస్తుగతాంశముగా మరీ ముఖ్యంగా ద్వైతాంశ రూపంలో వర్ధిల్లుతున్నదిగా చలామణి అయినది. అయితే కవిత్వం సైతం అనివార్యంగా తాత్త్వికపరమైన రూపంలో సాగుతుందని చర్చించిన వారు లేకపోలేదు కూడా అయితే ఈ చర్చలో కవిత్వం సంపూర్ణ భవిష్యదర్శనం గావించడం ద్వారా తాత్త్వికపరమైనదిగా వ్యవహారం. ఇకపోతే మానవ సామాజిక సందర్భానుసారంగా ఉద్భవించేవిగా నిరూపణములు-దోషములను గ్రహించవచ్చు. అయితే మారుతున్న-మారిన సమాజం సైతం అనివార్యంగా కొన్ని నిర్ధిష్ట సమస్యలు నూతన సామాజిక వ్యవస్థలో ప్రాగభావం అనివార్యంగా ప్రధ్వంసభావంగా ముందుకు వస్తాయి అలాగే అన్యోన్యభావంగా సైతం పరిణమించడాన్ని గ్రహించవచ్చు అలాగే

కొన్ని అత్యంతాభావంగా మారిపోతాయి. ఈ పరిణామక్రమాన్ని అనుసరించి మర్కట కిశోర న్యాయం అనగా మర్కట కిశోరం తన ప్రయత్నం ద్వారా తన తల్లిని అనుసరించే వ్యవహారంగా అలాగే మార్జాల కిశోర న్యాయం అనగా మార్జాల కిశోరం తన తల్లికి తనను సమర్పించుకుంటూ భారాన్ని వదిలేయడంగా గమనిస్తే కవిత్వం యొక్క పద్ధతి సైతం తన ప్రయత్న రూపంలో భౌతిక పరిస్థితులను అనుసరించడంగా అలాగే సంపూర్ణంగా భౌతిక పరిస్థితుల మార్పు-గమన-గమ్యాల ప్రభావ సమర్పణగా చెప్పుకుంటాము. అయితే మానవుడే భౌతిక పరిస్థితుల నిర్మాతగా గ్రహించాల్సిన సైద్ధాంతికతతో నిర్ధిష్ట చారిత్రక నియమాలను అనుసరించి పయనించేదిగా ఉంటుందని అవగాహన చేసుకోవాలి. కావున భావవాదపూరిత విషయ వాస్తవికత యొక్క ఏక పార్శ్వాన్ని సమన్వయీకరించుతూ భౌతికవాద విప్లవాత్మక నిర్ధిష్టతలోకి పయనిస్తుంది. అందుకే నిరూపణములను సైతం భౌతికవాద పరిధిలో విశ్లేషించ ప్రయత్నం, కావున కవిత్వం యొక్క భవిష్యదర్శనంలో ఈ నిరూపణములు మర్కట-మార్జాల పద్ధతులలో గుణాత్మక గెంతుగా అభివృద్ధి కాసాగడాన్ని గ్రహించవచ్చు. అయితే విలోమ స్థితి కలిగిన కవిత్వం అనివార్యంగా శ్రమ-పంపిణీ సంబంధాల మార్పుల యొక్క ప్రతిఫలనంగా భవిష్యదర్శనాన్ని కల్పిస్తుంది, కలిగిస్తుంది కూడా. కావున ఈ మార్పులను పరిగణించే కవిత్వం విప్లవాత్మకమైనదిగా, నూతనమైనదిగా, ఉన్నతమైనదిగా వ్యవహరిస్తుంది. అయితే ఈ మార్పులో ప్రధాన-అప్రధాన వైరుధ్యాలను సైతం ప్రతిఫలించడం కవిత్వానికి ఉన్న పరిధి-పరిమితి-విస్తృతి కూడా అని గుర్తించాలి. ఏమైనా కవిత్వంపై ఒక తాత్త్విక సమాలోచన అదీనూ భౌతికవాద గతితార్కిక దృక్పథం, పద్ధతుల ద్వారా జరగవలసినదని గ్రహించాలి.

***

అస్థిత్వం ఆలోచనల మధ్య సంబంధాన్ని వివరించడం, అస్థిత్వం ఆలోచనలలో

ఏది ప్రాథమికం అని చర్చించడం, అస్థిత్వం ఆలోచనల మధ్య ఐక్యతల వ్యక్తీకరణలో ఖచ్చితమైన అధిభౌతిక, యాంత్రిక, భావవాదాల విభిన్న దృక్పథాల నుండి భౌతికవాద గతితార్కికం వైపుగా తాత్త్విక నేపథ్యాన్ని పరిశీలించడం కేవలం ఒకానొక శాస్త్రీయ వాద చర్చకు పరిమితం కాకుండా కవిత్వం యొక్క దృక్పథంలో కవి యొక్క వైకరి, పద్ధతి, లక్ష్యాలను గ్రహించడంలో కూడా ఒక కర్తవ్యంగా ఉంటుంది, ఉండాలి కూడా. అయితే మర్కట-మార్జాల పద్ధతుల స్థల-కాల సందర్భాలు అనివార్యంగా దృక్పథం యొక్క వ్యక్తీకరణను స్పష్టంగా సూటిగా ఉద్భవింపచేస్తాయి. నిజానికి ఈ రోజుకూ కవిత్వంలో దృక్పథం సమస్యను కీలకంగా పరిగణించకపోవడంలో సామాజిక శాస్త్రంపై అవగాహనలో లోపంగా ఉన్నది. అయితే సామాజిక శాస్త్రం అనివార్యంగా తాత్త్విక-చారిత్రక పరిణామ క్రమం-అభివృద్ధిగా గ్రహించడంలోని పొరపాటును అనివార్యంగా అస్తిత్వవాదంగా చెప్పుకోవచ్చు. ఈ అస్తిత్వవాద వైకరితో కవిత్వం చారిత్రక-తాత్త్విక నేపథ్యం కలిగినది కాదని, అసలు కవిత్వం చర్చించదగినది కాదని వాదించే మేధావులూ ఉన్నారు. కానీ కవిత్వం యొక్క దృక్పథం అవగాహన చేసుకుంటే దానిపై సరైన వైకరి తీసుకోగలమని గ్రహించవచ్చు. నిజానికి కవిత్వం అత్యంత సున్నితంగా, స్పష్టంగా దృక్పథాన్ని పట్టిస్తుందని మనం తెలుసుకోవాలి. అందుకే తాత్త్విక వ్యవహారంలో భవిష్యవాదంగా చలామణి అవుతున్నప్పుడు దాని భవిష్యపు వర్గ వైకరిని గ్రహించడంలో సులభతరం, సుస్పష్టం. అందుకే సామాజీకరణలో సాహిత్యం ఒక అనివార్య వర్గ వైరుధ్యపు ప్రతిబింబంగా ఉద్భవించడం, వ్యక్తీకరించుకోవడం సహజం. అయితే కవిత్వం కేవల సామాజిక ఆచరణ రూపంగా గ్రహించే వాతావరణం మన భారతీయులలో కలగకపోవడానికి కారణమైన అపభ్రంశపు భౌతికవాదం మరియూ భావవాదాల మూలలు కారణమవుతున్నాయి. ఇకపోతే శ్రమ విభజనలలో వస్తున్న-వచ్చిన మార్పులకు తగ్గట్లు విలోమం చెంది కవిత్వంగా ఉద్భవించడం ఒక అనివార్యం,

ఈ శ్రమ విభజనలో సామాజిక రూపం నుండి వ్యక్తివాద వైకరి వరకూ కవిత్వంగా వెల్లడి కావడం ఒక వాస్తవంగా గ్రహించాలి. అయితే సామాజిక రూపం మాత్రమే కవిత్వంగా పరిగణించి వ్యక్తివాదాన్ని కవిత్వంగా పరిగణించకపోవడమనేది వ్యక్తివాదపు సామాజిక స్వభావం దాని అనివార్య స్థల–కాల నేపథ్యాన్ని గ్రహించడంలో పరిమితి ఉన్నదిగా భావించాలి. అందుకే వ్యక్తివాదం నుండి కవిత్వం ముందుకు వస్తున్నప్పుడు ఆయా కాలపు సామాజిక శ్రమ విభజనను తెలుసుకోవడం అనివార్యంగా ఉంటుంది. ఇక కవిత్వంలోని సామాజిక రూపాల ధోరణులు, అలాగే వ్యక్తివాద రూపాల ధోరణులు గ్రహించడం ద్వితీయ కర్తవ్యంగా ఉంటుంది, ఉండాలి. ఎందుకనగా వివిధ తాత్త్విక దృక్పథ నేపథ్యాల నుండి విభిన్న రూపాల ధోరణులు తలంలో చర్చకు వస్తాయి, కావున ఈ సమస్యను అనివార్యంగా పరిగణించడం కీలకం. భౌతికవాద గతితర్కం అనివార్యంగా సామాజిక రూపాల ధోరణులు, అలాగే వ్యక్తివాద రూపాల ధోరణుల వ్యవహారంలో తనకంటూ ఒక దృక్పథం, పద్ధతి, వైకరీ కలిగి ఉంటుంది. కావున అలాగే విభిన్న తాత్త్వికవాదాలకు సైతం ఈ అభివర్గాలతో వ్యవహరించడం ఒక సామాజిక మానవ ఆచరణ. ఇటువంటి కీలక తాత్త్విక నేపథ్యం అనివార్యంగా కవిత్వ చర్చకు ఉపకరించడాన్ని, అందుకు నెరవేర్చడాన్ని తాత్త్వికతకు ఉన్న బలాన్ని బహిరంగపరచడంగా దృష్టి సారించాలి. అయితే కేవలం కవిత్వానికే ఈ తాత్త్విక అన్వయం ఉంటుందని పొరపాటు పడితే అది ఒక అస్తిత్వవాద వైకరి తప్ప భౌతికవాద గతితార్కిక వైకరి కాదని గ్రహించాలి. ఈ రకంగా గ్రహించడంలోని పొరపాటు ధోరణి ఈ రోజు ప్రభలంగా ఉండటానికి మూలమైన ఆధునికానంతర తాత్త్విక నేపథ్యం నుండి సత్యానంతర కాలమనే వైకరిగా గుర్తించి, తాత్త్విక దృక్పథం అదీనూ భౌతికవాద గతితార్కిక తాత్త్వికతో విమర్శనాత్మకతతో సాగడం నేటి ఆవశ్యకము కూడా.

***

వాస్తవిత యొక్క నిర్ధిష్టతను గ్రహించే క్రమం అనివార్యంగా మానవ ఆచరణలో భాగంగా విశేషమై సాగుతుందని గ్రహింపు. కానైతే మానవ ఆచరణను గ్రహించడంలోని లోపాన్ని భౌతికవాద గతితార్కికం ద్వారా పరిష్కరించడం ఒక విశిష్టత కలిగిన వాస్తవంగా మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉన్నది. కావున మానవ ఆచరణ అతని కార్యకలాపం అనివార్యంగా వస్తుగతమైనదిగా తేలుతుంది. అయితే ప్రకృతీ-సమాజాల సామాన్య హేతుబద్ధ ప్రతిఫలనం అనేది మానవ ఆచరణ యొక్క విశిష్టాంశంగా మనం గ్రహించవచ్చు. కావున మానవ ఆచరణ యొక్క కార్యకలాపాలను ఇంద్రియ కార్యకలాపం మరియూ ఆలోచనా కార్యకలాపంగా ప్రస్థావించినా అనివార్యంగా మానవ ఆచరణను దానికదిగా వస్తుగతంగా గ్రహించడంలో మూలమైన సమస్య నేటికీ ఒక ప్రధానమైనదిగా ఉన్నది. ఇకపోతే కవిత్వం విషయంలో ఇంద్రియ కార్యకలాపం అనివార్యంగా భౌతికపరమైన విషయాల నమోదుగా ప్రస్థావించే వాతావరణం ఒక విధానమైతే, ఆలోచనా కార్యకలాపం అనివార్యంగా కేవల భావపు ప్రతిరూపంగా ప్రతిబింబమైన వ్యవహారాన్ని గ్రహించడం కీలకంగా మనం భావించే దృక్పథాన్ని దృష్టిలోకి తీసుకోవచ్చు. అయితే భావవాద రూపంలో ఆలోచనా కార్యకలాపానికి ఇచ్చే ప్రాధాన్యంలో ఒక విశేష పార్శ్వాన్ని అభివృద్ధి చేయడం అనివార్యతగా చెప్పుకున్నా అదే స్థాయిలో ఇంద్రియ కార్యకలాప వ్యవహారాన్ని గుర్తించే దృక్పథాలన్ని ఒకానొక రూపానికి పరిమితమై సంపూర్ణత్వ భావాన్ని విసర్జించి చలామని కావడాన్ని అర్ధంచేసుకోవచ్చు. కానైతే వాస్తవిక ఇంద్రియ కార్యకలాపం యొక్క స్వభావాన్ని గ్రహించడం, మరీ ముఖ్యంగా ఆలోచనా కార్యకలాపపు వాస్తవిక అర్ధాన్ని పట్టుకోవడంలోని లోపం ఖచ్చితంగా కవిత్వంపై అంచనాను వేయడంలో పరిమితి ఉంటుంది. కావున ఫిడిజం అనే తాత్త్విక దృక్పథంలోకి మనం జారుకుండటం అనివార్యంగా చెప్పుకోవాలి. అందుకే మానవ ఆచరణ అనే వాదం అనివార్యంగా మానవ ఆలోచనా కార్యకలాపంలో

బుద్ధి అనగానే అది ఒక క్రమం-తర్కం-ప్రతిఫలనం-జ్ఞాపకం-కాలం-స్థలం-భావరూప ధోరణులు వీటి ఫలితంగా సమన్వయం-సంశ్లేషణగా అభివృద్ధిని గమనించాలి. అయితే తాత్త్విక ప్రేరణకు కావాల్సిన ప్రమేయాలుగా భారతీయులు గుర్తించిన అంశాలు ప్రాణం, శరీరం, ఇంద్రియం, అర్థం, బుద్ధి, ప్రవృత్తి, దోషం, మనస్సు, ప్రేత్యాభావం, దుఃఖం, అపవర్గంగా చెప్పుకుంటారు, అయితే తార్కిక నేపథ్యంగా ప్రమానం, ప్రమేయం, సంశయం, ప్రయోజనం, దృష్టాంతం, సిద్ధాంతం, అవయవం, తర్కం, నిర్ణయం, వాదం, జల్పం, వితండం, హేత్వాభావం, చలం, జాతి, నిగ్రహస్థానంగా విషయం. ఈ విషయ దృక్పథం నుండి కవిత్వాన్ని అంచనాకట్టాల్సిన అవసరం నేడు అనివార్యం, కావున కవిత్వాన్ని దాని ద్రవ్యం స్థానంలో అలాగే దాని ధర్మ వ్యవహారంలో, అధర్మ స్థితిలో (దాని స్థలపు స్థితి), కాలపు వ్యవహారంలో భాగంగా పరిశీలన అనివార్యం. అందుకే దాని సామాన్య-విశేషములను అలాగే సాధారణాన్ని, ప్రత్యేకాన్ని, శబ్ధ ప్రమానాన్ని, పదాల మధ్య అర్థాన్ని బట్టి విషయాన్ని గ్రహించడం, పదాల మధ్య వైవిధ్యం- సమానంతో గ్రహించే విషయాన్ని తెలుసుకోవాలి. ఈ విధంగా కవిత్వాన్ని, కవి దృక్పథం, పద్ధతులను అర్థం చేసుకోవడానికి ప్రయత్నించడంగా సాగడం ముఖ్య విషయం. అయితే కవిత్వం యొక్క వర్గ స్వభావం అనే పరిస్థితి ఒక ముఖ్య గమనికగా మన పరిశీలనను చేయడం అనే కర్తవ్యం నుండి పరిశీలిస్తే కార్మికవర్గ దృక్పథం నుండి కవిత్వాన్ని రచించడం అనేది నేటి అభ్యుదయవాదం మరీనూ విప్లవాత్మకవాదంగా ఉంటుంది. అంతేకానీ శాశ్వత-అఖండ దశ అయిన దశగా పరిగణించడం అనివార్యంగా మధ్యంతర దశ యొక్క ఆవశ్యకత దాని విశేష చలామణిని గ్రహించకపోవడంగా ఉంటుంది. కావున కవిత్వం సైతం ఒకానొక మధ్యంతర దశ యొక్క ప్రతిఫలనం, అందునుండి పురోగామి నూతనమైన సామాజిక సంబంధాల ప్రతిఫలనంగా ఉద్భవించే కవిత్వాన్ని విప్లవాత్మకమైనదిగా చెప్పుకోవచ్చు, అయితే ఈ విప్లవాత్మకత

అనివార్యంగా కుళ్లిపోయిన వాస్తవంగా పరిణమిస్తుంది, అందుకు కారణమైన నూతనమైన సామాజిక సంబంధాలు ఆవశ్యక అనివార్యతగా మారడమని గ్రహించాలి. కావున కవిని, కవిత్వాన్ని అంచనా వేసేటప్పుడు ఈ నిర్ధిష్టతను పరిగణించడం శాస్త్రీయం. భావజాల సంబంధాలను కేంద్రంగా చేసుకొని మనం పరిశోధనకు ఉపక్రమిస్తున్న సందర్భంగా భావజాల నేపథ్యాన్ని క్రమానుగతంగా, పరిణామక్రమంగా గ్రహించడం కీలకంగా ఉంటుంది. అయితే ఈ భావజాల సంబంధాల వ్యవహారంగా పరిగణించే భావజాలంగా కవిత్వాన్ని గ్రహిస్తే రెండు పార్శ్వాల నేపథ్యాన్ని పరిశీలించవలసినదిగా ఉంటుంది. అయితే వ్యక్తి స్థానాన్ని-కాలాన్ని బట్టి వ్యక్తి లేదా వ్యక్తిత్వం ద్వారా భావజాలాన్ని నిర్ధారించుకునే ధోరణిగా చర్చించడం, అలాగే సాధారణీకరణ రూపంలో సామాజికాంశ సాంప్రదాయపర అంతర్గత ప్రతిఫలనంగా వ్యక్తమయ్యే భావజాల స్వరూప, సారములుగా చర్చించడం. అయితే కవిత్వం ఒక భావోద్వేగ రూపంగా పరిగణించాలనే విశ్లేషణలు ప్రారంభమైన కాలంలో కవిత్వాన్ని కేవలం భావరూప శక్తుల స్థాయికి పరిమితం చేసే ధోరణిగా సిద్ధాంతీకరించే అవగాహనగా అర్థం చేసుకోవాలి. ఇక్కడ ఇటువంటి చర్చలు, వాదాల పరిమితి కేవలం భావజాలాన్ని భావరూప శక్తులుగా నిర్ధిష్టించి భావజాలం యొక్క వాస్తవ అర్థాన్ని కుదించే ప్రయత్నంగా గ్రహిస్తే వారి సైద్ధాంతిక, తాత్త్వికపరిధి అవగాహన అవుతుంది. నిజానికి భావరూప శక్తులనేవి భావోద్వేగాలు, ఉద్రేకాలు, భావాలుగా మానవుని మెదడు ద్వారా గ్రహించబడి తిరిగి ప్రతిబింబమయ్యే వాస్తవికత క్రమం తప్ప మరొకటి కాదు. ఇక భావజాల విషయానికి వస్తే అది ఖచ్చితంగా మానవ చైతన్యపు రూపంగా భావిస్తే అది అనివార్యంగా మానవుని చారిత్రక పరిణామాక్రమపు ఫలితంగా చెప్పుకోవచ్చు. అయితే భౌతికవాద గతితర్కం మానవ చైతన్యాన్ని వాస్తవ చైతన్యం మరియు భ్రమాత్మక చైతన్యంగా గుర్తిస్తుంది. వాస్తవ చైతన్యం మరియు భ్రమాత్మక చైతన్యం అనేవి మానవ ఆచరణ

ప్రతిఫలంగా గ్రహించాలి, వాస్తవ చైతన్యం అనేది మరీ ముఖ్యం మానవుని అస్తిత్వాన్ని నిర్ణయించే ఉత్పత్తి సంబంధాలను మనం పునాదిగా వ్యవహరిస్తాము, ఈ పునాది ఉపరితలం ఏర్పడటానికి కీలకంగా ఉంటుంది. నిజానికి మావో ప్రస్థావించినట్లు అనుమేయంగా (ఊహింపదగినదిగా చెప్పుకోవాలి), అయితే ఖచ్ఛితంగా అన్వయ నియమంగా అని గ్రహించాలి అనగా సాధనమునకు సాధ్యమునకు గల నియతి సంబంధంగా ఉద్భవిస్తుంది (అధ్యారోపితం అవుతుంది). ఈ పునాది ప్రతిఫల ఉపరితలం, ఈ ఉపరితలపు వివిధ భావజాల సంస్థలు-భావజాల సంబంధాలు-భావజాలాల (అధ్యాసం) సామాన్య క్రమ పరిణామ ప్రక్రియపు ప్రతిఫల చైతన్యాన్ని మనం మానవుని వాస్తవ చైతన్యంగా గ్రహించవచ్చు, మానవుని కార్యాచరణలోని పరిమితిపర పాదార్థిక సంబంధ విధానము మరియూ పరిమితి కలిగిన సామాజిక సంబంధాల నుండి మానవుని చైతన్యం అనివార్యంగా తలక్రిందులుగా ఊహించడాన్ని, భావజాలంగా గుర్తించవచ్చు, దీనినే మనం భ్రమాత్మక చైతన్యంగా చెప్పుకుంటాము. ఇకపోతే మానవ సారాన్ని కవిత్వంగా పరిగణించడం అంటేనే మొత్తం మానవ సారాన్ని వైయక్తిక తారుమారు ప్రతిఫలనానికి కుదించడంగా, పరిమితిని ఏర్పర్చడంగా ఉంటుంది, వాస్తవానికి మానవ సారం అనగా మానవ సంబంధాల సమాహారంగా గ్రహించకుండా మానవ సారాన్ని అత్యంత పరిమితంగా కవిత్వంగా ఇరికించే వ్యవహారాన్ని ఖండించడం ఒక ముఖ్యమైన పనైతే మానవ ఆచరణ పునాదిగా సిద్ధాంత రంగాన్ని తయారు చేయడం తదనుగుణంగా విమర్శించి ఆచరణాత్మకం చెయ్యాల్సిన అవసరం ఇంకా మిగిలే ఉంది కూడా. అయితే ఇటీవల పరిశోధనల్లో జరిగే పొరపాటు ఏమంటే వ్యక్తి, వ్యక్తిత్వానికి ప్రాముఖ్యం వహించే చర్చలో అస్తిత్వవాద సందర్భంగా వాదించే వ్యవహారాన్ని గుర్తించవచ్చు. మానవ వ్యక్తి తన వ్యక్తిత్వాన్ని తన నిర్ణయాత్మకత ద్వారా తన అస్తిత్వాన్ని ఏర్పర్చుకుంటాడని వాదించడం, ఈ నిర్ణయాత్మకతే తన

వ్యక్తిత్వాన్ని ఆయా సందర్భాలలో అభ్యుదయ రూపంలోనూ లేదా లోపపు విధాన వ్యవహారంగా భావించే దృక్పథాన్ని, అలాగే ఆలోచనలు, ఆచరణలు సైతం వ్యక్తిత్వం నిర్ణయిస్తుందని సూత్రీకరించడం అనివార్యంగా ప్రవృత్తి వాదంగా మరీనూ సాహిత్య రూపంలో తన అస్తిత్వాన్ని నిరూపించుకునే అస్తిత్వవాదంగా గ్రహించవచ్చు, ఇటువంటి అస్తిత్వవాదాన్ని వెదజలుతున్న మేధావులు ఉండటం మన దురదృష్టం. అందుకే భౌతికవాద గతితార్కికం మానవులు జీవించడానికి కావాల్సిన ఉత్పత్తి కార్యాచరణ ద్వారా తమ జీవితాలను వారి స్వభావాలను బహిరంగపరుస్తారని, మానవుల ప్రత్యక్ష ఉత్పత్తి కార్యకలాపం ద్వారా పరోక్షపరంగా తమ పాదార్థిక జీవితాన్ని నిర్మించుకుంటారని నిరూపిస్తూ గతకాలపు అన్యవర్గ ధోరణులను ఖండిస్తూ విజయకేతనం ఎగరేస్తుంది. ఈ భౌతికవాద గతితార్కిక శాస్త్రీయత అన్ని రంగాలలోకి విమర్శనాత్మక దృక్పథ రూపంలో సాగాల్సిన కాలీ నేటికీ ఉండటమే అస్తిత్వవాదం కొనసాగడానికి అవకాశంగా గ్రహించాలి. వాస్తవికత అనే సంభావ్యత నుండి యధార్థతకు లోనయ్యే అంశాన్ని హేతుబద్ధ స్థాయిలో మానవుని సంవేదనలకు, ప్రత్యక్షతకు గ్రహకం, వివేచనకు గోచరమైన, తెలుసుకోబడదగినదిగా, మానవుడి ఆచరణాత్మకతలో వివేచనాత్మక ప్రతిఫలనంగా చెప్పుకోవచ్చు. మరింత లోతుగా గ్రహిస్తే వాస్తవికత దానికదే అస్తిత్వం, అస్తిత్వం దానికదే వాస్తవికతగా పరిణామం అని గ్రహించవచ్చు. కావున అస్తిత్వం అనే ప్రక్రియలో వాస్తవికత ఒక పరిణామాత్మక, పరివర్తనాత్మక వస్తువైవిధ్య ప్రతిఫలనంగా వ్యవహరిస్తుందని చెప్పుకోవచ్చు. అలాగే అస్తిత్వం వాస్తవికతగా చలామణి అవ్వడంలో అస్తిత్వంలోని గొలుసు కట్టు శ్రేణుల వస్తువైవిధ్యపు సుధీర్ఘ పరిణామక్రమపు, పరివర్తనాత్మకశీలతే కారణాలుగా చెప్పుకోవచ్చు, అయితే ఈ పరిణామంలో సామాజిక వాస్తవికతకు సామాజిక అస్తిత్వం మూలమైతే ప్రకృతి వాస్తవికతకు ప్రాకృతిక అస్తిత్వం మూలంగా ఉంటుంది. అందుకే భౌతికవాద గతితార్కికం చరిత్రను అధ్యాయణం

చేసేటప్పుడు రెండు పార్శ్వాలలో మనం దానిని చూడాలని అది ప్రకృతి చరిత్ర అని మరియూ మానవ చరిత్రగా సెలవిస్తుంది. ఈ రెండు పార్శ్వాలను విభజించలేమని మానవుడి అస్తిత్వం ఉన్నంత వరకూ ప్రకృతి చరిత్రను–మానవుడి చరిత్రను పరస్పరం ఆధారభూతమైనదిగా చెప్పుకోవాలని నిరూపిస్తుంది. ఇక మానవుని సాంఘిక భావరూపాలు మరియూ అతని నైతిక భావరూపాల ఆధారంగా ప్రాపంచిక దృక్పథాన్ని అంచనా వేయలేమనేది నిజమే అయితే ఈ సాంఘిక భావరూపాలు మరియూ నైతిక భావరూపాల వాస్తవికతను గ్రహించడంలో మన ప్రాపంచిక దృక్పథం తేటతెల్లమవుతుంది. అందుకే సాంఘిక మరియు నైతికాంశాలు ఆయా నిర్ధిష్ట సామాజిక సంబంధాల పరిధిలోని చట్రం నుండి ఏర్పడే అంశాలుగా గ్రహిస్తూనే నిర్ధిష్ట సామాజిక సంబంధాల గర్భం నుండే నూతన సంబంధాలు ఉద్భవించే పరిస్థితుల ప్రతిఫలనంగా ఏర్పడే సాంఘిక నైతికాంశాలను సైతం చూడవచ్చు. వీటి ప్రతిబింబంగా వెలువడే సాహిత్యాన్ని అలాగే కవిత్వాన్ని సైతం చూడవచ్చు. ఇకపోతే మానవుని లక్షణాల అధ్యారోపితంగా దైవీక రూపాన్ని నిర్వచించే భారతీయులు ఆ లక్షణాలైన జ్ఞాణ, బలైశ్వర్య, వీర్య, శక్తి, తేజస్సౌశీల్య, వాత్సల్య, మర్దవార్జవ, సౌహర్ద, సామ్య, కారుణ్య, మాధుర్య, గాంభీర్య, ఔదార్య, చాతుర్య, స్థైర్య ధైర్య, శౌర్య, పరాక్రమ, సత్యకామ, సత్యసంకల్ప, కృతిత్వ, కృతజ్ఞతాద్యసంఖ్యేయ, కల్యాణ గుణగణౌఘమహార్ణవం వంటివి అనివార్యంగా తమ భౌతికవాద దృక్పథం నుండి సాహిత్యంలోకి సైత్యం వినియోగించడాన్ని చూడవచ్చు. అందుకే కవిత్వం సైతం ఈ మానవ లక్షణాలను ప్రతిబింబిస్తూ వెలువడటం ఒక చారిత్రక మానవ సంబంధాల సమాహారంగా వ్యక్తమయ్యే అనివార్యత. మానవ మస్తిష్కంలో గ్రహించబడే నూతన, ఉన్నత భావాల వాస్తవికత యొక్క అమలుకు జరిగే బలప్రయోగంలో సామాజిక మార్పుకు ఈ అనివార్య సాహిత్య సృజన సైతం ఉపయుక్తమైనదే అయితే ఈ సాహిత్యం విప్లవ వెల్లువలో పక్కకు నెట్టబడే వాతావరణం

అభివృద్ధి చెందుతుంది కూడా, కేవలం సాహిత్యానికే ఈ పరిస్థితి కాదు అన్ని శాస్త్రాలకు, తత్త్వశాస్త్రానికి కూడా జరిగే ప్రక్రియగా గ్రహించాలి. ఇటువంటి మానవుని విప్లవాత్మక కార్యాచరణ ఫలితంగా దాని వెల్లువలో అది సాధించిన ఒక సమూల మార్పు నుండి తనకంటూ నూతన భావజాలాన్ని నిర్మించుకునే వాతావరణం సైతం ఏర్పడుతుంది కూడా. కావున మన సాహిత్య కృషిని ఒక నిర్దిష్ట కాలానికి సంబంధించినదని అవగాహన చేసుకోపోతే అఖండతకు గురై ఛాందసవాద మార్గంలో ఇంకిపోవడం సహజం.

***

సాహిత్యానికి సంబంధించినంత మేరకు అది కేవలం బాహ్య ప్రేరణతో ముందుకు సాగుతుందనే భావం ఇప్పటికీ చెలామణి అవుతుంది, నిజానికి భారతీయుల సాహిత్యంలోకి భావవాద దృక్పథం మెండుగా కనపడుతుంది. ఆటవిక–జాతుల మతాల ప్రేరణ సాహిత్యంలో సైతం చొప్పించడం ఒక యాదృచ్ఛికమైన విషయంగా లేదా ఉద్దేశితపూర్వకమైన విషయంగా గోచరించినా అది అనివార్యంగా ఆయా సమూహాల అనగా తెగల–జాతుల జీవనవిధానం మరియూ వారి ప్రత్యేకతల ఫలితంగా మతాల అభివృద్ధే కాకుండా వారి సాహిత్యం సైతం ముందుకు వస్తుంది. అందుకే మానవుని జీవనవిధానం ఒక నిర్ణయాత్మకమైన వ్యవహారంగా మనం గ్రహించాలి. అంతేకానీ బాహ్య శక్తుల ప్రేరణ మరియూ మానవుని స్వీయాత్మక భావవాద దృక్పథం కానే కావు. అలాగే సాహిత్యం ఒక పరిమితిపరమైన వ్యక్తీకరణగా ఉండటం అనివార్యం ఎందుకంటే నిర్దిష్ట పరిస్థితుల చలామణిలో వ్యక్తమయ్యే వ్యవహారంగా పరిగణించే దృక్పథం అనేదాన్ని గుర్తించటంలో ఒక వెనెకడుగులో ఇప్పటికీ ఉన్నామనేది ముఖ్యం. కావున అనివార్యంగా మనం గత కాలపు దృక్పథాలను మోసుకెలుతూ ముందుకు సాగడాన్ని గ్రహించవచ్చు. ఈ దృక్పథాలు అభ్యుదయ దృక్పథాలలో మరియూ విప్లవాత్మక

దృక్పథాలలోకి సైతం చొచ్చుకు రావాడాన్ని గమనించవచ్చు, అయితే ఈ రూపం యొక్క మనుగడ అనివార్యంగా నూతన రూపాలల్లో వ్యక్తం కావడాన్ని గుర్తించగలం. నిజానికి ఈ గమనిక అనేది అనివార్యంగా సాహిత్యం యొక్క వస్తువును ఆధారం చేసుకుని అంచనాకు రావడం జరుగుతుంది. ఇక మీదట ఆ వస్తువు ఆధారం ఏమిటి అంటే వాస్తవికతగా సాగడం, అంటే ఈ వాస్తవికత అనేది అనివార్యంగా అస్తిత్వంపై తమ వైఖరి ఎమిటి అనే సమస్య నుండి అనగా అస్తిత్వానికి–ఆలోచనకూ మధ్య సంబంధం ఏమిటి? మరీ ముఖ్యంగా అస్తిత్వానికి ఆలోచనకు మధ్య ఏకత్వం ఉన్నదా అనే ప్రశ్నను ఉదయింప చేస్తుంది. ఈ ప్రశ్నల సమాధానలపై ఆధారపడి మనం వాస్తవికత యొక్క అర్ధాన్ని, నిర్వచనాన్ని ఇవ్వగలం, ఈ నిర్వచనం ఆధారంగా సాహిత్య వస్తువును గ్రహించవచ్చు, అనగా ఆ వస్తువు యొక్క దృక్పథం అనివార్యంగా భావవాదమా లేక భౌతికవాదమా లేదా ఆయా ధోరణులలో వ్యక్తమైనదా గమనించవచ్చు. ఇక ఈ సమస్యను గ్రహించిన పిమ్మట ఆ వస్తువు అనగా వ్యక్తమయ్యే వ్యక్తీకరణను(రూపం లేదా శిల్పం) అంచనా వెయ్యగలము. ఈ వ్యక్తీకరణకు సైతం అనగా చక్కని వ్యూహము, అందమైన మాటల పొందిక, శ్రావ్యమైన పదపొందిక, శ్రావ్యమైన పద ప్రయోగం, కళాత్మక భాష, భావ చిత్రాలు, ప్రాసానుప్రాసలు, అలంకారాలు, జాతీయాలు, నుడికారాలు, సాంప్రదాయాలు వగైరాలు ఆయా వస్తువు యొక్క విషయ అస్తిత్వంగా, వ్యవస్థీకృత నిర్మాణంగా భావించడం జరుగుతుంది. నిజానికి ఈ వ్యక్తీకరణ అంశంలో వాస్తవికతాంశాలు ప్రతిబింబించవచ్చు కానీ ఈ వాస్తవికతా రూపాల యొక్క పరిధి, పరిమితి అనివార్యంగా వస్తువు యొక్క వాస్తవికతపై ఆధారపడుతుంది, అందుకే రూపంలో వాస్తవికతాంశాలు ప్రస్థావించినా అనివార్యం వస్తువు ఊహాత్మకమైనదిగా ఉండటంతో పరోక్షంగా భావవాదాన్ని కొనసాగించడంగా అర్ధం చేసుకోవాలి. అందుకే వస్తువు వాస్తవికతపై ఆధారపడితే అనివార్యంగా రూపం సైతం ఒక ఆధర్శవంతమైన వ్యక్తీకరణగా సాగాలి కూడా. అప్పుడే దాని యొక్క వాస్తవికతను నిరూపించుకోవచ్చు.

అయితే ఈ నిరూపణం అనివార్యంగా కేవలం మంచి వ్యవహారంగా మాత్రమే పరిమితింప చేస్తే కేవలం ఒక పార్శ్వాన్నే ఆమోదించినట్లవుతుంది అందుకే చెడు అనే విషయాన్ని సైతం అనివార్యంగా గ్రహించే పార్శ్వాన్ని సైతం గుర్తించాలి. అప్పుడే గత కాలపు చెత్తను, వృధాను వదిలించుకోవడంతో పాటుగా వర్గ స్వభావాన్ని సైతం కల్పించుకోవడం, వర్గ దోపిడీని సైతం గుర్తించడం అనివార్యం. ఇక ఎప్పుడైతే సాహిత్యానికి సైతం అనివార్యంగా వర్తించే పరిణామక్రమ శాస్త్ర నియమాలు, చలన శాస్త్ర నియమాల ఫలితంగా అన్ని రకాల విభాగాలను శాస్త్రాల అంతఃసంబంధ–అంతర్గతాభివృద్ధిని గ్రహించడం మూలంగా నిర్దిష్ట సామాజిక ప్రత్యేక రూపాల భావజాలలను భారంగా మోసే కాలం నుండి దూరంగా జరిగాము కూడా, కానీ అనివార్యంగా గతితర్కంపై అవగాహనలోని మన పరిమితి మనల్ని శాస్త్రీయులను చేయడం లేదు. సాహిత్యం యొక్క విభిన్న అంశాలను వాటికవే స్వతంత్రమైన అంశాలుగా మనం గ్రహిస్తే అనివార్యంగా దానికి మనం పరిమితిని ఏర్పర్చే పద్ధతిలోకి దిగజార్చడం అవుతుంది, ఈ వాతావరణం అనివార్యంగా ఆనాటి శ్రమ విభజన మరియూ పంపిణీ సంబంధాల వ్యవహారమని మనం గమనించాలి కూడా. కావున సాహిత్యమనే భావజాలంపై అత్యంత ప్రభావశీలమైనది శ్రమ విభజన మరియు పంపిణీ సంబంధాలని గ్రహించాలి, మారుతున్న సాహిత్యానికి సైతం శ్రమ విభజన మరియు పంపిణీ సంబంధాల మూలాన్ని అర్ధం చేసుకోవడం శాస్త్రీయ దృక్పథం.

1) సాహిత్య గతితర్కం అనగా మానవ ఉత్పత్తి విధానం దాని ప్రతిబింబపు మానవుని చైతన్యయుత కార్యకలాపం, సాంప్రదాయాలు, భావజాలం మొదలైన వాటిని, నిర్థిష్ట పరిస్థితుల దశలుగా వాటిని గుర్తించడం, ఈ దశల యొక్క పరివర్తనాత్మకత, పాతది నశించుట కొత్తది ఆవిర్భవించుట, క్రింది స్థాయి నుండి పై స్థాయికి చేరే జ్ఞాణంగా ఉంటుంది.

2) ఇకపోతే సాహిత్యం అనే ప్రక్రియలో మానవుని చైతన్యయుత సృజన, చైతన్యయుత పాత్రను గ్రహించడం కీలకంగా ఉంటుంది, అయితే ఈ చైతన్యయుత ప్రక్రియ వాస్తవికత యొక్క ప్రతిఫలనంగా గ్రహించాలి.

3) పరిణామక్రమ శాస్త్రపు అన్వయంలో సాహిత్యం సైతం జడత్వం కలిగినది కాదని సాహిత్యం చారిత్రక పరిణామంలో భాగమని, మరియూ చలనశీలనమైనదని గ్రహించాలి. ఈ నిర్ధారణ అనివార్యంగా చారిత్రక పరిణామన్ని గ్రహించడం-తెలుసుకోవడం ముఖ్యం.

4) ఐతే సాహిత్యంలోని వస్తువు అనివార్యంగా ఆనాటి మానవ సమాజం యొక్క ఉత్పత్తి విధానం, సాంఘిక-నైతికాంశాలను ప్రతిఫలించేదిగా ఉంటూ, కొన్ని టిపికల్ పాత్రలను పునఃసృష్టించే ప్రక్రియగా సాగడమే సాహిత్యంగా భావించడం జరుగుతుంది.

5) ఈ సాహిత్యం ఉన్నది ఉన్నట్లు ప్రదర్శించే ధోరణిగా ఉండకుండా అనివార్యంగా వాస్తవికత యొక్క మార్పులను ప్రతిఫలించడం అనివార్యం కూడా, అందుకే విప్లవాత్మక సాహిత్యం కూడా వెలువడుతుందని మనం గమనించగలము.

ఈ విధంగా సాహిత్యం అనే భావజాలాన్ని అన్ని సాహిత్యపు అన్ని రంగాలను విమర్శించే, సమన్వయపరిచే విధానంగా భౌతికవాద గతితార్కిక శాస్త్రం అభివృద్ధి చెందిందిగా గుర్తించాలి, అందుకు అణుగుణంగా మన ఆచరణ మారాలి. నిజానికి ఈ దృక్పథం ఒక పాత చింతకాయ పచ్చడని లేదా అదొక పనికిరాని వాదమని, భారతీయతను సంతరించుకోదని వాదించే వారు పెరిగిపోయారు. అందుకే భౌతికవాద గతితార్కిక వాదాన్ని కేవలం ఫ్యాషన్ గా చర్చించే వాదంగా కన్నా వజ్రాయుధంగా ఉపయోగించే వాతావరణం ఏర్పడాలి. దీనికి ముఖ్యమైన పని ఏమంటే సైద్ధాంతిక స్థాయిలో అన్యవర్గ ధోరణలను ఎదుర్కుంటూ అచరణలో విప్లవాత్మక స్థాయిని విస్తృతపరచాలి. సాహిత్యం కేవలం వితండవాద స్థాయిలోనే ఇప్పటివరకూ ఉండటాన్ని చూసాము

అనగా కేవలం ఆచరణ అనే దృక్పథాన్ని వదిలి వాదించే వ్యవహారం, కావున ఈ వితండవాదాన్ని ఆచరణ అనే మౌళిక వాస్తవికతను ప్రతిష్ఠించి విప్లవాత్మక మార్పును కలిగించాలి.

***

ఇకపోతే ఈనాడు విభిన్న సాహిత్య ప్రక్రియల్లో ప్రేమ తత్త్వం అనే అంశాన్ని ప్రతిష్ఠించి చర్చించే వాతావరణాన్ని మనం విరివిగా చూడవచ్చు. నిజానికి ప్రేమ సాహిత్యమంటూ ఒకటి వెలువడటం దానికి పునాదిగా ప్రేమ తత్త్వాన్ని ఆవిష్కరించడం ఒక మార్గంగా ఈ నాడు ఉంది, అయితే ఈ ప్రేమ సాహిత్యం అనుకున్నంత స్థాయిలో విమర్శకు గురికాకుండా ఆదరణ పొందే కాలాన్ని గ్రహించవచ్చు, కానీ ఈ ప్రేమ సాహిత్యం ఒక రకంగా మానవుల పరస్పర సంబంధాల నుండి ఆవిర్భవించిన ప్రేమను వివిధ మానవ సంబంధాలపై ఆధిక్యతను సాధింపచేసి తన పరిధిలో ఆ సంబంధాలను విశ్లేషించడం, అంచనా కట్టడం, సమన్వయీకరించడం జరుగుతుంది. నిజానికి ఈ ప్రేమ అత్యంత స్పష్టంగా స్త్రీ-పురుషుల సంభోగ సంబంధమైన లైంగిక ప్రేమగా, నువ్వు-నేనుల స్థాయిలోని సంబంధంగా గ్రహించాల్సిన అవసరం ఉంది, అయితే ఈ లైంగిక ప్రేమను అన్ని మానవ సంబంధాల స్థాయిలో ఇరికించి వాటిని పవిత్రం చేసే భాద్యతను మోస్తున్న సాహిత్యకారులు అనర్గలంగా ఉద్భవిస్తున్నారు. అయితే ఈ సమాజం ఒక వర్గ వైరుధ్యంపై, వర్గ పాలనపై ఆధారపడి సాగడం ఒక అనివార్యపు భౌతిక వాస్తవికత, కావున వర్గ వైరుధ్యంపై లైంగిక ప్రేమను ప్రతిష్ఠించి సామరస్యపూరిత ప్రేమ సంబంధంగా మానవ సంబంధాలను నడపాలనే వాదానికి తెరలేపడం మన దురదృష్టంగా చెప్పుకోవాలి. నిజానికి వాదవివాదలలోని సంక్లిష్టతల నుండి, హేతుపూర్వకమైన చర్చలకు దూరంగా ప్రతీదీ ప్రేమ తత్త్వంగా ప్రతిష్ఠించే వాతావరణం అనివార్యంగా ఆ సామాజిక సంబంధ పరిథిని దాటి ముందుకు పోకుండా

సాగాలని భావించడంగా అర్థం చేసుకోవాలి. ఈ రోజుల్లో భౌతికవాద గతితార్కిక రాజకీయపరమైన పంథా, వ్యక్తివాద పంథా అనే అంశాలను కలగాపులగం చేసి వ్యవహరించడం ఒక ప్రధాన సమస్యగా చూడవచ్చు. వ్యక్తుల అభీష్టాన్ని భౌతికవాద గతితార్కిక రాజకీయపరమైన పంథాగా మార్చడాన్ని వ్యతిరేకించకుండా వ్యక్తిగత నిర్ణయాలనే రాజకీయం చేయడం భౌతికవాద గతితార్కికంగా అనిపించుకోదు. అది వ్యక్తివాద పంథాగా మరీనూ స్వీయాత్మక భావవాద ధోరణిగా ఉంటుంది. ఈ వ్యక్తివాదం ఒక రాజకీయ రూపంలో చలామణి అవుతుంది దాన్నే మనం పెటీ బూర్జువా సోషలిజంగా చెప్పవచ్చు. ఈ పెటీ బూర్జువా వర్గం ఒక సందర్భంలో తమ రాజకీయపర వ్యక్తివాదాన్ని తీవ్రస్థాయిలో కొనసాగిస్తున్నప్పుడు అత్యంత అభ్యుదయంగా గోచరించవచ్చు, కానీ అంతిమంగా కార్మికవర్గ రాజకీయపరమైన ధోరణి దీనిని అధిగమిస్తుంది, అధిగమించాలి కూడా. నిజానికి ఈ వర్గ దృక్పథం-దాని భావజాల రూపంగానే ప్రేమ సాహిత్యాన్ని అంచనాకట్టాలి. ఇకపోతే నేడు మానవుడు తన సుఖ అన్వేషణ కోసం అనివార్యంగా తన పనుల ఫలితార్థం మరీనూ దానిని అంచనా కట్టి ఇతరులతో సమన్యాయంగా వ్యవహరించడంతో వైరుధ్యాలు ఉద్భవించకుండా సామరస్యతను కలిగించుకోవడమనే రూపం నుండి సాహిత్యాన్ని వెలువరించడాన్ని చూడవచ్చు. ఈ రూపంలో వ్యక్తి మొదటగా ప్రతీదీ అంచనా కట్టి బ్రతకాలనే విషయాన్ని నిరూపిస్తూ, ఈ అంచనాను తలక్రిందులు కాకుండా ఉండాలని సెలవిస్తుంది. ఈ అంచనాలోని తప్పులు అనివార్యంగా అనైతికాంశముగా వ్యక్తిని నిర్వచిస్తుంది. ఏమైనా ఈ అంచనాలలో మనిషి బ్రతుకుతే మానవుల మధ్య సమానత్వం ఏర్పడుతుందని ఈ సాహిత్యం వాదిస్తుంది. దీని కోసం ఏదో ఒక మానవ సంబంధాన్ని ప్రధానం చేసి మిగతా వాటిని దాని పరిమితిలో అన్వేషించడం జరుగుతుంది. కానీ ఈ వ్యక్తీకరణలో ప్రేమ రూపం అత్యంత జనరంజకంగా సాగడాన్ని గ్రహించాలి. మితవాద పెటీ బూర్జువా

వర్గాల ఆధిక్యతలో ఇంతకు మించి మనం ఆశించేది ఏముంటుంది. అందుకే వర్గ పోరాటాన్ని సాహిత్య రంగంలో సైతం నిర్వహించడం మన తక్షణ కర్తవ్యం.

***

ఇకపోతే నాడు రివేరా తన కవిత్వం ద్వారా వాస్తవికతను ప్రతిబింబించడంకై సంపూర్ణవంతంగా పరివర్తన చేసుకోవడం అనే ప్రక్రియలో తీవ్ర చైతన్యయుత మదనము లేక భావ సంఘర్షణను చూపడంలో విభిన్న సన్నివేశాలుగా, రూపాలుగా ప్రతిష్టించడం జరిగింది, జరుగుతుంది కూడా. అయితే సంఘటనల యాదృచ్ఛికతలను రివేరా యొక్క వైయక్తిక తారుమారు ప్రతిఫలనంలో నిర్ధిష్ట ఆవశ్యకతగా చూపడానికి ప్రయత్నించే సంకల్పం ఉన్నదని గ్రహించవచ్చు. అందుకే ఈ ఆవశ్యకతను స్పష్టపరిచే ముందు తన యొక్క కవిత్వం ద్వారా తన దృక్పథాన్ని బహిరంగపరుస్తున్నాడు. ఈ వ్యక్తీకరణ ఖచ్చితమైన వస్తువు యొక్క వాస్తవికతపై తన వైఖరిని నిరూపిస్తూ సాగడం రివేరా కవిత్వపు విశేషంగా అర్థం చేసుకోవాలి. కావున రివేరా కాలం కన్న కవిగా చెప్పుకునే నిర్ధిష్ట పరిస్థితులను అంచనా కట్టవచ్చు. అయితే కాలంలో తన ప్రయత్న పరిశ్రమను చూపే పాత్రను సైతం గ్రహించే సందర్భాన్ని కూడా అంచనా వెయ్యవచ్చు. అందుకే రివేరా స్థలంలో ఇరికించబడ్డ, ఇరకబడ్డ కవిగా చెప్పుకోలేము, అతను కాలాన్ని ప్రతిఫలిస్తూ సాగిపోయే కవి, కావునే తన భావజాల రంగాన్ని విస్తృతపరుచుకుని దానిలో సంలీనం చెందుతూ ప్రయాణిస్తాడు. అందుకే రివేరా...

"గొంతుని

ఇప్పటిదాక

కంటనాళమని

సైన్సులోకి తర్జుమా చేసేవాడ్ని......"

"గాత్రాన్ని

ఇప్పటిదాక

స్వరమని

సంగీతంలోకి తర్జుమా చేసేవాడ్ని......."

ఇలా తర్జుమా అనే కవిత్వంలో చెప్పుకుంటూ......

"ఇప్పుడిక

గొంతుని విప్లవంలోకి

గాత్రాన్ని జనంలోకి

గానాన్ని ఆయుధంలోకి

తర్జుమా చేస్తున్నాను..."

"అంతిమంగా రాజ్యాన్ని హంతకుడిలోకి

హంతకుడ్ని మృత్యు కౌగిళ్ళలోకి

తర్జుమా చేస్తున్నాను.."

మానవుడు ప్రకృతి-సమాజాల ప్రతిఫలనంగా గ్రహించాలి. ఈ ప్రకృతి-సమాజాలు పరస్పర ఆధారితమైనవి కావున మానవుడు ఈ రెండిటి మధ్య ఆచరణ-పరిశ్రమ-ప్రయోగం ద్వారా ప్రకృతి మానవీకరణ, మానవీయ సామాజిక అస్తిత్వంగా వ్యవహరిస్తాడు. ఇక్కడ రివేరా తన కవిత్వం ద్వారా స్పష్టంగా తన పై ఉన్న ప్రాకృతిక అవగాహన నుండి నేరుగా విప్లవాత్మక సామాజిక ఆచరణను వ్యక్తం చేయడాన్ని గ్రహించవచ్చు. ఇంత స్పష్టంగా ఉన్న కవిత్వం ఈ నాడు ఒక వాస్తవం రేపటికి ఒక ఆదర్శం, పోనుపోను ఒక ఊహాత్మకమని భావించే క్రమం కూడా అనివార్యమైన

సామాజిక ఆచరణను గ్రహించాలి. విప్లవం యొక్క కార్యాచరణను పరిగణిస్తే అదొక గతకాలపు వికాసం వర్తమానపు ప్రయోగం, భవిష్యత్తు ఫలంగా చర్చించే సాహిత్య ప్రక్రియ. అందుకే రివేరా తర్జుమా అనే కవిత్వంలో ...

"అయితే పచ్చటి వనాల వేదిక మీద

చిందాడే కోకిల ముక్కలుగా రాలిపడడం

నా తర్జుమాల దిక్కుల్నే మార్చేసింది..."

ఇక్కడ రివేరా భారతదేశంలో జరిగిన, జరుగుతున్న విప్లవోద్యమంలోని మరణాల ప్రభావాన్ని ప్రస్థావిస్తున్న వాతావరణం గోచరమవుతుంది. ప్రపంచ విప్లవోద్యమాలలోని వియత్నాం యుద్ధంలో స్వీయ సమర్పన ద్వారా సంచలనాత్మకమైన వ్యవహారాన్ని కలిగించి తమపై జరుగుతున్న అన్యాయాన్ని, మారణహోమాన్ని బహిరంగపరిచే విధానంగా, అభివృద్ధిగా భావించే యుద్ధ ఎత్తుగడగా అర్థం చేసుకునే సామ్రాజ్యవాద సంస్కృతి మనపై ఉండటం ఒక తప్పించుకోలేని పరిస్థితి. అయితే ఈ పద్ధతినే ఇక్కడి విప్లవోద్యమం వాడుకుంటూ సాగుతుందని వాదించే మన భారతీయ వ్యూహకర్తలు లేరని కాదు. కానీ ఇక్కడ జరుగుతున్న విప్లవోద్యమంలోని మారణాల మూలము వర్గ సమాజం ఫలితంగా గ్రహిస్తే ఈ అమరత్వం అనే భావన మానవుని ఆదిమ స్థితిలో మరణించిన మానవులను స్వప్న స్థితిలో సజీవంగా పరిగణిస్తూ మరణం లేని వారుగా భావించే క్రమంలో ఉద్భవించినదని భౌతికవాద గతితార్క సిద్ధాంతం స్పష్టపరుస్తుంది. రివేరా తన సామాజిక విప్లవాత్మక చైతన్య కార్యాచరణను కవిత్వం ద్వారా వ్యక్తం చెయ్యాలని, ఆ విధంగా ఆ కవిత్వంలో కేవలం ప్రజా పరమైన చైతన్యాన్ని వ్యక్తం చేస్తూ, రంజకమైన ఆర్భాటాన్ని వదిలి సాగటాన్ని చూడవచ్చు...

"....అట్టాంటి కవితలో

సంగీతమో, సన్మానమో లేదు

జనం గానాలు, ఖండిత గొంతులు తప్ప

అట్టాంటి కవితలో అర్భాటమో, ఆడంబరమో లేదు

ఒట్టి చేతులు, ఓటి బతుకులు తప్ప

అట్టాంటి కవితలో

నేనో, నా గొడవో లేదు

జ్ఞాత వెన్నలలో, అజ్ఞాత వసంతాలు తప్ప"

ఇక తన దృక్పథాన్ని పెట్టుబడీదారీ వ్యవస్థ యొక్క వ్యాపార దృష్టిని వ్యతిరేకించే దిశగా సాగడాన్ని చూడవచ్చు. అందుకు రివేరా ఇక్కడ తన కవిత్వం ద్వారా వ్యక్తం చేస్తున్నాడు...

"........అవును

హైటెక్కర్ల చేతుల్లో

పసిగుడ్డులు నెత్తురు ముద్దలవుతున్నారు

పెయ్యి నుంచీ, పెంట దాకా

పాపల్నుంచీ, పడతుల దాకా

ఇక్కడంతా అమ్మకపుతనమే!"

ఈ సమాజంలో ప్రతీదీ సరుకలమయమని అత్యంత సులభంగా, భేషజాలు లేకుండా కవిత్వం ద్వారా వ్యక్తం చేయడమే మన రివేరా ఎంచుకున్న వ్యక్తీకరణ యొక్క సరళత, స్పష్టత, ఇక్కడ ఈ క్రింది కవిత్వంలోని గాడతను చుస్తే వస్తువు యొక్క సూటిదనం మనకు తెలుస్తుంది.

“.......నవ్వులమీద,

నడకల మీద

అదనపు ఛార్జీలేస్తాడు

అందం మీద,

పలుకుల మీద

ప్రత్యేక ధరలు పెడతాడు.....”

రివేరా తన కవిత్వాన్ని విప్లవ ప్రజా దృక్పథంగా ప్రతిష్టించి వ్యవహరిస్తున్నాడు కాబట్టే ఇక్కడ తన కవిత్వంతో వైషమ్యంగా పద్యం యొక్క పరిణామాన్ని విమర్శనాత్మకంగా కవిత్వ రూపంలో వ్యక్తపరుస్తూ

“పద్యం పునాది మీదే

యిక్కడ అనుమానం

పద్యం మూడు పూట్ల

బతుకుతుందా అనేదే యిప్పుడు సందేహం”

పద్యంపై రివేరా ఎందుకంత నిక్కచ్చిగా వ్యవహరించాడు అంటే అదే కవితలో

“ఊళ్ళకి ఊళ్ళు

జేబుల్లో అదృశ్యం అవుతుంటే

రవీంద్ర భారతిలో

సన్మానాలందుకుంది పద్యమే కదా” అని అంటూ

జీవికల్లోంచి

నిరసనల్ని ఒంపుకొని

కంజెర ఊరేగింపవుతుంటే

అబిడ్స్ లో

అవధానాన్ని చప్పరిస్తుంది పద్యమే కదా!"

ఇక్కడ కవి అత్యంత స్పష్టంగా పద్యం యొక్క వర్గ పాత్రను తేటతెల్లం చేస్తున్నాడు. తరతరాలుగా పద్యం యొక్క వర్గ పాత్రను ఈ సందర్భంగా విశ్లేషిస్తే నిజానికి భాషాపర ప్రాధాన్యతను, సౌందర్యాత్మకను లేదా తమ పరిధిలో వాస్తవికతను భావవాద పరిధిలో వ్యక్తం చేసే భావజాలంగా చెప్పుకోవచ్చు ఐతే మరొక పార్శ్వంలో అదే పద్యం యొక్క రూపంలో అభ్యుదయవాదం కూడా వర్ధిల్లిన కాలము కూడా ఉన్నది. అయితే పద్యం కేవలం అవధానాల పరిమితిలో సన్మానాలకు మేధో ప్రదర్శనలకు పరిమితమైన విధానాన్ని విమర్శించి రివేరా అదే కవిత్వంలో పద్యానికి ప్రత్యమ్నాయంగా పాటను ప్రతిష్టించడం అదీ కవిత్వం ద్వారా వ్యక్తం చెయ్యడం ఒక విశిష్ట సందర్భం.

"..........మంకె నెర్రగా విచ్చుకొని

మేం రుధిర ప్రవాహాలమవుతుంటే

అంతర్జాతీయ తోవలేయడానికి

నెత్తురింకిన పాట మాకుండనే ఉంది" అని అంటున్నారు రివేరా...

ఈ సమాజం నిలబడటానికి, నిలదక్కుకోవడానికి మూలం మానవ శ్రమ అని మనం స్పష్టంగా అవగాహన చేసుకోవాలి, మానవ శ్రమ ఫలితంగా వానరుడు నుండి మానవుడిగా సృష్టించబడ్డాడని పరిగణిస్తాము. కావున శ్రమ అనే కీలకమైన సంబంధం అనివార్యంగా మానవుని జీవనానికి కావాల్సిన ఉత్పత్తి సంపద సృష్టిగా చెప్పుకోవాలి. అయితే ఈ శ్రమ యొక్క సంబంధాలు నిర్ధిష్ట ఉత్పత్తి శక్తుల దశగా, నిర్ధిష్ట పరిణామంగా గుర్తించాలి. ఈ ఎరుకతో రివేరా పెటుబడిదారీ వ్యవస్థ యొక్క

శ్రమ సంబంధాలను కవిత్వ రూపంలో వ్యక్తం చేసారు..

".....ఎప్పటికప్పుడు శ్వాసనిచ్చే శ్రమ

దోపిడీ కక్కే పెట్టుబడి కౌగిట్లో

మృత్యువుని పెంచి-పెద్ద చేస్తుంది....."

ఈ పెట్టుబడిదారీ వ్యవస్థ యొక్క శ్రమ విషయంలో శ్రమ శక్తిగా అర్థం చేసుకోవాలి. ఈ శ్రమ శక్తి యొక్క పరాయికరణను అనగా కార్మికులు తమ శ్రమ శక్తిని ఉత్పత్తిపై అధ్యారోపితం చేస్తారు. ఫలితంగా రివేరా కవిత్వంలోనే అది జరిగే వ్యవహారాన్ని ఇక్కడ చూడవచ్చు, అదేమంటే ఈ క్రింది కవితలో

"...శ్రమ గాసిన ప్రతిఫలం మీది కావడం లేదు

శ్రమ పూచిన భవిష్యత్ మీకు అందడం లేదు..."

ఈ దోపిడీ నుండి కార్మికులు సంఘటితం కావాల్సిన అవసరం ఉన్నది. ఈ అవసరాన్ని పట్టుకోవడంలోనే విప్లవాత్మక కవిత్వపు కర్తవ్యంగా ఉంటుందని రివేరా నిరూపిస్తున్నారు. అందుకే తన కవిత్వ నిర్మాణంలో ఒక ప్రతిపాదన- పరిశోధన- నిర్ధారణగా ఉండటంతో దానికదే సంపూర్ణ రూపంగా సంతరించుకుని మనల్ని గమ్యం వైపుకు తీసుకువెలుతుంది. ఇక్కడ ఈ క్రింది కవిత్వంలో శ్రమ యొక్క అవసరాన్ని, శ్రామికులకు దాని పాత్రను చూడవచ్చు.

"శ్రమ మీది-

శ్రమలోంచి మొలిచిన సంపద మీది-

శ్రమ గొంతులో పిగిలిన పాట మీది

మీ అడుగు కదలిక చలనం కన్నా

మీ పలుగు పార గొడ్డలి కన్నా

మీ ప్రియమైన బతుకు శ్వాసకన్నా

శ్రమ విలువైంది మాత్రమే కాదు,

మిమ్మల్ని మీరు నిలుపుకోవడానికి అవసరమయినది కూడా...”

అయితే రివేరా కవిత్వంలో ఉన్న సృజన ఏమంటే తను కార్మికుల లక్ష్యాన్ని సైతం నినదించడాన్ని మన అందరి ముందు చూపడంలోనే కవిత్వం యొక్క విప్లవ భవిష్య పాత్రను ఆవిష్కరించడం ఈ స్థితిని తన ఈ క్రింది కవిత్వంలోనే వ్యక్తం చేస్తున్నారు..

“కాబట్టే

ఘర్షణ పడండి

వెయ్యి పిడికిళ్ళ మైదానాన స్వేచ్ఛ పండుతుంది.

సమూహంతో విరుచుకు పడండి

పురిటి నొప్పుల మధ్య శ్రమ తీసే వసంత గానం మీదవుతుంది...”

భారతదేశంలో క్రమానుగతంగా నిరంకుశత్వ హైందవ ఫాసిజంగా రాజకీయ రూపంలో అధికారంలోకి వచ్చిన మెజారిటీ మతోన్మాదం అనివార్యంగా మైనారిటీ మతవాదాలను బూచిగా చూపుతూ అనివార్యంగా కలహశీల రాజకీయ వాతావరణంలో జాతీయవాదాన్ని పెంపొందించి పబ్బంగడుపుకోవడం మన అనుభవం, అందుకే రివేరా “వాడు మాసిన గాయాలను గునపాలతో తవ్వి వెర్రి ఉన్మాదానికి మిన్నగా ఓట్లు చేసుకుంటున్నాడు హిందూత్వాన్ని...” అని సెలవిస్తున్నారు, అలాగే “వాడు గింజలు చల్లి పిట్టల్ని పట్టే వేటగాడికి దీటుగా నోట్లు చేసుకుంటున్నాడు భారతీయతను” నిజానికి ఈ పరిణామాన్ని కవిత్వంలో ప్రతిఫలించే భాద్యతను రివేరా తీసుకోవడం

ఆనాటికానాటికీ పెరుగుతున్న మతోన్మాద తత్త్వపు భాదితులను స్పృహగా వ్యక్తీకరించడం విప్లవ కవిత్వానికి ఒక అవసరంగా మారింది కూడా. అందుకే రివేరా నిర్ధిష్ట అస్తిత్వాలపై తన కవిత్వాన్ని వెలువరించడం జరిగింది. ఈ నేపథ్యంగా ఈ కవిత్వాన్ని ఇక్కడ ప్రస్థావించుకోవాలి..

"ఎదలమీది నెత్తుటి ధార
చందమామల్ని
చచ్చే దాక ప్రశాంతంగా ఉండనీయదు
మోకాళ్ళ మీద వంగి
"అల్లాహొ అగ్బర్" దువాల్తో
కళ్ళు మూసుకున్నా
మా తల్లులు సీలాలిడిచేయాల్సిందే
మా బిడ్డలు నెత్తుటి బెడ్డలవ్వాల్సిందే
సున్తీలతో ఏదీకాదు
వంటి మీది
బానిస తోలు వలిచేయాల్సిందే.."

అయితే ఈ మైనార్టీ మతాల విషయంలో వారికి కొన్ని హక్కులను కల్పించి, నడుచుకోవడం భాద్యత అనీ, కానీ ఇక్కడ రాజ్యాంగం కల్పించిన హక్కులు లేదా భద్రాతాపరమైన జీవిత హామీకి మించి తమ బ్రతుకులు కొనసాగడానికి అవసరమైనదాన్ని వెతికే వాతావరణం ఏర్పడిందని వాదించడం నేడు చూడవచ్చు. దీనిని కవిత్వ రూపంలో రివేరా ఆవిష్కరించడాన్ని గమనించవచ్చు.

"మాకిపుడు వాడి అవకాశవాద సెక్యులరిజం కాదు
మా కోసం నిలబడే

నెల వంకల దారి కావాలి.

ఓ వ్యక్తిత్వం కోసం

ఓ అస్తిత్వం కోసం

నిప్పులు చెరిగి

మేం అవిరయితే

వాడి జాలి కన్నీళ్ళ ఎక్స్ గ్రేషియా కాదు

మా పాటల గాయాల్ని

మాజీదుల మీదుగా మోసుకెళ్లే

సముద్రాల గొంతు కావాలి"

ఇక్కడ మనం చరిత్రను వర్గ దృక్పథం నుండి గ్రహిస్తే నిర్దిష్ట చారిత్రక మలుపులు అనివార్యంగా మత రంగును పూసుకుని సాగాయని గ్రహిస్తే ఇస్లామ్ మతం కూడా అటువంటి మతాలలో ఒకానొకటిగా అర్థం చేసుకోవచ్చు. ఇటువంటి సందర్భం అనివార్యంగా ఆనాటి సమాజంలో మరీ ముఖ్యంగా మధ్యయుగాల మత భావజాలంగా పరిణమించడాన్ని దాని ప్రభావాన్ని గ్రహిస్తే, ఈ మతాల లక్ష్యాలు సైతం మనం గ్రహించాల్సిన అవసరం ఉంటుంది.

"తెగిపడ్డ నరాల పెత్తనంలో పులి దాహం

నిద్రపోయే ఆకాశం ముఖాన వేకువ నెత్తుటి గాటు

కనుగుడ్డుతో సహా

పురిటి స్వప్నాల సజీవ దహనం

ఉన్మాదమ్ జోరులో

పొలిమేర్లలో పడ్డ జ్ఞాపకం

ఆధిపత్యం కత్తి అంచున ఎన్నీ ప్రాణాలు

భళ్ళున పగిలి

చెల్లా చెదురైన పల్లె అడుగుల్లో ఎంతో పెనుగులాట

ఆనవాళ్ళా, కూడా మిగలని ఆస్థులు

చిట్లిన గొంతులో స్పష్టత పాట

అన్ని కాలాల భాదితుడు

ఈ దేశమిప్పుడో దళితుడు"

దళిత సమస్య అనేది భారతదేశంలో ఒక తీవ్రమైన సమస్యగా మనం దానిని గ్రహించాలి. ఈ సమస్య యొక్క పునాదిని భారతదేశం యొక్క ఆసియాటిక ఉత్పత్తి విధానంలో ఉన్నదని అయితే ఈ విధానం యొక్క స్వయం చలనం అనివార్యంగా మన ఉత్పత్తి సంబంధాలలో మార్పులకు మూలమైనదని గ్రహించాలి. ఈ దేశంలో కుల సంబంధాలు అనే వర్గ రూపం గురించి రివేరా తన కవిత్వంలో ఒక ప్రతీకాత్మకంగా చూపడం ఇక్కడ ముఖ్యం, నిజానికి దళిత సమస్యను మొత్తం దేశానికి విస్తరించాడని భావించవచ్చు, కానీ తన కవిత్వంలో కేవలం దళిత సమస్యకు పరిమితమై చర్చను లేవనెత్తట్లేదని, అతను ప్రస్తుత రాజ్య అణచివేత ద్వారా జరుగుతున్న నిర్భందాల నడుమ యావత్తు స్థితిని కూడా పరిగణించి దేశం దళితుడైనదని ప్రస్థావిస్తున్నాడని గ్రహించాలి. అంటే ఒక ఏక మొత్తంలో దానిని అవగాహన చేసుకోవాలి. అందుకే వర్గ వైరుధ్య నిర్మూలనా మార్గంతో పాటుగా ప్రజాస్వామ్య ప్రక్రియ స్థాపన అనే ద్విముఖ పార్శ్వాల కర్తవ్యంగా ఉండే భారత విప్లవం నేటి ఆవశ్యక ఆచరణ.

ఇకపోతే తెలంగాణ రాష్ట్రం అనే ప్రజాస్వామిక డిమాండ్ ఎందుకు ఏర్పడింది అంటే తెలంగాణ సాయుధ పోరాట విరమణ తరువాత ఏర్పడిన రాజకీయ అధికార పోరాటంలో కార్మిక-శ్రామికులకు- బూర్జువాలకూ మధ్యదిగా సాగే పాత్రల స్థానే బూర్జువా వర్గాల మధ్యదిగా మాత్రమే సాగడంతో నిర్ధిష్ట ప్రత్యేక అంశంగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతోనే నీళ్ళు-నిధులు-నియామకాలు-భూమి-ఫ్యాక్టరీల పునరుద్ధారణ మొదలైన ఆకాంక్షల సాధనగా సాగింది. అయితే ఈ పరిస్థితుల ఎరుక నుండి మరింత ముందు చూపుతో రివేరా తెలంగాణలో జరిగిన పరిణామాలని కవిత్వ రూపంలో మన ముందు ఉంచుతున్నాడు..

"హైటెక్ రాబందులు
బొల్లిమచ్చల కంప్యూటర్లు
బిల్ క్లింటన్ స్నానం చేసిన నీళ్ళని నా తెలంగాణా మైదానానికి
మళ్ళించాయి
ప్రపంచబాంక్ అండతో పేనిన ఆకలి తాళ్ళని
నా తెలంగానా నాగళ్ళకి బిగించాలి
నా తెలంగాణా అంటే
ఓ అప్పు ఈ అవమానం ఓ నిష్క్రమణాపస్వరం-
ఓ అదృశ్యం ఓ అణిచివేత ఓ పైశాచిక ఎదురు కాల్పు"

అయితే విప్లవోద్యమం తెలంగాణ ప్రాంతమంతటా విస్తరించి, ప్రజా విముక్తిని స్థాపించే వాతావారణం, ఒక ప్రక్క ప్రత్యేక రాష్ట్ర సాధన ఉద్యమం. ఈ రెండు పార్శవాల స్థితిని చూపుతూ సాగడం మాత్రమే కాకుండా, తెలంగాణ ప్రాంతంలో జరిన నిర్భందాలను కళ్ళకు కట్టినట్లు చూపడం ఆనాడు ఒక సాహసంగా చెప్పాలి. ఈ క్రింది కవిత్వం మనకు ఆ దృశ్యాన్ని దర్శింప చేస్తుంది..

"పచ్చి పుండైన గుడిసెల్లోంచి పడికిళ్ళు మొలిచిననాడే

గుడిసెలు తగలబడతాయి

యిక కదలికలి చుట్టూ ముళ్ళక్యాంపు

ఛిద్రమైన గుండెల్లోంచి అగ్ని పర్వతం రాలిన నాడే

గుండెలు మాయమౌతాయి

యిక చప్పుళ్ళనిండా నెత్తుటి మరక

రాలిన పాతలు చూపిన అడుగుల్లో

జనంలోకి దారి తీసిననాడే

వాళ్ళు చెట్లకు వేలాడతారు

యిక ఆద్యంతం కట్టుకథ"

ఇక రివేరా పర్యావరణ విధ్వంసానికి కవిత్వ రూపం ఇచ్చే కవిత్వం విషపు గాయాలతో, అందులో తాను పత్తి పంటల మూలంగా మరియూ డంకెల్ విధానపు విధ్వంసం మూలంగా ఆత్మహత్యలు మరియూ పురుగుల మందుల మూలంగా భూమి సారం ధ్వంసం మొదలైన విషయాలను శ్రమకు ముడిపెట్టి, వ్యక్తులను శ్రమ రూపంలో వ్యక్తం చెయ్యడం అత్యంత ఉన్నతమైన శిల్ప నైపుణ్యంగా చెప్పుకోవచ్చు. నిజానికి మనషిని శ్రమను విడతీయలేని శాస్త్రీయ అవగాహన నుండి వచ్చే పద్ధతిగా మనం దీనిని చూడాలి...

"శ్రమై మొక్క వేళ్ళను మట్టిలో దాచలేదు

వానజల్లై చేను దాహం తీర్చలేదు

భూమి స్వప్నమై పత్తి పువ్వు నివ్వలేదు

కని వాగ్దానాలను నేర్చిన నువ్వు మాత్రం

బురదలేని పట్టణం పెదాలను ముద్దు పెట్టుకుంటావు

కల్లాకపటం లేని శ్రమే

పంట పంటంతా విషపు గాయాలతో తడిసినపుడు

రెక్కలు తొడిగిన ఆశలతోనే పురుగు మందులో ఒదుగుతుంది"

సామ్రాజ్యవాదం యొక్క వినిమయ సంస్కృతిని విశదపరచడంలో రివేరా కవిత్వ రూపం విప్లవ సాహిత్య ప్రక్రియకు అత్యంత చేర్పుగా చెప్పవచ్చు. మన దేశంలో జరిగిన అభివృద్ధి అనే బూటకం వెనుక అమెరికా సామ్రాజ్యవాదం ఒక నిజంగా కొనసాగడాన్ని గమనించవచ్చు. అయితే ఈ కాలంలో చైనీయుల సామ్రాజ్యవాదం కూడా ఇందులో వ్యూహాత్మక భాగస్వామిగా పాత్రను పంచుకోవడం మనం గమనించవచ్చు. అయితే ఈ సామ్రాజ్యవాదం యొక్క కపట స్వభావాన్ని కవిత్వ రూపంలో రివేరా వ్యక్తపరిచిన తీరును గమనిస్తే

"ఆకలి దేశాల

అగ్రికల్చర్ కళ్ళలో ఫ్లోరికల్చర్ చల్లబడుతుంది

వేలానికి సరుకైన నగ్నత్వం

నేత్రాల బట్టల్ని బరువు చేస్తుంది

పాలిచ్చే దృశ్యాన్ని

మిడ్ నైట్ మసాల చేసిన

ఆ రాబందులే అనాధల బుగ్గల చారికల్లో గులాబీలు పూయిస్తాయి"

ఇక్కడ అదే కవిత్వంలో "అయినా ఆడేది ఎపుడూ ఒకడయినపుడు గెలిచేది

ఎపుడూ వాడయినపుడు అది ఆట ఎలా అవుతుందని" సామ్రాజ్యవాద గుత్తాదిపత్య ఆట తీరును సాహిత్యపరంగా స్పష్టపరిచాడు. అది కుట్ర అని మనిషిని తోటివారితో పరాయికరణను స్థాపించే వ్యక్తిగత ఆస్థి స్వభావాన్ని నిరూపిస్తున్నాడు. అయితే ఈ సామ్రాజ్యవాద భాగస్వామిగా వర్ధిల్లుతున్న మన భారత బడా భూస్వామ్య-బడా బూర్జువా వర్గాల తాయిలాల మహత్యం గురించి, పోరాటాల నుండి దూరం చేసే కార్యాన్ని గురించి అలాగే వాటి ఫలితం ఎంత దారుణమో ఇలా చెప్పుకొచ్చారు మన రివేరా "మరి జన్మభూమి, ఆదరణ ఉచిత మైత్రి భాగ్యం మాకే కదూ? చివరిగా! స్వర్ణాంధ్ర కట్టడాలకి కావాల్సిన శవాల కాంటాక్టు మాదేగా?" ఈ పాలక సంక్షేమం ఒక మిథ్యా వ్యవహారంగా, మృత్యు కౌగిలిగా వర్ణించడం జరిగింది "ఎంగిలి ఆకుల్లా మా బతుకులు ఎక్కడ పడతాయో తెలియదు గాని సంక్షేమ సర్కారు మాత్రం నాల్గు బస్సులు పట్టేంత విశాలంగా మాకు సమాధులు తొవ్వుతుంది...." అని అంటారు రివేరా.

ఇదిగో మనవద్ద రివేరా విప్లవం ఇక్కడే ఉంది, కావున ఇక్కడే పోరాడు అని దిక్సూచిగా నిలబడే మన కాలపు కవిగా గుర్తించక తప్పదు. ఆయన కాలంలో సంలీనంగా ఉద్భవించాడు, అందుకే కాలాన్ని ప్రతిఫలించాడు, మనల్ని తనవైపుకు నడిపించడానికి కవిత్వ రూపంలో ఎప్పుడూ కాచుకొని ఉంటాడు. అతడి దీర్ఘ దృష్టి ఎలాంటిదంటే కేవలం పరిస్థితులకు ప్రతిఫలించడమే కాదు ఈ పరిస్థితులు ఉన్నంత కాలం తన చైతన్య రూపంలో దిక్కార పతాకమవుతాడు అందుకే తన కవిత్వం నుండే చెప్పుకుందాం...

"నిషిద్ధ రహదారులెంత అజ్ఞాతమై
వేకువ స్వప్నం ఆనవాలుగా నడిచి పోతాం

చిత్ర హింసల తీరాలెంత సముద్రాలమై

ఎన్నో ఉదయాలకి పురుడు పోస్తాం"

భారత్ వెలిగిపోతుంది అనే కవిత్వంలో చాలా స్పష్టంగా ఈ దేశంలో జరిగే జరుగుతున్న అభివృద్ధి యొక్క అబద్ధాలను నిరూపిస్తాడు, తాను ఇంత సూటిగా చెప్పడం అనే దృక్పథం నుండే తన కవిత్వం యొక్క విప్లవ స్వభావం తెలుస్తుంది, తెలుపుతాడు.

"పాలకుల కుట్రలో, కరువులో

మట్టి తింటో

మడత కుడుములతో సరిపెట్టుకుంటో"

ఆహారమే దొరకని వాతావరణం మన భారత దేశంలో చూడవచ్చు. అదొక అందని కలగా మిగిలిపోతున్న పరిస్థితిగా చెప్పుకొచ్చే ప్రజల స్థితిగా ఉంటున్నది. మట్టి బతుకులల్లో ఆహారం సైతం మట్టిగా ఉండకుండా ఏమవుతుంది. పేదరికం తగ్గుముఖంలో ఉన్నదనే మన భారతీయుల అంకెల గారడిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ స్థితిని మన కవి తన కవిత్వంలో వ్యక్తం చేయడం ఒక వర్తమాన దృశ్యమే కాకుండా ఒక భవిష్యం కూడా లీనమైన నిజము. అయితే భారత్ వెలిగిపోతుంది ఎక్కడ-ఎందుకు-ఏమిటీ అంటే ఈ కవితా పాదంలో సూటిగా దృడపరుస్తున్నాడు మన రివేరా

"మార్కట్ల కోసమే అన్నట్లు

పుట్టుకొస్తున్న నదమంతర సిరి సాక్ష్యిగా

రాజ్యమతానికి తలాడిస్తో

సామ్రాజ్యవాది వస్తువుల్ని కొనుక్కుంటో

బతుకీడుస్తున్న మనిషి సాక్షిగా

"సంధి కాలం" శిషనను భవిస్తున్న

ఉద్యమం సాక్షిగా/నిజంగానే

నిజంగానే/భారత్ వెలిగిపోతుంది."

సామ్రాజ్యవాదం కాళ్ళ క్రింద నలిగిపోవడమే వెలుగుగా మన దేశ పాలకుల తీపి కబుర్లు ఉండని ప్రాంతం-కాలంలో ఉన్నామనేదాన్ని నమ్మినంత వరకూ నమ్మవచ్చు, అయితే ఈ దాసోహ బుద్ధి మన భావజాలంలో సైతం ఏర్పడేట్లు సామ్రాజ్యవాదం దాని తొత్తులు పూనుకున్నప్పుడు విప్లవ సాహిత్యం కేవలం భూస్వామ్య భావజాలాన్ని వ్యతిరేకించడం వరకే సరిపోదు, సామ్రాజ్యవాద భావజాలాన్నీ విమర్శించే పనికి పూనుకోవడం జరగాలి. ఈ కర్తవ్యాన్ని రివేరా తన కవిత్వం జర పయిలం బిడ్డా! లో వ్యక్తం చేసాడు

"బ్రెడ్ తినని పిల్లలకి

తల్లుల తీపి తాయిలాల చందమామ

హ్యారి పోట్టర్"

పిల్లల లేత గుండెలపై

మగత నిద్ర, మడతపేజి-

"హ్యారి పోట్టర్"....."

ఈ సామ్రాజ్యవాద సాహిత్యాన్ని సైతం విమర్శించే దృక్పథం ఒక భాద్యతగా భావించడంలో రివేరా కృషి మనకు అర్థం కావాలి. ఆయన కేవలం "పిల్లలకే కాదు పెద్దలకీ ఇప్పుడేమౌతుంది" అని ప్రశ్నిస్తున్నాడు. ఎందుకంటే సామ్రాజ్యవాదం యొక్క ఈ సాహిత్యపు ప్రచారం అనివార్యంగా దాని స్వభావ లక్షణాన్ని కప్పిపుచ్చుకునే

స్థితిగా అర్ధం చేసుకోవాలి, అందుకు రివేరానే ఇలా అదే కవిత్వంలో ఈ విధంగా అంటున్నాడు..

“ఐదు లక్షలమంది పిల్లలకి
పాలు లేకుండా చేసిన పాపమా?”
“పిల్లల ఆసుపత్రులపై
యుద్ధ విమానాల
బాంబుల ఘాతుకాల నిర్దయ ఫలితమా?”

నిజంగా ఇన్ని గోరాలు కప్పిపుచ్చుకుని బాలలపై తానేదో కనికరించే, అభ్యుదయ వాదిగా ప్రతిష్టించుకునే సాహిత్యాన్ని తీసుకు రావడం ఒక విడ్డూరంగా అనిపించవచ్చు, అయితే అదే సాహిత్యం ఒక కల్పితం-అశాస్త్రీయంగా నిరూపించడం రివేరా చేస్తున్నారు..

“ఎక్కడనుంచి వస్తాడో తెలియదు
సూపర్ మాన్ లా
వజ్రసంకల్పం విసురుతాడు
ఏ అద్భుత సృష్టో ఏమో
డిస్నీ బొమ్మల్లా
సందడి సందడి చేస్తాడు..”

దేశంలో మతోన్మాద దాడులు ఇంకా మానకుండా సాగే రాజకీయ వాతావరణం ఒక వాస్తవం, ఈ రాజకీయం అధికారం కోసం జరిగే విస్తృత ప్రచారంగా, మరొకవైపు ఎప్పటికీ వివిధ మైనారిటీల జీవనాన్ని సక్రమంగా సాగే స్థితి ఈ దేశంలో అసాధ్యమనే భావనను కల్పించే బెదిరింపు కూడా అని వాదించడంలో తప్పు కనపడకపోవచ్చు. అందుకే రివేరా ఇక్కడ ఇలా...

"వీర్యం వర్షంలో

చీము కారే పచ్చి పుండు గుజరాత్"

నిజానికి మానబంగాలు, మరియూ హత్యారాజకీయాలు అనేవి మన దేశంలో మత ప్రాతిపథికగా సాగడం ఒక అనివార్య పరిస్థితిగా మారుతుంది. పాలక పక్షాల అనుకూలతను సైతం దాటి సాగే ఈ ఉన్మాదం ఎంతకాదన్నా ఒక విస్తృత రాజకీయ వేదికలో విమర్శకు గురికావాలి. కానీ ఈ ఉన్మాదంలోని ప్రజల అనుకూలతను నెరవేర్చే ఘటణగా వీటిని అభివర్ణించాలి. అయితే వీటిని ఎదుర్కునే వాతావరణం- ఒక భావజాలం అనివార్యంగా ముందుకు రావాలి

"యింత జరిగాక

మనల్ని వేటాడటంతోనే

ఈ ప్రపంచానికి తెలవారుతున్నాక

మన లౌకిక స్వప్నాలు చితికి

సొన కారడం మొదలయ్యాక

ఇక అధర్మ నిథనం

రాముడి హత్యతోనే మొదలవుతుంది"

ఇంత నేరుగా తన కవిత్వంలో ఈ మత ఉన్మాద రాజకీయం రాముడి హత్యతో మొదలవుతుందని చెప్పడంలోనే మనకు స్పష్టమైన రాజకీయ లక్ష్యాన్ని ఏర్పరిచాడు కవి. ఈ లక్ష్యాన్ని చేరుకోవడం అనే మార్గంలో కవి కేవలం ప్రజాస్వామ్య మార్గాన్ని చెప్పడంలేదు ఒక భావజాలాన్ని హత్య చేయాలనే మార్గాన్ని నిర్మూలన అనే అంశాన్ని భావజాలమయం చేసి కొత్త పుంతలల్లో తీసుకుని వెళ్ళడమే నూతన మార్గావిష్కరణగా చెప్పుకోవచ్చు. నిర్మూలన అనే భావం కేవలం రాజకీయ రూపంలో సాగుతున్న

ఆచరణ, కానీ రివేరా దాన్ని సాహిత్యపరం చేయడమే గొప్ప విషయం.

రివేరా స్పష్టమైన వాస్తవికవాది, అతను జడస్వభావ కవి కాదు చలనశీల కవి అందుకే జరుగుతున్న, జరగబోయే నిజాన్ని దుకుడుగా చెప్పగలడు ఇక్కడ ఈ కవిత్వ పాదంలో చూడండి

"ఉట్టిలో వెన్న
మాయం చేసిందెవరో తెలిసిపోయింది
గెలిచిన యుద్ధాలన్నీ
రాజ్యాలకోసమే గాని
మానప్రాణాలు నిపేందుకు కాదని తెలిసిపోయింది
నరకబడ్డ ఎల్లమ్మ తల
ఎక్కడ దాచేశారో, ఆ జాడ తెలిసిపోయింది
బూడిద కుప్పలా పడున్న
నేలతల్లికి తిరిగి సౌభాగ్యాల్ని ఎలా తేవాలో,
ఆ రాహస్యం తెలిసిపోయింది"

ఈ ప్రపంచంలో జరుగుతున్న యుద్ధాల లక్ష్యం కేవలం రాజ్యాలకోసమే అనే సత్యం చాలా స్పష్టమైనది. అయితే కార్మిక వర్గ యుద్ధం కూడా రాజ్యం కోసమే, అందుకే ప్రతీ వర్గ పోరాటం రాజకీయ పోరాటం, వర్గ ప్రయోజన లక్ష్యం. కావున ఈ రెండు పార్శ్వాలల్లో దీనిని అవగాహన చేసుకోవాలి. ఈ స్పృహ రివేరాకు ఉంది అందుకే మాన ప్రాణాలు నిలిపేందుకు కాదని తెలిసిపోయింది అని చెబుతూ అది ఒక భూస్వామ్య–బూర్జువా స్వభావం అని సెలవిచ్చారు. కావున తన కవిత్వంలో ఈ వైవిధ్యాన్ని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది, ఉండాలి.

"పోలికలే లేవు

కవిత్వానికి శీర్షికలేనా

శిరస్సులూ తెగిపడుతున్నాయి

పాటకి పల్లవే కాదు

పాటగాడూ మాయం అవుతున్నాడు

పొద్దుకి పడమరకి నడుమ

కొట్టుకొని, కొట్టుకొని కాంతి రేఖలు

ఎక్కడో రాలిపోతున్నాయి

బతుకు పారాడినంత మేరా

కరువు, కన్నీరే రాపాడుతుంది...."

ఈ దేశంలో అన్యాయాన్ని ప్రశ్నించడం ఒక నేరమయం, రాయడం ఒక నేరం, మాట్లాడటం ఒక నేరము. రాజ్యపు నేరాలు యొక్క పార్శ్వం ఏమంటే అన్యాయాన్ని ప్రశ్నించడంపై ఉక్కుపాదం మోపడం, ఇది నేరమయ స్వభావంగా సాగుతుంది, దీన్ని నేరమయంగా గుర్తించని మేధావులు ఉన్న వాతావరణంలో ఉన్నాము కూడా. ఇక్కడ నిర్భంధం కేవలం చట్టాల రూపం సంతరించుకోవు మనిషి మాయమవడంతో ప్రారంభం అవుతుంది. అదే విషయాన్ని రివేరా కవిత్వ రూపంలో నమోదు చేసాడు. ఈ నమోదు నేటికీ అన్వయించగల భవిష్యత్తే సజీవంగా చలామణి అయ్యేట్లు చేస్తుంది.

ఇక మన భారత దేశం ప్రపంచ బ్యాంకు దాసోహమని అందరకీ తెలిసిన నగ్న సత్యం రివేరా ఇక్కడ వ్యక్తిగా దేశం ఏ విధంగా ప్రపంచ బ్యాంకుతో లీనమయ్యిందో ఒకానొక భావ ఐఖ్యతతో ముడిపడినదో కవితాత్మకంగా గొప్ప శిల్ప చాతుర్యంతో

వ్యక్తపరుస్తున్నాడు

"ష్....

నేనిక్కడ

తల లేని ప్రాపంచిక జ్ఞానాన్వేషణలో

నా ప్రపంచ బ్యాంకు గురువులను నిద్రలేపుతున్నాను

సమస్త చరాచర ప్రాణ కోటిని

కుటుంబంలోని ప్రతి ఒక్కరినీ తలలు లేకుండా సభావించడంలోని

ప్రాసంగికతను రికార్డు చేస్తున్నాను"

రివేరా ఎంత గట్టిగా సామ్రాజ్యవాద వ్యతిరేక సాహిత్యాన్ని తన కవిత్వం ద్వారా వ్యక్తం చేస్తున్నాడో మనం గ్రహించాలి. నిజానికి ప్రాకృతిక మరణం అనేది సామాజిక అంశంలో మనిషి మరణం అనేది సామాజిక వ్యవహారంగా, మరీ ముఖ్యంగా మరణాన్ని సైతం వర్గ దృష్టితో చూడటం మన భారతీయ విప్లవోద్యమ నేపథ్యం కారణమైనదిగా చెప్పుకోవాలి, ఈ దృష్టి నుండి మరణాన్ని సైతం చైతన్యతంగా ప్రతిఫలించే పనిని కవితా దృష్టి నుండి మనల్ని నడిపించడం రివేరా చేస్తున్నాడు.

"కల్పనా

నా చిట్టితల్లీ

నిన్ను ద్వేషించలేను

అలాగని ప్రేమించనూలేను

నా చేయి దాటిపోయావని కాదు

సామాన్యుల జాడ మర్చిపోయావని కాదు

వ్యోమాగమివయ్యావనో

భూమంచులకే చేరబోయావనో కాదు

కాని....కాని...

నువ్వో అమెరికన్ వి

నన్ను నా బిడ్డల నుంచి

నా బిడ్డల్ని

సుసంపన్ని బాల్య యవ్వన సౌకుమార్యాల నుంచి తరిమికొడుతున్న

దాడిలో నువ్వో తురుపుముక్కవి

నాగరికతాయుద్ధానికి

నువ్వో సింబల్ వి.....”

రివేరా 'మరణం చిరస్మరణం' అనే కవిత్వంలో ప్రజల కోసం త్యాగం చేస్తే, ప్రజల కోసం మరణిస్తే వీరుడి మరణం చిరస్మరణంగా ఉంటుందని మలిచాడు. అందుకే విప్లవవాది యొక్క ప్రజా జీవితం ఎలా ఉంటుందో చెబుతాడు కూడా. ఈ దేశంలో ఉన్న బడుగు బలహీనులకు ఆశా జ్యోతిగా విప్లవ వాదే పునాదిగా ఉంటాడని నిరూపిస్తాడు...

“ఈ దేశపు దళితుడికి

అండ, గుండె అయినవాడు

అతడు ఆప్తులకి మిత్రుడు

ప్రజలకి పుత్రుడు

యుద్ధానికి నాయకుడు

విప్లవానికి పైలెట్”

అంటూ రివేరా అమరుడి యొక్క మరణం మరపు చెందేది కాదని అదే కవిత్వంలో వ్యక్తం చేస్తున్నాడు కూడా, ఇందులోనే అతడి నైపుణ్యం గోచరమవుతుంది..

"అమరుడి

నెత్తుట్లో మెరిసిన నగవుకి మతలబేంటో

నాకు చావేందన్న ధిక్కారమో

మళ్ళా మళ్ళా

ప్రపంచాగ్నికి సమిధనవుతానన్న వాగ్దానమో"

దగ్ధ ప్రహేళిక అనే కవిత్వంలో రివేరా భారతీయ నేపథ్యంగా జరుగుతున్న నిర్బంధ అన్వేషణను వ్యక్తం చేస్తున్నాడు, ఈ కవిత్వ రూపం ఆయా నిర్దిష్ట దేశ-కాల పరిస్థితుల్లో విభిన్నంగా సాగవచ్చు, కానీ దాని వస్తువు యొక్క సారూప్యత అనేది అనివార్యంగా అన్ని దేశాలలోని దోపిడీకి వ్యతిరేకంగా జరిగే పోరాటాలపై ఉండే నిర్బంధ రూపాలు-అణచివేతలే. అందుకే మన కవి ఈ స్థితిలో విశ్వవ్యాపిత దృష్టిని విస్తరింప చేస్తున్నాడు. అతడో విశ్వ దృష్టి విప్లవవాదిగా మన ముందు ప్రత్యక్షమవుతున్నాడు..

"వాళ్ళు

నాకోసం రెండుసార్లు వచ్చారు

ఒకసారి యూనిఫాంలోనూ

మరోసారి దిసమొలలతోనూ

ఒకసారి మీసాలు రువ్వుతో

మరోసారి కత్తులు దూస్తో

అప్పుడల్లా

జాలుపుట్టే చేతుల్ని ఊపుతో

తల వొంచుకుని రాసుకుంటున్నాను

ఏం చేస్తాం...

వాళ్ళు నమ్మలేదు

అక్షరం వాసన చూశారు

గంధక ధూపమని ముఖం చిట్లించారు

కలం కన్ను పొడిసి పరీక్షించారు

విద్రోహానికిదే నిదర్శనమన్నారు"

రాజ్యం జరిపే దారుణమైన అణచివేతలలో ప్రశ్నించే మానవుల హత్య అనేది దాని ప్రత్యమ్నయ రూపంగా మారిపోయిన వాతావరణం మన భారత దేశంలో లేదా ప్రపంచవ్యాప్తంగా ఉన్నది. ఈ స్థితిని రివేరా హంతకుడు నిజం చెప్పడు అనే కవిత్వంలో హత్యని రాజ్యం యొక్క రూపంగా ప్రతిష్టిస్తున్నాడు...

"వాడు హంతకుడు

నిజమైతే చెప్పడు"

నిజం చెప్పే బూర్జువా రాజ్యాన్ని చూడగలమా? విప్లవకారుల ప్రాణం ఉన్నంత కాలంలో అది ఎలా అయినా పోవచ్చు అని నిర్మోహమాటంగా సిద్ధపడితే జరగబోయే రాజ్యపు విద్రూరాన్ని అంచనా కట్టవచ్చు. ఈ అంచనానే కవిత్వ రూపంలో ఉన్న విప్లవకారుడికి–కాబోయే విప్లవ వాదికి చూపించడం మన కవి భాధ్యతగా పెట్టుకున్నాడు. ఇది కేవలం విప్లవవాదులకే కాదని ప్రజాస్వామ్యవాదులకూ విస్తరించినదనే అవగాహనని నేడు చేసుకోవాలి.

"ఆశ్చర్యం,

చంపినాక హంతకుడు

తన ఒంటిని, మూఖాన్ని, అడుగుల్ని, గుర్తుల్ని

దాచేసుకుంటాడు కదా

కాని వాడు మాత్రం

మనిషి నుండి ప్రాణాన్ని తీసేసాక

పారిపోవటం మాట అలా వుంచు ముందుగా

వాడే హడావుడి చేస్తాడు

దడులు కట్టి నిలబడతాడు

స్ట్రెక్చరై భుజానికెత్తుకుంటాడు

వ్యానై మార్చురి గదికి పరిగెడతాడు

పంచనామా చేస్తాడు

పోస్టుమార్టం రిపోర్ట్ ఇచ్చేస్తాడు..."

మన తెలుగు రాష్ట్రాలల్లో ఎన్ కౌంటర్ల గురించి ప్రత్యేకంగా ప్రస్థావించవలసిన అవసరం లేదు. ఎన్ కౌంటర్ అనగా కేవలం బూటకం అనే వాతావరణం మరియూ పట్టుకెల్లి కాల్చి వేసారనే వాస్తవం రూఢీ అయిపోతుంది కూడా. అయితే ఈ పదం ఇప్పుడొక అర్థంలో పరిణామం చెందడానికి కారణం బూటకపు ఎన్ కౌంటర్ మరణాల కథలు అనేకమైనవి కారణమని గ్రహించాలి. అదే ఇక్కడ ఆ పరిణామాన్ని రివేరా చూపాడు.

ఇకపోతే కేవలం హత్యకు దూరమైన వారు జైళ్ళల్లో ఇరికించబడి నిర్బంధానికి గురికాబడటం సహజంగా మారిపోతున్న వాతావరణం, ఈ రోజుకీ జైళ్ళల్లో మగ్గుతున్న

విప్లవవాదులు అనేకంగా ఉన్నారు. కనీసం బెయిలు లేకుండా, రాజకీయ ఖైదీలుగా గుర్తించకుండా హక్కులు కాలరాయడాన్ని చూస్తూనే ఉన్నాము, రాజకీయ ఖైదీలకు కనీసం న్యాయం అందకుండా ఉన్న పరిస్థితులు చాలా దారుణంగా మారుతున్నాయి కూడా. జైళ్ళలో మగ్గుతున్న వారి స్వేచ్ఛా గీతాన్ని కవిత్వ రూపంలో వ్యక్తం చేస్తూ, జైళ్ళ జీవితంలోని కష్టాలను రివేరా ఆర్.పి.నెం : 4395 కవిత్వంలో ఉదహరిస్తున్నాడు...

"జైలంటే

అల్లల్లాడే తలపులు

తలలు తెగిన స్వప్నాలు

చెక్కిళ్ళ నిండా వుప్పటి సముద్రాలు

జైలంటే

నిచ్చెలి వెచ్చటి శ్వాసలకి దూరం కావడమే

సంధ్యా ప్లవనాల తుషారాల్నుంచి

యీడ్చేయబడటమే"

అయితే రివేరా ఈ నిర్భంధాల నుండి స్వేచ్ఛను కోరుతూ అదే కవిత్వంలో ప్రస్థావన గావించడం ఒక పరిష్కారంగా నిరూపించే సంకల్పంగా సాగుతుంది కూడా అందుకే ఇక్కడ...

సెల్ తొమ్మిది ఊచలూ

మా చూపుని అడ్డుకోలేవు

కిటికీ జాలరీలు

వెన్నెల పొద ఊరట నుంచి ఉ

మమ్ములాగేయ లేవు

పెద్ద పెద్ద నిటారు గోడలయినా

వాటి ఫెన్సింగ్ తీగలయినా

ఆకాశం మీద

మా పావురాల రాకని అడ్డుకోలేవు

మా స్వేచ్ఛా ఝరుల విపంచికల్ని

కాలరాయలేవు

రివేరా విప్లవ కవిగా తన పాత్రను విప్లవాత్మకంగా సాగించడంలో వెనకడుగు వేయలేదు అతని చూపు ఇక్కడ ముందడుగు, అందుకే కవిత్వం యొక్క వర్గ దృక్పథాన్ని మనకు ఎప్పుడూ పేచీ లేకుండా నిరూపించుకుంటాడు. అందుకే కలలధారీ అనే కవిత్వంలో "వెన్నెలంటే ధరణిన ఒలికిన అమృతమో భావ కవి మనోవాంఛో కాదు మట్టి పరవశం పల్లెల,తల్లుల పాలసేపు" అని రచించాడు. అదే కవిత్వంలో ఇలా అంటూ సాగుతాడు...

"కవి మిత్రులారా!

ఇకనెంత మాత్రం

'వెన్నెల' యుద్ధం మధ్యలో

విరామమో, విశ్రాంతో కాదు

అసలు వెన్నెలే యుద్ధం.."

ఇక్కడ మనం గ్రహించాల్సిన ప్రయోగం ఏమంటే శిల్పం అనేదాన్ని వస్తువుకు అనుకూలంగా మలచడం, అలాగే విప్లవ వస్తువు శిల్పాన్ని సైతం దాని పరిధిలోకి

అన్వయించడం అనే పరిశ్రమను ఏర్పర్చడంగా మనం గ్రహించాలి. రివేరా చాలా స్పష్టంగా ఈ రూపాన్ని అభివృద్ధి గావించి ముందుకు సాగారని గమనించాలి. అందుకే తాను విప్లవోద్యమంలో కవిగా, విప్లవ కవిగా సాగుతున్నాడు. ఆయన కవిత్వం విప్లవ ఆశావాహంలో సాగిపోతుందని మరవకూడదు, అందుకే ఆయన కవిత్వమే ఈ ఆశను వ్యక్తం చేస్తుంది చూడండి....

"ఈ దేశం వెచ్చగా సేద తీరే కాలం కోసం

ఆ స్వప్నాన్ని మళ్ళీ మళ్ళీ నాటండి

ఎంత చెమట, నెత్తురూ ఒలికినా

స్వప్నాన్ని,

స్వప్నం అంటిన కంటిని

అలా మళ్ళీ మళ్ళీ నాటుతూనే వుండండి"

రివేరా కవిత్వంలోని వస్తువును శిల్ప రీతుల్లో వ్యక్తపరిచే నైపుణ్యపు అవగాహనను తెలుసుకునే తర్ఫీదు మనకు అవసరం. ఈ అవసరం సాధారణంగా కేవలం పరిశోధకులకు లేదా సాహిత్య విమర్శకులకు పరిమితం చేసే సందర్భంగా మాత్రమే ఉన్నప్పుడు ఆనాటి సమాజానికి సాహిత్య అధ్యాయణం యొక్క విస్తృతి-అవగానలో పరిమితి ఉన్నదని అర్థం చేసుకోవాలి. ఇక రివేరా ఈ శిల్ప రీతుల నూతనత్వాన్ని తయారు చేసుకోవడంలో-చేయడంలో ఉన్న ప్రయోగం మనల్ని వస్తువును గ్రహించడంలో జటిలత్వాన్ని కలిగించేదిగా, కలిగేదిగా గోచరిస్తుంది. దీనితో కేవలం శిల్పవాదులుగా అతడి కవిత్వానికి ఆకర్షింపబడే వారిగా మారే ప్రమాదం కూడా లేకపోలేదు, ఎందుకంటే అది అధ్యాయణ పరుల పరిమిత అవగాహనగా అర్థం చేసుకోవచ్చు. అలాగే వస్తువు

యొక్క పరిస్థితుల వాస్తవికతకే ప్రాధాన్యం ఇస్తూపోతే వల్గరిజంలోకి జారుకుంటాము కూడా.

"పూల నిండా
పిట్టల నిండా
చెట్లనిండా
నీ జ్ఞాపకాల్ని బట్వాడా చేస్తో
ఏకాంతంలో....
ఏకాకి ఖాళీతనాలకి
ఒకింత నమ్మకమిస్తో
తెరచాపల్ని దిగాంతాలదాక ఎత్తిపడుతో
నీ కలల తేరుల చప్పుడు..."

ఈ పై కవితా పాదంలో మనం గ్రహించే విషయం ఏమంటే శిల్పం యొక్క అభివృద్ధిని అవగాహన చేసుకోవాలి. అయితే ఈ శిల్పం యొక్క అభివృద్ధి అనివార్యంగా వస్తువును మిళితం చేసి చెప్పడం దగ్గర విప్లవ సాహిత్యకారుల శిల్ప సృష్టి వికసించినా అది తన వస్తువును పట్టుకు సాగేదిగా, దాని అంతర్గత నిర్మాణాత్మకమైనదిగా ఉండటమే కీలకం. అటువంటి ప్రయోగం విప్లవ సాహిత్యకారులకు సాధ్యమగునా అని విమర్శించిన వారు ఉన్నారు. కానీ దాని అభివృద్ధి ఖచ్చితంగా దాని వాస్తవికాభివృద్ధి పై ఆధారపడి సాగుతుందని గ్రహించకపోవడమే ఒక వెనకడుగు. అందుకే వాస్తవికత యొక్క వికాసాన్ని దృష్టిలో పెట్టుకుని దాని వంతుగా ప్రతిఫలించే వస్తువు దాని శిల్ప రీతులను అంచనా కట్టవచ్చు.

“రూపం

అవిభాజ్యమైంది

వెలుగు

వంద కత్తివేట్లకీ తెగిపడనిది

జీవితం

ముక్కలు చేసినా

మళ్ళా పచ్చగా బతుకులోకి పారేది

అమరత్వం దగ్ధం కాబడ్డ చోట నుంచే

జనంలోకి ఎగబాకేది.....”

ఇక్కడ వస్తు-రూపాల మధ్య ఐక్యతలను చక్కగా చూపించడంలో రివేరా రూపం అవిభాజ్యమైంది అని వెలుగు వంద కత్తివేట్లకి తెగిపడనిదనేది జీవితం అనే అంశానికి-అమరత్వం అనే అంశానికి పోలికతో రాయడం జరిగింది. అందుకే సమానం-అసమానం అనే స్పృహ అలాగే పోలిక-పోలిక లేనిది అనే దృష్టి నుండి రివేరా కవిత్వంలోని వస్తు-శిల్ప ప్రయోగం సాగుతుంది అందుకే తనకు కవిత్వం అత్యంత సహజంగా సాగుతుందని అందరి భావం, దీని మూలాంలోకి మనల్ని వెళ్ళేట్లు చేయడంలో రివేరా యొక్క కవిత్వపు భాద్యత కలిగి ఉంటుంది కూడా.

“ఆకాశం నేలకు దిగలేదు

తూర్పున వెల్లవేయలేదు

నడుములిరిగినా

పాము నాట్యం ఆపలేదు

ఆమె కంటి గూట్లో

సజల దాహం ఆరలేదు..”

రివేరా కవిత్వం గుణాత్మకంగా పరివర్తన చెందడాన్ని గ్రహించాలి. ఈ పరివర్తనలో వాస్తవికతను సృజనాత్మకంగా చిత్రించేదిగా సాగడం, అనగా వాస్తవికతను పునఃసృష్టి చేసే ప్రతిఫలనంలో తన ప్రయత్నపూర్వక చైతన్యయుత కార్యాన్ని అవగాహన చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఈ చైతన్యయుత కార్యం యొక్క సాధారణ కారణాలను అవగాహన చేసుకోవడం దగ్గరే మన దృక్పథాన్ని వెల్లడిస్తుంది. అయితే ఈ దృష్టి అనివార్యంగా సాహిత్యంపై వాస్తవిక దృక్పథంగా ఉండటంలో యథాతథవాదంగా ఉన్నదా లేక గతితార్కికంగా సాగుతుందా అవగాహన చేసుకోవాలి. కావున ఇక్కడ మనం రివేరా విప్లవోద్యమం యొక్క వాస్తవ పరిస్థితిని చాలా చక్కగా తన ప్రయత్నపూర్వకంగా అనగా తాను సాధారణీకరణ సాంప్రదాయ రూపంలో వ్యక్తం చేసే స్థితి నుండి తనవంతుగా వ్యక్తిగత రూపంలో సృష్టించే వాతావరణం అనే స్థితి దగ్గరకు చర్చించే స్థాయికి చేరుకోవడం జరుగుతుంది. ఈ వ్యక్తిగత రూపాన్ని కూడా మనం ఒక సామాజిక రూపంగా గ్రహించాలి, గుర్తించాలి. అయితే ఈ సాధారణీకరణ మరియూ వ్యక్తిగతం అనే రెండూ మనవ సామాజిక ఆచరణలో భాగంగానే అవగాహన చేసుకోవాలి. ఇక సాధారణీకరణ అనగా మానవుని ఆచరణ అనే నిర్దిష్ట సామాన్యత నుండి అనివార్యంగా ప్రతిఫలించే వాస్తవిక చైతన్యపు సాపేక్ష–విప్లవ స్వభావాలుగా ప్రతిఫలించడం. వ్యక్తిగతం అనగా మానవుడి సామాజిక ప్రత్యేక రూపం నుండి ప్రతిఫలించే చైతన్యం. ఈ రెండు విధాల చైతన్యాన్ని కవిత్వం ద్వారా ప్రతిఫలించడం రివేరా పనిగా సాగడాన్ని గమనించవచ్చు.

“ఇదేమంత అసంబద్ధం కాదు

చరిత్ర నేత్రగర్భంలో

కదలాడని కథేమీ కాదు

కడుపుతో ఉండి

కాలం కన్న శిశువులంతా

పురిట్లోనే మాయం కావడం

కొత్తేమీ కాదు”

యుద్ధ సంప్రదాయం అనే కవిత్వంలో రివేరా యుద్ధాన్ని చాలా సులభంగా చారిత్రక పరిణామంలో భాగంగా భావిస్తున్నాడని అవగాహన చేసుకోవాలి, ఈ భావనను ఆయన మనకు సైతం కలిగించడం ఒక సృజనశీల వ్యక్తీకరణలో ఒక సౌందర్యాత్మకమైనదిగా ఉండటంగా చూడాలి కూడా, ఇక దీని నుండి చూస్తే విప్లవ కవిత్వాన్ని చారిత్రక నమోదుగా భావించాల్సిన అవసరం ఒక అనివార్యంగా రివేరా తీసుకెళ్ళడంలో విమర్శనాత్మక వాస్తవికతకు దగ్గరగా మాత్రమే పరిమితం కాకుండా పరివర్తనాత్మక, పరిణామవాదిగా నిలుస్తాడు. అందుకే ఆయన వర్తమానాన్ని నమోదు చేస్తూనే సృజనను చారిత్రక నేపథ్యంగా వ్యక్తంగావించడం జరుగుతుంది.

“ఇదేమంత విశేషమూ కాదు

గ్రీన్ హంట్, సీమాంధ్రం....

అసమబద్ధతలను సంబద్ధం చేసే

మీడియాకు, మార్కెట్ కు అవిరళ బంధం

కాకపోతే, బాష నుంచి భూమి దాకా

ప్రతిదీ యుద్ధ రంగాన్నే వరించడం

సాగర కుమారుల నుంచి

ఆకాశ దూతల దాకా

అందరూ వన పుత్రులకు ప్రణమిల్లడమే

నేటి కవి సమయం..."

నిజమే ఈ రోజుల్లో కవి సామాజిక భాద్యతను మోయడంలో కీలక పాత్రను తీసుకోవాలి లేదంటే కవి ప్రాధాన్యం కూడా కనుమరుగు అయిపోవడం సహజంగా ఉన్న సామాజిక వాతావరణం. ఎందుకిదంత పచ్చిగా ఉన్నదంటే కారణం వర్గ పోరాటపు ఉన్నతి కారణమై సాగుతున్న వాతావరణం, ఈ వాతావరణం సామాజిక సాహిత్య రూపాలను సైతం మరింత పదును చేసేదిగా ఉండటం. అందుకే కవి సమయం వర్గ పోరాటం.....

"బ్రహ్మ సృష్టించిన బొమ్మకైనా

పేటెంట్ తోనే ప్రాణం

జీవ రహస్యాన్వేషణలో

జీవుడి దేహం కూలిపోనీ...

జీవన వైవిధ్యానికి వైధవ్యమే రానీ....

నాకం నుంచి పైలోకందాకా వేసే వెంచర్ లో

అడవులూ కొండలు ధ్వంసం కానీ

నదీనదాలూ సమాధికానీ

అటవీజీవుల ఆహార చక్రం దెబ్బతిన్నా

షేర్ మార్కెట్ గాండ్రిస్తూనే ఉంది కదా!

మనిషికి ఆహార భద్రత కరువైనా

అభివృద్ధికేమీ కొదవలేదు కదా!....”

ఇక్కడ ఈ కవిత్వంలో రివేరా చాలా స్పష్టంగా వస్తువును శిల్పం ద్వారా వ్యక్తం చేస్తున్నారు. పెట్టుబడి ప్రపంచాన్ని పాదాక్రాంతం చేసుకుని సాగుతున్న సందర్భం మనం చూస్తున్న సత్యం అయితే భారతీయ హైందవ భావజాలం సైతం ద్రవ్య పెట్టుబడి కనుసన్నలలో సాగుతున్నదని రివేరా మనకు ఈ తన కవిత్వం ద్వారా వ్యక్తం గావించడాన్ని గ్రహించవచ్చు. అందుకే ఆయన పెట్టుబడి యొక్క అభివృద్ధి సూత్రాన్ని ఒక వ్యంగ్య రూపంలో చిత్రీకరించడం జరుగుతుందని గమనించాలి.

రివేరా కవిత్వంలో మనం గమనించాల్సిన విషయం ఏమంటే ఆయన ఒకేరకమైన వస్తువును విభిన్న శిల్ప రీతుల్లోకి తీసుకురావడం. నిజానికి కవి ఈ విభిన్న రూపాలల్లో వ్యక్తం చేసే వస్తువును ఎప్పుడూ సజీవంగా కొనసాగేట్లు చేసే ప్రయత్నంగా మనం గ్రహించాలి. ఎందుకంటే నేటికీ కొనసాగుతున్న దేశంలోని దోపిడీ, పీడనలు, అంటరానితనం, అవమానాలుగా చెప్పుకోవాలి. ఇక్కడ తప్పదు అనే కవిత్వంలో దళిత సమస్య అనే వస్తువును వివిధ రకాల శిల్పాల్లో ప్రస్థావిస్తూ రావడాన్ని ఇక్కడ ఈ కవిత్వం ద్వారా చూడవచ్చు.

“ఎక్కడో తెగిపోయిన ప్రశ్న

లక్షింపేట తల్లిపేగులో కదలాడింది

కామ్రేడ్ తో జరుపుతున్న

కుల నిర్మూలన చర్చకు

దళితవాడే తార్కిక ముగింపునిచ్చింది...”

విప్లవోద్యమం నేడు గ్రీన్ హంట్ వంటి నర హంతక దాడి నుండి తేరుకుంది అలాగే ఆపరేషన్ సమాధాన్ అనే విస్తృత దాడిని సైతం ఎదురుకుని నిలబడింది. అయితే ఇలాంటి దాడులు అనేక దశల గుండా సాగుతూ విప్లవోద్యమాన్ని దెబ్బ కొట్టాలని ప్రయత్నం గావించాయి. కానీ ఈ ఆటు పోట్లు దాటుకుంటూ విప్లవోద్యమం కొనసాగడం ఒక చర్చనీయాంశమే. అయితే ఈ దాడులను ఏ విధంగా కొనసాగించాలనే ఎత్తుగడలను మారుస్తూ ఆపరేషన్ ప్రహార్ అని ముందుకు వస్తున్నారు, ఈ దాడిలో మొత్తం రాష్ట్ర-కేంద్ర బలగాల సమన్వయంతో వ్యూహాత్మక దాడులుగా సాగడంగా ఉంటూ పార్టీపై ఆధిక్యతను తీసుకు రావడం జరుగుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాలు కోల్పోయారని, అసలు ఆ ఉద్యమం దేశవ్యాప్త విముక్తికి ఉపయుక్తం కాదని, అసలు ఇంకా గ్రామాలను పట్టుకు వేలాడేది ఏంటి? ఇప్పుడిక అర్బన్ మావోస్టులు చాలు అనే తర్కాలు కొనసాగుతున్న వాతావరణంలో ప్రాంతాలవారీగా విప్లవోద్యమం విజయం సాధిస్తూ, కొనసాగుతూ, చలామణి అవుతూ, విస్తరిస్తూ, కొల్పోతూ, ఒక విచ్చిన్న ప్రవాహంగా సాగుతుంది. నిజానికి మన దేశంలో బ్రిటీష్ సామ్రాజ్యవాదుల చేత ఏర్పడిన, దృడపడిన, చట్టబద్దమైన జమిందారీ, జగీరుదారీ, మహల్వారీ, పర్మనెంట్ సెటిల్ మెంట్ భూస్వామ్య వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడటం అనివార్యంగా సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాట పార్శ్వంగా కూడా సాగింది, సాగుతుంది. అందుకే మన భారతదేశంలో భూస్వామ్యం సామ్రాజ్యవాద నీడలో అభివృద్ధి కాసాగింది. ఇటువంటి విప్లవోద్యమంపై దాడిని మన చుట్టూ జరుగుతున్న దాడులను ప్రశ్నించడం అనే నేపథ్యంగా సమన్వయీకరించి సాగడాన్ని రివేరా కవిత్వంలో గమనించవచ్చు..

"శోకమెప్పుడూ ప్రశ్నే

దుఃఖంతో తడి రద్దయిపోయినా

ప్రశ్న మిగిలే ఉంటుంది

గుండెల్లో గునపం దిగేసినా

ప్రశ్న గురిచూస్తూనే ఉంటుంది

భూమిలోకి నిలువునా పాతేసినా

మృతవీరుడి గోళ్లు, తలలోని మట్టి

ప్రశ్నకు ప్రాణదానం చేస్తూనే ఉంటాయి...”

ఇకపోతే రివేరా మరణం అనే అంశాన్ని చాలా సందర్భాలల్లో విరివిగా వాడుతూ వచ్చాడని చెప్పవచ్చు. ఈ మరణం పై తనకంటూ ఒక సామాజిక స్పృహ ఉన్నదని గమనించాలి కూడా, అందుకే నిరర్ధకపు మరణం అనేదానిలో మరణించాల్సిన కార్యరంగాన్ని వర్గ పోరులో లేదా అన్యాయంలో అని సెలవిస్తున్నాడు..

“లక్షింపేటలో తెగిపడిన ఆకాశం

గర్భశోకంలో వెతికాను

చింతల్నార్ లో చిప్పిల్లిన

కమ్మికొనల్లో గాలించాను

అమరుల బంధుమిత్రుల పిడికిళ్లకైనా

చిక్కావేమోనని ఆశపడ్డాను

పోనీ తెరలుతెరలుగా తరలిపోతున్న

నలుపు, తెలుపు చుక్కల గోమంద

కాలిగిట్టల్లోనైనా వినిపిస్తావనుకున్నాను...”

విప్లవోద్యమం అనే ప్రక్రియలో మానవ సంబంధాల పాత్రను అర్థం చేసుకోవాలి అనే సంకల్పంతో అమ్మా...అనే కవిత్వాన్ని రాసారు. ఎందరో అమ్మలు విప్లవోద్యమాన్ని కొనసాగించడంలో తమ పుత్రులను, పుత్రికలను ప్రోత్సాహించడం-వారివంతుగా దానిలో సహ భాగస్వామ్యులవ్వడాన్ని మనం గోర్కీ అమ్మ నవల మరియూ చైనా తావోచింగ్ వి ని చెప్పుకోవచ్చు. నిజానికి ఈనాడు మన దేశంలో విప్లవ అమ్మలు ఎందరో ఉన్నారు, అయితే కొందరు దాని సరళ రేఖను దాటిన వారు ఉన్నారు అలాగే దాటని వారూ ఉన్నారు. వారి త్యాగాలను సైతం కవిత్వంలో వ్యక్తం చేయడాన్ని ఇక్కడ మనం గమనించాలి.

"బతికినంత కాలం

బహిరంగ రహస్యంగానే

శత్రువుకి సవాలుగానే నిలిచావు

సంప్రదాయ చైతన్యం

ఒక ఊరికో ప్రాంతానికో పరిమితం చేసినా

కమ్యూన్ లో వంటకే కేటాయించినా

కదుల్తున్న కాలంతోనే కాలు కదిపావు

కొండపల్లి నుండి గద్దర్, చలసాని దాకా

నీ కమ్యూనిస్టు తల్లి హృదయం పంచావు.."

రివేరా జింగోయిజం యొక్క మూలాలను పట్టుకున్నాడు, అంతేనా ఉగ్రవాదుల పేరిట జరిగే, జరగబోయే హత్యలను, హంతకులనూ పట్టుకున్నాడు. నిజమే ఈ దేశంలో జరిగే, జరగబోయే ఎన్నో ఉపద్రవాలకు, అనర్థాలకు, అల్లిబొల్లి ఆశలకు మూలాన్ని పట్టుకున్నాడు. ఇక్కడ ఆ కవిత్వం ఏమంటుందంటే...

"...'ఉగ్రవాద' వేట, ఓట్ల వేట

ఒకే దెబ్బకు లాగించేశావు

మంచిదే...యుద్ధోన్మాద దేశానికి

నీవిచ్చే మార్పు ఏమిటో అర్ధమయింది..."

తునీష్యాలో జరిగిన నిరంకుశత్వ వ్యతిరేక పోరాటాన్ని అనగా జాస్మిన్ పోరాటాన్ని సైతం రివేరా కవిత్వంలో వ్యక్తీకరిస్తూ దాని సమస్యకు మూలం సామ్రాజ్యవాదంగా ఉంటుందని ప్రస్థావిస్తున్నాడు..

"మిత్రమా!

సామ్రాజ్యవాది దొడ్లో బందీలం

నిత్యం మొత్తుకునే బతుకులం

ఇంట్లో ఎత్తిన కాలు

పడేది నేరుగా యుద్ధ రంగంలోనే

ఉప్పు నుంచి పప్పు దాకా

అంతా నిప్పుతో చెలగాటం

అవినీతి నుంచి ఆత్మగౌరవం దాకా

అంతా చావు బతుకుల పోరాటం

ఉల్లి ఘాటు, టమాట ఎరుపు

సింహాసనాలపైకి దూస్తున్న కత్తి మెరుపు

అది జాస్మిన్ నవ్వు

అద్దాల మేడపై రాయి రువ్వు."

క్రమక్రమంగా రివేరా యొక్క వస్తు–శిల్పాల అభివృద్ధిని గతితార్కిక పద్ధతి ద్వారా విశ్లేషిస్తే శిల్పం మానవ సంబంధాల వైపుగా సాగుతూ వస్తువు మానవ సంబంధాలను ఊహాత్మకం చేస్తూ, ఆ వైపుకు ప్రయాణించడం జరుగుతుంది. అయితే ఈ మానవ సంబంధాలలో వ్యక్తిని ప్రతిష్టించడమే రివేరా కృషిగా సాగుతుంది. దినికి ముందు మానవుడిని శిల్పంలో వాడినా వస్తువులో మానవుడు ఎదురుకునే సామాజిక దోపిడీ, పీడనలు, నూతన సమాజ కాంక్షా ఉండేవి, అయితే ఈ వ్యక్తిని శిల్పంలోకి తెస్తూ ఈ వ్యక్తి యొక్క సామాజిక ప్రత్యేక రూపం యొక్క చైతన్యాన్ని వస్తువుగా మార్చడంతో నిర్ధిష్ట పరిస్థితుల్లోని వర్గపు నిర్ధిష్ట ప్రతిఫలనంగా కవిత్వాన్ని ప్రతిష్టించుకుంటూ ప్రయాణిస్తున్నారు మన రివేరా. ఫలితంగా రివేరా శిల్పంలోని నిర్ధిష్ట వ్యక్తి స్వేచ్ఛకు అనగా అతను ఎదురుకునే ప్రతిబంధకాలు, పీడనల విముక్తిని ఊహాత్మకంగా సాగించడానికి కృషిని సల్పడం కర్తవ్యంగా ముందుకు తెచ్చారు. అందుకే వ్యక్తి దగ్గరే ఆగిపోలేదు వ్యక్తి స్థానంలో అత్యంత సంక్లిష్ట రూపమైన అహాన్ని ముందుకు తెస్తున్నారు. ఇక్కడ ఆయనను పట్టుకోవడం కష్టమైనదిగా మారిపోతుంది. ఆయనకు ఈ అహం నిర్ణయాత్మకమైనది, దానిని బద్దలు కొట్టాలని ప్రయత్నిస్తాడు, దాని నుండి అంతా నిర్మించాలని తాపత్రయం చెందుతాడు. అందుకే మన కాలపు సంక్లిష్ట కవిగా మారిపోయాడు. అయితే మనం వ్యక్తి ఎప్పుడూ సామాజిక రూపం అనే దృక్పథాన్ని కలిగియుండాలి. ఈ సామాజిక సంబంధాల సారమే మానవ సారం అని సైద్ధాంతిక స్థాయిలో అవగాహన చేసుకోవాలి.

"మనకేమన్నా

నాలుగు గదులున్నాయా...

నీ దుఃఖాన్నీ, నా దుఃఖాన్నీ

వేర్వేరుగా దాచుకోవడానికి

మనకేమన్నా

నాలుగు తలుపులున్నాయా..

ఆ పిట్ట కిటికి రెక్కలు ముడుచుకునేదాకా

బిగబట్టుకొని కూర్చోడానికి

మనకేమన్నా

నలుగురు మనుషులున్నారా...

మనమిలా చస్తే అలా పడేయడానికి

ఉన్నదే ఇద్దరం

అంతా కబ్జా చేయగా మిగిలిన

ఆ సన్నటి తోవే మనది

రవరవలైనా ఇక్కడే

కువకువలైనా ఇక్కడే"

రివేరా తన కొన్ని సమయాలు అనే కవిత్వంలో చాలా చక్కగా వస్తు-శిల్పాలను కాలం యొక్క వ్యవహారంగా చూపించే ప్రయత్నం ఒక సౌందర్యాత్మకమైన ప్రక్రియగా చెప్పుకోవాలి. అయితే కాలాన్ని భారతీయులు చూసే దృక్పథం వేరు వారికి మంచి కాలం- చెడ్డ కాలం ఉంటాయి అంటే వారి మత ఛాందసంలో అవి భాగాలు సమయం ఒక అదృష్టంగా-దురదృష్టంగా భావిస్తారు. కానీ రివేరా శిల్పమైన సమయం, వస్తువైన నిర్ధిష్ట పనులు ఆధునికంగా వ్యక్తం కావడంతో భిన్నమైన రీతిలో సాగుతుంది. రివేరా ఇలా అంటున్నారు...

"కొన్ని సమయాలంతే

తొందర తొందరగానే తోసేయాలి..

కొన్ని సమయాలంతే హడావుడిగా దాటేయాలి.

కొన్ని సమయాలంతే

ప్లాన్ చేయలేం

కొన్ని సమయాలంతే

ఎంతకూ విడిచిపోలేం"

ఇక్కడ మనం ఒకే శిల్పాన్ని వివిధ అంశాలకు వ్యక్తం చేసే ప్రక్రియను ఖచ్చితంగా పట్టుకోవాలి, దీనితో మన పరిశోధనకు ఉపయోగంగా ఉంటుంది. నిజానికి రివేరా కవిత్వంలో ఈ ప్రయోగం బాగా గోచరమవుతుంది, మనం తన కవిత్వాన్ని పరిశీలించినప్పుడు దానిని పట్టుకోగలమని గ్రహించాలి. ఈ పోలికను అనగా ఒకే శిల్పం ఇక్కడ వివిధ వస్తువులను వ్యక్తం చేయడాన్ని గమనించగలం రివేరా కవిత్వంలో చూద్దాం

1.నదీ బాల్యమూ	**2. నదీమా**
దాటలేని బాల్యం నదిలా.. **గోలీని జేబులో పెట్టుకొని తిరుగుతున్నా** **నన్ను నేను కాపాడుకోడానికి** **కవిత్వంలో తల దాచుకున్నట్టు**	**టైగ్రిస్ నదీమా** **నిజం కదూ!** **బాగ్దాద్‌ని ఒరుచుకుంటూ** **ప్రవహించేప్పుడు** **కపన్లు కప్పిన నేలని** **పలకరించాల్సిన విషాదంలో** **నిజం కదూ!**

ఇక్కడ మనం ఒకే వస్తువును వివిధ రూపాలల్లో వ్యక్తం చేసే ప్రక్రియను ఖచ్చితంగా పట్టుకోవాలి, రివేరా కవిత్వంలో ఈ ప్రయోగం బాగా తెలుస్తుంది, మనం తన కవిత్వాన్ని పరిశీలించినప్పుడు దానిని పట్టుకోవడం సులభం కూడా. ఈ పోలికను అనగా ఒకే వస్తువు ఇక్కడ వివిధ శిల్ప రీతుల్లో వ్యక్తం కావడాన్ని గమనించగలం, అయితే తన కవిత్వంలో వస్తు–శిల్పాల ఐక్యత చాలా దృడంగా ఉంటుంది. అంటే అంత ఖచ్చితంగా వస్తువుకు తగ్గ నిర్మాణాత్మక వ్యక్తీకరణను కలిగి ఉంటుంది. ఇక్కడ దానిని రివేరా కవిత్వంలో చూద్దాం

1. అన్నం పెట్టే వేళ్ళు	**2. వేళ్లు...**
వేళ్ళు	**వేళ్లుంటాయి..వేళ్లు**
మునివేళ్ళ మీద	**కళాకారుడి వేళ్లు**
అన్నం ముద్దల్తో పాటు	**సృజనాత్మకంగా కదులుతుంటాయి**
స్పర్శాంతర శబ్ధ అలికిడిని	**బండరాళ్లని శిలలుగా మలుస్తుంటాయి**
భాషగా ఎత్తుకుంటాయి	**ద్వారబంధాలను వర్ణచిత్రాలతో**
	మరిపిస్తుంటాయి
వేళ్ళు చిగురిస్తాయి	**ఆశనిపాత భాధారల్ని**
వేళ్ళు నిలబడతాయి...	**తర్జుమా చేస్తుంటాయి...**

రివేరా కవిత్వం యొక్క పరిణామాన్ని గ్రహించడం జరిగితే సామాజిక సంబంధాలలోని వ్యక్తి పాత్ర, మరియూ ఆ వ్యక్తిగత సంబంధాల పరిధిలోని ఆ వ్యక్తి యొక్క స్వభావ స్వరూపాలను అందిపుచ్చుకుని సాగే క్రమాన్ని గ్రహించాల్సిన అవసరం ఉంటుంది. అయితే ఈ నేపథ్యంలో తన యొక్క చైతన్యం వివిధ అస్తిత్వాలను వ్యక్తపరిచే వాతావరణం అనివార్యంగా సాగుతుంది. వివిధ అస్తిత్వాలను భావజాల

కేంద్రంగా వ్యక్తీకరించడంలో తాను అస్తిత్వం యొక్క పరిధి, పరిమితిని తన నిర్దిష్ట పరిధిలో భాగంగా వ్యక్తం చేయడంగా ప్రారంభించడాన్ని గమనించవచ్చు. అందుకే ఈ సంక్లిష్ట వ్యవహారంలో తాను అస్తిత్వ కవిగా రూపుదాల్చుకుని సాగడంతో విప్లవ సాహిత్యంపై తనదైన అస్తిత్వవాద ప్రభావ నమూనాను కలిగించడం జరిగిందనే చెప్పుకోవాలి. ఈ అస్తిత్వ ఎరుక యొక్క సామాజిక స్పృహ అనివార్యంగా అవగతమయ్యే స్థితిని తన కవిత్వం ద్వారానే వెలబుచ్చడం ఈ కవి యొక్క భాద్యతగా సాగుతుంది.

"కాసిన్ని గోరుచిక్కుళ్లు కోసుకొచ్చి, వొలిసి
ఆమె నా కోసం వంట చేసింది
పిల్లలకు పెడదామని
అన్నంలో చెయ్యి కలిపింది
'ఆ....పట్టండి' అంటూ
చేతినీ, నోటినీ ఒకేసారి చాపింది.
పిల్లలు ఉండరు కాబట్టి
ఆ ముద్ద ఆమె గొంతు దిగలేదు
అంతే...చెయ్యి కడుక్కొచ్చి
పవిటతో నా పెదాలు తుడిచింది."

రివేరా కవిత్వం యొక్క విశేషం ఏమంటే ఖచ్చితంగా అస్తిత్వాన్ని ఒక లక్ష్యం దిశగా, ఒక గమన, గమ్యాలు దిశగా తీసుకెల్లడం, వాస్తవానికి అస్తిత్వవాద రచనలలో ఈ గమ్యం అనేది లేకుండా సాగుతాయి. ఈ గమ్యాలు ఆయా అస్తిత్వాలను పరిమితం చేస్తాయని భావించడం నుండి సాగుతాయి. అయితే ఈ పద్ధతిలో సాగకుండా వాటిని ఒక లక్ష్యం దిశగా తీసుకెళ్ళడంలోనే తన వైఖరి అర్థమవుతుంది...

"అది హైదరాబాద్

తలో కల కని పెంచిన నగరం

మంజీర...నదినిచ్చింది

గొల్లయ్య...కోటనిచ్చాడు

నవాబు...చెరువు తవ్వి చేపలను వదిలాడు

సూఫీలు...పూలతోటలను వేసి పోయారు

ఫౌజీలూ, ఫకీరులూ వచ్చారు

ఫిదాయిలూ, ఫిరదౌసీలూ వచ్చారు

పావురాళ్ళూ, పాలపిట్టలూ వచ్చాయి

అప్పుడల్లా పొలిమేరలు చెదిరాయి

అప్పుడల్లా హద్దులు రద్దయ్యాయి

ఇప్పుడు ఎవడోవచ్చి గీత గీస్తానంటే

యజ్ఞశాలో, పీనుగుల పెంటో చేస్తానంటే

గుర్తుపెట్టుకో!

జార్ లని, నిజాం జమిందార్ లని కూల్చిన నగరమిది

కాకమ్మ ఎగిరొచ్చి నీతల తన్నిపోద్ది చూసుకో!"

మానవ సంబంధాల జటిలత్వాన్ని సున్నితంగా పట్టుకోవడం అనేది ఒక కళాత్మక వ్యక్తీకరణలోని సౌందర్యాత్మక వ్యవహారం, అయితే ఈ సున్నితత్వం అనేది నిజానికి ఒక వర్గ స్పృహను వ్యక్తం చేసే పరిస్థితిగా ఉంటుంది, అంతే కానీ తన మస్తిష్కంలో జన్మించే ఒకానొక వ్యవహారం కాదని గమనించాలి, ఈ మస్తిష్కంలో

జన్మించే వ్యవహారం సైతం ఒక వర్గ చైతన్యం తప్ప వేరొక పద్ధతి కానే కాదు.. ఈ దృష్టి నుండి గమనించాల్సిన కోణం మనకు అవసరం. అందుకే రివేరా కవిత్వం ద్వారా వెలువడే ఒకానొక అస్తిత్వం నిర్ధిష్ట వర్గ సంబంధం యొక్క సున్నితత్వం తప్ప వేరొకటి కాదు. కావున నేడు రివేరా కవిత్వం నుండి మనం గ్రహించాల్సినది ఈ విశేషమే

"ఏం కావాలి?

అతడు అడుగుతున్నాడు

టప్పున మూసుకున్న

కిటికీ రెక్క సందుల్లోంచి చూసిన నగరం

తటిల్లతలా రెక్కలు విప్పుకొని ఎదుట నిలిచింది

ఇంకెం అడగను?

ఇక్కడే పట్టుకొని...!

గుట్టలు చెబుతున్నాయి

లోతులకు పోయిన కళ్లలో

కదలాడుతున్న పొడి మబ్బులా

నగరం మాటని కూడదీసుకుంటున్నది

మళ్లీ ఎంకెప్పుడు పలకరిస్తామో?"

ఈ సమాజంలో జరిగే, జరుగుతున్న కొన్ని యాదృచ్ఛిక సంఘటణలు, సన్నివేశాలు, సందర్భాలు మానవ మస్తిష్కంలో పుట్టుకొచ్చేవిగా భావించే వారు ఉండరా? లేదా సన్నివేశాలు కేవలం యాదృచ్ఛికమైనవని తేల్చేవారు ఉండరా? నిజానికి తలంలో

మనకు గోచరించే వాతావరణం ఒక అనివార్య రూపంలో భాగంగా ఉండవచ్చు. కానీ ఈ అనివార్యతను కర్మ రూపంగా, జరగవలసినది నిర్ణయించబడినదిగా కొందరు చెప్పుకుంటారు, ఈ విధమైన స్వభావం ఒక పద్ధతిలో అభివృద్ధి చెందడానికి కారణం ఆనాటి మానవ సమాజపు స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థగా చెప్పుకోవాలి. ఏమైనా ఈ వ్యవస్థ తాలుకు భావజాలం ఇంకా కొనసాగుతున్న వాతావరణాన్ని గమనించాలి. అయితే ఏ యాదృచ్ఛిక సంఘటనకైనా నియమానుసార మానవ ఆచరణ కారణంగా చెప్పుకోవాలి. అందుకే ఈ అంశంపై రివేరా కవిత్వ రూపంలో వ్యక్తపరచడాన్ని చూడాలి.

"కారణజన్ముల్లా
రెండు శరీరాలు కలిసినప్పుడు జననం
స్పర్శని స్మృతీతలంలో బిగబట్టిన
ఒకానొక గుప్పెట విప్పితే పావురాల టపటప
అరచేతి గీతల్లా గజిబిజి అనిపించవచ్చుగానీ
ఎవరో పారేస్తే ఎత్తుకున్నట్టు ఉంటుందిగానీ
పోలికలే కాదు, నవ్వినా, నడిచినా
ఎదురుబొదురు ముఖాలు పుష్పించినట్టే!
చీటింగ్ ని టీచింగ్ అని
మిర్చిని మికిచి అంటుంటే
నిఘంటువు అట్టల మధ్య
కొత్తభాషేదో విచ్చుకున్నట్టే!

అయినా, మాట్లాడుతూ మాట్లాడుతూనే

ఎంతకూ అర్థం కాకుండాపోతారు

పక్క పక్కనే ఉన్నట్లు అనిపించినా

అంతకంతకూ సమాంతరం అయిపోతారు

అప్పుడల్లా నీరెండ దిగులు

దానిలాగే నీటి కోసం, ఎండ కోసం బెంగ!

ఒక్కమాటలో ఏప్రిల్ నెల ఒక మజిలి, ఒక వెలితి!

ఎప్పుడూ అమ్మానాన్నలేనా....

వాళ్ళకోసం ఒక్కసారైనా

ఈ పిల్లలు మళ్లెందుకు పుట్టరో!"

తాను పడే, పడుతున్న కాలపు ఒంటరితనం ఒక స్మరణ రూపం, అదొక యాది, అదొక నిరీక్షణ, కనపడని దాని కోసం వెతికే ఒంటరితనం, నిజంగా ఈ ఘోష ఒక మధ్యతరగతి బుద్ధి జీవుడి నిరీక్షణ, విప్లవ కవి స్థానం అనగా తన వర్గ స్థానం, నిజానికి తన వర్గ స్థానం నుండి తన చైతన్యాన్ని వ్యక్తపరచడంలో విప్లవ స్థానాన్ని కూడా దానిలో అంచనాకట్టాల్సిన అవసరం కూడా ఉంటుంది. అందుకే తన చైతన్య రూపంలో విప్లవ స్థితిని కూడా అంచనా కూడా చేయవచ్చు. కావున తన వర్గ చైతన్యం నుండే విప్లవ చైతన్యాన్ని కూడా అర్థం చేసుకోవాలి.

"రోజూ నడిచే దారే

అయినా తరుచూ తప్పిపోతుంటా

అక్కడక్కడే కాళ్లు తొక్కుకుంటుంటా

దానిమ్మ చెట్టో, నిమ్మ పండో..ఏదో గుర్తు!

ఎవరెవరి అడుగుల్లోనో

అటూఇటూ తిరుగుతుంటా

అవునా,

ఇప్పటిదాకా

నడిచొచ్చింది

ముందుకా..?

వెనక్కా..?"

అంతేకాకుండా రివేరా ఒక మైనస్ అనే కవిత్వంలో ఇలా ఒక పరిస్థితిని చక్కగా వివరిస్తున్నారు. నిజానికి ఈ స్థితిలో మనం ముందుకు పోతున్నామా లేక వెనక్కా అని చూడటం వరకే పరిమితం కాకుండా మరింత ముందుగా తన భావోద్వేగం నుండి ఏకాంత జీవన సౌందర్యాన్ని ఆవిష్కరించడం జరుగుతుంది. ఈ ఏకాంతం ఒక సామాజికమా లేక ఒక ఏకత్వ రూపమా, నిజానికి వర్గ దృక్పథం నుండి దేనైనా గమనించాల్సిన అవసరం ఉంటుంది. అందుకే ఈ ఏకాంతం ఎవరికి సొంతం. ఈ ఏకాంతం ఒక సామాజిక రూపానికే అని మనం గ్రహించాలి. ఈ రూపం ఒక అనివార్య సామాజిక పరిస్థితి. నిజానికి ఈ రూపం ఉత్పత్తి కార్యకలాపం నుండి ఏర్పడే, నిర్ణయించబడేదిగా అర్థం చేసుకోవాలి. కావున ఒక పెటీ బూర్జువా స్థితిగా మనం ఒంటరితనాన్ని అవగాహన పరుచుకుంటే ఖచ్చితంగా ఈ ఒంటరితనం లేదా ఏకాంతం తాను ఆశించిన లక్ష్యం యొక్క వెనకడుగు నుండి ఏర్పడిన ఏకాకితనంగా విప్లవ కవిపై అవగాహన అవసరం. అయితే ఈ వాస్తవాన్ని గ్రహించడంలో రివేరా విప్లవ కవిత్వం యొక్క పరిణామాన్ని చూడటం ద్వారా అర్థం చేసుకోవచ్చు.

“పిల్లలు స్కూల్ కు వెళతారు.

పెద్దలు పని ఉన్నట్టు బయటకు వెళతారు

నేనూ నా నెలతక్కువ కళ్లూ మిగిలిపోతాం...

నేనూ మతి మరుపు శూన్య గోళమూ

ఎవరో శపించినట్టు

స్థాణు చలనంలో పడి లేస్తుంటాం!”

మనం చూసేది నిజం కాదు, ఎందుకంటే మన నేత్రాలు మనల్ని మోసం చేస్తాయి. ఇంకా ముందుకు వెళ్తే మన ఇంద్రియాలు మనల్ని మోసం చేస్తాయి అని, నిజానికి మన ఇంద్రియాల పరిమితులు మనల్ని మోసం చేస్తాయి అని వ్యవహరించే తాత్త్విక వాదం మనకు తెలుసు, కానీ మన ఇంద్రియ కార్యకలాపం, ఆలోచనా కార్యకలాపం మానవ ఆచరణ ఫలితం కావున ఇంద్రియ కార్యకలాపం–ఆలోచనా కార్యకలాపం మానవుని మెదడు ద్వారా గ్రహించబడి–ప్రతిఫలించబడి–వ్యక్తం కాబడుతుంది. కావున ఆభాస అనే పని కేవలం ఇంద్రియానికి పరిమితి చెయ్యలేము, మానవ ఆచరణలో ఒకానొక భ్రమాత్మక చైతన్యంగా చూడాలి. అందుకే రివేరా అరెస్టు ఒక ఆభాస అనే కవిత్వంలో చాలా భాగా ఒక సామాజిక ఆచరణలో జరిగే నిరసనలపై జరిగే అనచివేతలను ఒక సంఘటిత రూపంలో ప్రజలను తిరిగి సమీకరించేదిగా ఉంటుందని ఆధర్శవంతమైన శిల్పముతో వ్యక్తం చేయడం జరుగుతుంది. ఇక్కడ ఆ కవిత్వం ఏమంటే..

“కసికేసి తోమినా

మసిపోని గిన్నెనే దాచుకుంటాం

ఎంతకీ రాని ప్రేమ పిలుపుని

ఎక్కడా లొంగని వయసు నాగుని
డమెస్టిక్ అరణ్యంలోని
సంచారుల ఆవిరి అడుగులనే
పదిలపరుచుకుంటాం
ఐనా..కంచె దాటేశాక కథేముంటుంది?
కసిగా ఉమిసిన ఉమ్ము
ఏ ఉష్ణ గదుల్లోనో ఆరిపోవచ్చుగానీ,
కాలే కల మాటేమిటి?
నిజానికి జరగని సభల్లోనే
సందేశం సూటిగా ఉంటుంది
వెనక్కి తోసేస్తూ,
వ్యాన్ లోకి విసిరేస్తూ ఉండగానే
సభా వేదిక తయారయిపోతుంది
వాడు వేదికని చుట్టుముడతాడుగానీ,
అప్పటికే సభ అయిపోతుంది
పుల్ చార్జ్ తో జనం వెనుదిరుగుతుంటారు
అరెస్టు ఒక ఆభాస!!"

నిజమే ప్రపంచం ఒక విప్లవ క్షేత్రంగా సాగుతున్న సందర్భం. ఈ సందర్భం ఒక గెలుపు-ఓటముల కాలాన్ని సైతం తనవెంట కొనసాగిస్తుంది. కారణాలు అనేకం కేవలం భావాత్మక రూపంలో వ్యక్తం చేస్తే సరిపోతుందని మనం ఊరుకోకుండా దాని భౌతిక పరిస్థితుల అంచనా పై ఆదారపడి సాగే పద్ధతి నుండి చూడవలసిన

అవసరం ఎంతైనా ఉంటుంది. అయితే ఈ అంచనాను ఒక కవితాత్మక రూపంలో వ్యక్తపరిచే భాద్యతను రివేరా గురి చూసి అనే కవిత్వంలో వ్యక్తం చేస్తున్నాడు.

"మేం ఏమైనా కావచ్చుగానీ, అమాయకులం కాదు
బారు ఫిరంగులకు భయపడే బడుద్దాయలం కాదు
ఎదురొచ్చే కాలంపై ఎగబడి బాకు దూస్తున్నవాళ్లం
కూలుతున్న నగరాల్లోంచే మళ్లీ మళ్లీ మెలకెత్తుతున్నవాళ్లు.."

ప్రభువా..! అనే కవిత్వంలో శిల్పం యొక్క రూపం ఖచ్చితంగా అపార్థానికి గురికావచ్చు. ఎందుకంటే తాను ఎవరి గురించి కవి వ్యక్తం చేస్తున్నారో వారంతా దైవీక శక్తుల ఆరాధనలో మునిగి తమ జీవితాలను కొనసాగిస్తున్నారు. ఐతే ఆ దైవీక శక్తినే ఒక శిల్పంగా మార్చి ఈ అనుచరుల అమాయకత్వాన్ని చూపించడం జరుగుతుంది. అంతేకాకుండా ఆ దైవీక శక్తిని విమర్శించడం కూడా చేస్తాడు మన కవి....

"ఈ దిసమొలల నృత్యానికి నీ పేరే పెడతాం
దిగంతాలను తాకే నఖశిక నగ్నత్వంలో
తుళ్లిపడే నీ వీరత్వాన్నే పలుకుతాం
ఊపేసే గాలుల్లోనే కాదు, ఉక్కపోతల్లోనూ
నాయకా! నీ కాళ్ల సందుల్లోంచే నడిచిపోతాం
శిశ్న సంధ్యల్లో శిశువులమై కేరుమంటాం...
మా మనవీ విని సామీ!
ఆకాశానికి గంట్లు పెట్టిన

ఆ గారాల గోళ్లు మాకిస్తావా?

కడుపారా నాటుకుంటాం

సభామధ్యంలో నువ్వు చింపేసిన చీరలూ,

లాగేసిన రవికె గుడ్డలూ దయచేస్తావా?

అతుకులేసుకొని చుట్టుకుంటాం...”

ప్రేమ కవిత్వం అనేది సాధారణంగా మనం ఇటీవల గమనించవచ్చు. కానీ ఈ ప్రేమనే సంపూర్ణంగా అన్ని మానవ సంబంధాలకు అన్వయించి చూపడం జరుగుతుంది. కానీ ఈ రూపంలో విప్లవ కవిత్వం వెలువడటం ఖచ్చితంగా జరగవచ్చు కానీ ఈ రూపాన్నే అన్ని మానవ సంబంధాలకు ముడిపెట్టి సాగడం జరగదు. అయితే జరగడాన్ని కూడా చూడవచ్చు. నిజానికి రివేరా ఈ కవిత్వంలో ఈ స్పృహతోనే ముందుకు సాగాడని అంచనా వేయవచ్చు. అయితే ఈ అంచనాకు రాగల కారణాన్ని తన కవిత్వంలోనే చూడవచ్చు. ఒక సామాజిక సంబంధంగా దానిని అవగాహన పరుస్తాడు..

“ప్రియురాలి ముద్దుకి భయపడే

నిర్వీర్యుల్లో నేను ఎన్నోవాడినో!

ఇంటికి వచ్చే దారిలో

అక్కడో ఇక్కడో పడుకుండిపోయే విటుల్లో ఎక్కడో!

అంకెల ఎమల్గాం నుంచి జారి

కెవ్వుమనే అనాథల్లో నా స్థన్యం ఎవరికో!

అయినా..

అవునులే...మూత్ర విసర్జన చేసినంత సేపూ

అవునులె.. తాగుబోతు రాత్రి

ఐదో ఔన్సు పూర్తి చేసినంతసేపూ

అవునులే..శృంగారనంతరం

కన్య దేహం ఆరినంతసేపూ

అయినా..

రాయి ఇరిగిన పాదమిది

పాపం ఎక్కడని వదిలేస్తాం?

ఒంటరి కాలమిది

వద్దని ఎలా వదిలించుకుంటాం?"

కామ్రేడ్ విధానంలో సాగే సంబంధం ఒక అనుభూతిలో నిర్దిష్ట మానవ సంబంధాల మొత్తాన్నీ పెనవేసుకు సాగుతుందని మన రివేరా తన కవిత్వం ద్వారా నిరూపించడం జరుగుతుంది. అందుకే తన నేనున్నాను అనే కవిత్వంలో ఒక స్పష్టమైన విధానంని చూపుతున్నాడు. అయితే ఈ విధానంతో మన అవగానను సైతం పెంచుకుని ముందుకు సాగాలి. అయితే ఈ సంబంధాలను అన్ని కాలాల్లో ఆయా సందర్భాలను అనుసరించి సాగడమే ఒక విశేషం, అయితే ఈ రూపాన్ని కామ్రేడ్ తరహాలో మరింత ఉన్నతంగా సాగుతుంది. అది స్వార్ధం లేని రూపంగా చలామణి అవుతుంది. అందుకే ఈ కామ్రేడ్ విధానాన్ని మనకు కవిత్వ రూపంగా నిరూపిస్తున్నాడు రివేరా చాలా సున్నితమైన మానవ సంబంధాలను మనకు కవిత్వ రూపంగా వెలువడిస్తున్నాడని చెప్పుకోవాలి.

"కామ్రేడ్ నేనున్నాను

కాలికి వేలాడుతున్న గొలుసులను

కాలానికి వద్ద సంకెళ్లను తెంచుకొని
చరిత్ర ఒళ్లు విరుచుకునే
సుభోదక క్షణాల్లో నేనున్నాను
కామ్రేడ్ నేనున్నాను
మనుషులు లేని రోడ్లు మీద
వెచ్చగా పరుచుకోనే
ఉదారంగు కాంతి శ్వాసలో నేనున్నాను
కామ్రేడ్ నేనున్నాను
నేనున్నాను కామ్రేడ్
చిట్లిన పెదాలపై
పాట ముద్దర చెరగనంతవరకూ
చిప్పిల్లిన కంటిపాపలపై
కలల చెమ్మ ఆరిపోనంతవరకూ
కామ్రేడ్ నేనున్నాను
నేనున్నాను కామ్రేడ్"

కవిత్వాన్నే ఒక వస్తువుగా దాన్ని ఒక రూపంగా వ్యక్తం చేయడం ఒకానొక ప్రయోగంగా మనం ప్రస్థావించాలి. అందుకే ఈ విధానం మనకు అనుసరణీయం, అయితే ఈ రూపంలో జరగాల్సిన కవిత్వ ప్రయోగాన్ని చూపడమే రివేరా ముందు చూపుగా అర్ధం చేసుకోవాలి. నిజానికి ఇలా సాగే విప్లవ కవిత్వ ప్రయోగం నిజానికి ఒక ఆధర్శవంతంగా ఉంటుంది. కానైతే ఈ రూపంలో ఎంతమంది కవిత్వాన్ని

ప్రశ్నించడం, తర్కించడం జరుగుతుంది అంటే చాలా తక్కువ మోతాదులోనే అని అవగాహన చేసుకోవాలి. కావున ఈ కవిత్వం ఒక ప్రయోగం మాత్రమే కాకుండా కవిత్వం యొక్క భాధ్యతలో వెలువడాల్సిన అంశాలను సైతం ముందుకు తేవడంగా చెప్పుకోవాలి. అయితే ఎవరు కాదన్నా అవునన్నా కవిత్వం తన పని తాను చేసుకుపోతుందని నిరూపిస్తున్నారు మన రివేరా ఎడిట్ కాని పోయెం అనే కవిత్వంలో...

"చాయ్ పత్తి తోటల్లో మెలికలు తిరిగే
బూడిదరంగు పాముపై ఇది ఎన్నో దెబ్బో?
ఏ మలుపు వద్దనో
కాసుక్కూర్చునే మనిషిని
అదిప్పుడు దాటుకుపోవడం ఎలా?
ఇప్పుడంటే
రోడ్డుపైకి వచ్చిందన్నారు గానీ
ఇప్పుడంటే
వాకిట్లో దిష్టిబొమ్మలా నిలిచిందన్నారు గానీ
దాని విరుపు మెరుపుల్లో
మనిషి మూల ఛాయలున్నాయి
పురానా షహర్ పురా స్మృతులున్నాయి
జై తెలంగాణ నినాదాల, దిగంబర ఝురుల
స్వరపేటికలెన్నో అ వేడి కౌగిట్లో బందీలయ్యాయి
ఎక్కడున్నా వెతుక్కొని కాళ్లకు చుట్టుకున్నట్టు

ఒకటి రెండు గుటకల తరువాత

దాని ప్రస్తావన రావాల్సిందే కదా!

బెరుకు బెరుకుగా

టీ మరకలు పడ్డ కాగితం మడతలు విప్పి

ఎడిట్ కాని పోయెంని దానికి వినిపించేలా

ఎన్నిసార్లు గొణుక్కోలేదు?

మాకు తెలుసు

ఎంత వెనక్కి నెట్టినా

మనుషుల మధ్యే సంచరించాలనుకుందని....

ఎంత వద్దనుకున్నా

సమూహాల అలికిడిలోనే

బతికేయాలనుకుందని...

ఇప్పుడిలా కూలిపోతూ కూడా...

తనను కూలస్తున్న మనిషినే

పలవరిస్తూ ఉంటుందని..”

చాలా మంది కవులు తాము చూసిన, విన్న, లేదా ఉహించిన ప్రదేశాలపై ఒక సౌందర్యవంతమైన కవిత్వ రూపంలో చక్కగా రాసుకుంటూ పోతారు, అందులో రసవత్తరమైనవి ఎన్నో ఉండవచ్చు, కానీ ఈ కవులను విప్లవ కవులను మనం పోల్చుకోలేము కూడా లేదా రూపాన్ని ఈ కవులకు పోటీ పెట్టినా వస్తువును పెట్టలేము,

లేదా వస్తువును పోల్చినా రూపాన్ని పోటిపెట్టలేము, అందుకే రివేరా కవిత్వ కేరళం అనే కవిత్వంలో...

"అయినా శ్వాసించని మనిషి
స్పర్శ అందని శ్వాసా ఉంటాయా?
చెయ్యి తగలకుండా పుటకి
కళ్లు తడవకుండా కలకి
అంత కమ్మదనం వస్తుందా?
తుది యుద్ధ ఘట్టంలో
శరీరాన్నంతా ముక్కుపుటాల్లోకి
తెచ్చుకునే వీరుణ్ణడుగు
వాసన రుచి చెప్తాడు
ఎప్పుడూ తెరిచిపెట్టిన తలుపులా
తెల్లరగట్ట సూరీణ్ణి సమ్మచేసుకొని...
కురవడం ఆగినప్పుడు చిట్లే
చివరి చినుకు తడిలో పురిటివాసన
ఊపిరి నిలిపి గుటక దానం చేసిన
పాచి అన్నమూ, బురద నీళ్లలో ప్రాణవాసన
చుంభనానంతరం మెరిసే దేహాలతో
విహారానికి వచ్చిన
జూన్ నెల కేరళ మేఘాల్నిండా కవిత్వం వాసన!"

రివేరా కవిత్వం యొక్క విధానంలో పరిణామ క్రమాన్ని అవగాహన చేసుకోవడం మన ముందున్న కర్తవ్యం, ఈ పరిణామం ఒక అనివార్య సామాజిక వాతావరణ క్రమంగా అర్థం చేసుకోవాలి. అయితే ఈ విషయంలోనే మనం ఒక మూస పద్ధతిలో సాగిపోవడం జరుగుతుంది, ఎందుకంటే మనకున్న విపరీత విప్లవ విశ్వాసం అని కొందరూ వాదించవచ్చు కానీ ఈ సందర్భం ఒక అనివార్యతగా భావించే విప్లవవాదులు కూడా ఉన్నారు. అంటే వారు నమ్మే విప్లవం ఏ విధమైనది లేదా ఆ విప్లవం ఏ సిద్ధాంతంపై సాగుతుంది అని మనం అంచనా వేసినప్పుడే గమనించగలం. అయితే ఈ గమనిక అందరికీ ఉంటుందా లేక కేవలం కొందరికే అంటే అది వారి సైద్ధాంతిక స్థాయిలో చూడాలని వాదించడం సమంజసం, కానీ ఈ అవగానను ఆచరణ అనే అంశంపై విమర్శించడం జరుగుతుంది, అయితే ఈ సైద్ధాంతిక వ్యవహారం ఆచరణ యొక్క కొనసాగింపా అంటే కాదనే పద్ధతిలో వాదించే మేధావులు కూడా ఉన్నారు, అందుకే సైద్ధాంతిక ఆచరణగా భావించాలి. అయితే ఈ సైద్ధాంతిక ఆచరణ నిర్దిష్ట పరిస్థితుల నిర్ధిష్ట నిరూపణపై ఆధారపడి సాగుతుందని భావించే సిద్ధాంత అవగాహన అవసరం. ఈ అవగాహన వచ్చే క్రమం మనకు దూరంగా ఉన్నది అంటే మనకున్న పిడివాదం ఆఖరికి ఆచరణకు సైతం అంటగట్టేంత సిద్ధాంతం ఉన్నది. కావున ఈ అన్యవర్గ రూపాలను ఎదురుకునే కర్తవ్యం మిగిలి ఉన్నది. అందుకే రివేరా కవిత్వం ఒక అన్వేషణలో సాగడం, ఈ పద్ధతి నిర్ణయించే వ్యవహారంలో వ్యక్తి యొక్క భావ చైతన్యం యొక్క గుర్తింపులో సాగే క్రమ పరిణామంగా ముందుకు తీసుకెల్లే కవిత్వమే అతడు ఎవరు?

“మీ ఖాళీతనాలను ,రికామీ సమయాలను

కొసకంటా తగలేసిన విషయం కాదండి

మీ బుర్రలూ, గదులూ గరుకని, ఇరుకని
విసురుగా అనేసిపోయిన ముచ్చట వద్దులేండి..
ధర్నాచౌక్ ల మీద ఒట్టు, ఇబ్బంది లేని ప్రశ్నే
ఇంకెవరూ..అని అనైనా అనండి
బెట్టింగులు కడతాడనో
రేవ్ పార్టీల్లో కంటబడ్డాడనో
బైక్ రైడ్లో కాళ్లు విరగ్గొట్టుకున్నాడనో
ఊపిరిని ఉలిపిరి కాగితంలా ఊదేసేవాడనో
ఏదో ఒకటి, అసలికీ చెప్పండి
అతడు ఎవరు?
సెకండ్ సాటర్ డే నాడే వార్త తెలిసింది
ఆదివారం సెలవు రోజే మట్టయ్యాడు
ఇప్పుడైనా చెప్పండి
అతడు ఎవరు?"

ఈ దేశం ఎటుపోతుంది అనే ప్రశ్నను తరుచూ వేసుకుని దానికి సమాధానాన్ని అన్వేషించే పనిలో ఉండటం రివేరా వంతుగా ఉంటుంది, అందుకే రివేరా కవిత్వంలో అదొక ప్రధాన సమస్యగా, ప్రశ్నగా ఉండటం జరుగుతుంది. అయితే రివేరా అనుకునే అభివృద్ధి జరిగే, జరుగుతున్న అభివృద్ధి హాస్యాస్పధంగా ఉంటుంది. అందుకే ఈ రూపంలో తాను వేసుకునే ప్రశ్నగా ఈ దేశం ఎటుపోతుంది. అయితే ఈ ప్రశ్నకు ఆయనే ఒక సమాధనంగా కవిత్వాన్ని ఆవిష్కరిస్తాడు, అందుకే రివేరా మన ముందు అద్దదీ.. అంటూ ముందుకు వచ్చాడు.

"ఇంకెంత దూరం, ఇదెంత నయాగారం

పాలకులంతా ప్రజాస్వామికవాదులై

ప్రజలేమో నియంతలైతే ఏమి చేస్తాం?

అన్నాలొద్దూ, సున్నాలొద్దూ

అవతలోడి గట్లో కాలేట్టేసి, ఆడి కూట్లో

మన్ను కొట్టేయమంటుంటే కాదంటామా?

పాలూపెరుగూ, పెన్షనూ పరకా యేట్లో పడనీ...

చెంకిపాతలను సర్రున చింపేసి, జెండా కర్రలెత్తి

తంతానికి వస్తుంటే తప్పుతుందా?"

ఇలా తాను ఈ కవిత్వంలో భారత దేశం యొక్క ప్రస్తుత పరిస్థితులను ప్రస్తావిస్తూ సాగే సందర్భాన్ని గమనించవచ్చు, అయితే అదే కవిత్వంలో ఇలా మన అభివృద్ధి యొక్క నిజాన్ని, మతోన్మాద కుట్రలను బహిరంగ పరుస్తూ ముందుకు సాగుతున్నారు...

"గిట్టనోళ్ళు గిల్లనీ గిచ్చనీ

సూటూకోటూ అంటూ గాము పట్టించనీ

మాల్యా కొట్టిన గోల్ఫ్ బంతికీ, గరిక నాభీకీ

నడిమి దూరమెంతంటారా, అడుక్కోనీ

సరిహద్దుల్లో తొడగొట్టే మొనగాడా...

అంబానీల బావుల్లో తొంగోగలవా అంటారా, సవాలిడసనీ.

మీ ఏడ్పులు ఎప్పుడూ ఉండేవేగానీ..

స్వాతంత్ర్యం వచ్చాక దేశం సిగ కట్టిందిప్పుడే, తెలుసా!

వెతికీ వెతికీ ఆడీడి పుట్టల్లో

కుసాల్గా వేలెట్టింది మొదట మేమే, నమ్మండి!

అప్పుడెప్పుడో కురుక్షేత్రం తరువాత మళ్లీ

జాతి జాతంతా కేరు కేరుమంటున్నదిప్పుడే, వినపడుతుందా?"

ఈ వాక్యాన్ని ఉరి తీయాల్సిందే, కానీ.. అనే కవిత్వంలో రివేరా నేటికీ జరుగుతున్న దళిత సమస్య కావచ్చు లేదా అణిచివేతకు సంబంధించిన విషయం కావచ్చు మరియూ ఇంకేమన్నా నిర్భంధ రూపం అనుకోవచ్చు కూడా అయితే ఈ కవిత్వంలో భావజాలపరమైన అంశాన్ని ప్రస్తావించే దృక్పథం ఉన్నది. ఆయన చాలా స్పష్టంగా ఈ భావజాల తలంలో కవిత్వ వ్యవహారాన్ని నిలబెట్టి పోరాడాలనే ఉద్దేశాన్ని గమనించవచ్చు.

"ఈ వాక్యం ఇంతే

మెలికలు మెలికలుగా

చుట్టుకుపోతూనే ఉంటుంది గానీ,

కులంగాడి అంత్యక్రియలకు బయలుదేరిన మనం

ఇక్కడిలా పడి ఏడుస్తున్నాం ఎందుకని?

పేలవమైన వాక్యం, పలచని వాక్యం

ఏ నరాన్నీ మీటలేని నిరర్థక లిఖిత వాక్యం

చుర చుర చూపుల్లో దహనావ్వాల్సిందే గానీ,

వంగిన నడుములపై

ఎగిరే జెండాలో ఏ ఆకాశం ఎవడిది?

నిటారుగా నిలబెట్టిన జడకర్రకు

నిషిద్ధ ఫలం తగిలినంతనే మైలపడుతున్నదెవరు?

చితి ఒడ్డున నిలబడి

ఎవడో అరుస్తున్నాడు

వాట్ ఈజ్ రాంగ్ విత్ మీ..

తప్పు చేయనివాడినే కాదు,

చెమ్మగిల్లనివాడినీ గురి చూద్దాం

అక్కడ ఈ వాక్యాన్ని ఉరితీద్దాం."

కవిత్వం కేవలం ఒకానొక పరిమితులల్లో కుదించబడిందని ఆవేదనను వ్యక్తం చేయడం రివేరా భాద్యతగా తీసుకున్నారు. నిజానికి విప్లవ కవిత్వం పరిమితులను చెప్పడమే కాకుండా భాద్యతను సైతం వ్యక్తం చెయ్యాల్సిన అవసరం ఉంటుందని రివేరా తన కవీ ఏమంటావు? అనే కవిత్వంలో ప్రస్థావించడం జరిగింది. దాన్ని నేటి హైటెక్ కవులకు మార్గదర్శకంగా అర్థం చేసుకోవాలి...

"కవి సమయాల్నిండా

మృత శీతల పుష్యమి రాగాలేనా?

ఫేస్ బుక్ వాల్ పై

కాలర్ నలగని నాదాలేనా?

కత్తులు దూస్తున్నవాడికి సరే

దుఃఖాలు మోస్తున్నవాళ్లకీ ఇన్ని ముఖాలా?

అయినా, యుద్ధ ఉపాసకుడి నేల ఇది

ఎక్కడని స్వతంత్రత ప్రకటించుకొందాం?

నీచంచులపైకి భూగోళాన్ని దించాల్సిన సమయమిది

పెన్ కంప గీతాలతో స్వాగతిద్దామా, వద్దా?"

కవిత్వం అనివార్యంగా ఫలితప్రాధాన్యవాదంగా అది అస్తిత్వవాదంగా పరిణమించడం జరుగుతుందనే చెప్పుకోవాలి. నిజానికి కవిత్వం ఈ దిశగా మారడం ఒక అభివృద్ధిగా అనుకునే మేధావులు ఉన్నారు కూడా. కానీ ఇది అభివృద్ధి వాదంగా ముందుకు వచ్చిందని అవగాహన అని వాదించడం జరుగుతుంది. ఈ వాదం ఒక స్థాయిలో విప్లవ సాహిత్యాన్ని సైతం ప్రభావం వహించుతుందని అర్థం చేసుకోవాలి. అయితే ఈ కవిత్వం కేవలం కొన్ని పార్శ్వాలను తడిమి అన్నింటిలో తమను ప్రతిష్టించుకునే వాదంగా అభివృద్ధి చెందుతుంది.

"చావుకు దగ్గరయినవాడికి తడి దిగులు

నాలుకతో ముక్కని తాకామా అని కాదు

వస్తే, రానిస్తే ఈసారి వర్షించే కళ్లకి వేలాడాలనే..

మా అమ్మాయికి పాపిడి దిగులు

కత్తిరింపులూ, ఒత్తిగింపులూ వట్టిమాట

ఉన్నదల్లా కల్లోనైనా తల చెదరొద్దనే...

తనమంతా యథాతథం

తలమంతా నిశ్చలం

ఎగుడుదిగుడు బావిలోంచి

దిగులు సేదే చేతులు కావాలిప్పుడు."

ఏమైనా కవిత్వం ఒక ప్రక్రియగా విప్లవ సాహిత్యంలో ప్రధాన పాత్రను పోషిస్తూ ముందుకు సాగుతున్నప్పుడు మిగతా రంగాలలో తన కృషిని అభివృద్ధి చేయకపోవడం అనే విమర్శ ఉన్నది. కానైతే విప్లవ సాహిత్యం కేవలం కవిత్వానికే పరిమితం కాదని అర్థం చేసుకోవాలి. నిజానికి విప్లవ సిద్ధాంత చర్చను కూడా సాగించే చరిత్ర ఉన్నదని మనం గ్రహించాలి. అయితే కవిత్వం ద్వారా ఆకర్షించే పనిని మాత్రం కాలిగా సాగుతున్న కాలం ఉన్నదని మనకు అనిపించవచ్చు. అయితే ఈ కాలీని ఫలితప్రాధాన్యవాదం పూరించి ముందుకు సాగడంతో కాలాన్ని ప్రతిఫలించేదిగా సాగుతుంది. అందుకే అది విప్లవ సాహిత్యం లేదా విప్లవ కవిత్వంగా చలామని అవ్వదు. నిజానికి ఈ అంశాన్ని గ్రహించడం మనకు ముఖ్యమైన సమస్యగా ఉన్నది కూడా.

"నిజమే

ఎడ్యుకేషన్ ఈజ్ ఏ సిన్,

అయినా, చేసేదేమీ లేదన్నాం..

అన్నది మేమే..మేమే,

ఒప్పుకొంటాం కానీ..కానీ,

టమాట వేలాడుతోందని ఎక్కడ,

సముద్రాలను రద్దు చేసుకొంటావోనని దిగులు..

ఎర్రగా ఉన్నదని ఎండ్రకాయనీ

కలలోకి రానీయవేమోనని బెంగ

ఇప్పుడు అన్నం మీద అలిగినట్టే

రేపు...రేపు..."

సబ్ కా సవాల్ తూ! అనే కవిత్వంలో ఇలా అంటున్నారు రివేరా...

కానీ, నీ కోసం కుట్ర రచిస్తున్న

కానీ, నీ కోసం తొట్రుపడుతున్న

కానీ, నీ కోసం ఉరికళ్లతో దేవులాడుతున్న

కానీ, నీ కోసం వెలి బూడిద రాసుకు తిరుగుతున్న

నాకూ, నా ప్రియమైన దేశానికీ ఏముందని?

ఇక్కడ మన కవులందరికీ ఒక మార్గనిర్ధేశికతను ఏర్పర్చడం మాత్రమే కాకుండా ఒక కార్యాచరణను స్పష్టం చేస్తున్నారు, అందుకే ఆయన ఒక కార్యాచరణ విప్లవ కవిగా అర్థం చేసుకోవాలి. కాబట్టే ఆధునిక కవిత్వంలో తనవంతుగా ముద్రను ఏర్పర్చిన కవిత్వాన్ని వెలువడించడం అతని భౌతిక కాలమే కారణంగా, అందులో ఆయన చైతన్యత పాత్రను అర్థం చేసుకోవాలి కూడా. అందుకే అదే కవిత్వంలో...

"కప్పుకొన్న జాతీయ జెండాలో చలికి

మూత్రం పోసుకొంటున్న బాల నేరస్థుడు

వృత్తలేఖిని పట్టుకు తిరుగుతున్న భూగోళమూ...

ఇంతకుమించి నీకు పంపడానికైనా

రహస్యంగా పంచడానికైనా ఏముందని?..

ఈ దూప్ కీ దర్వాజాలో

ఈ మాత్రమైనా నిలబడి ఉన్నా

గుర్తు తెలియని శవంలో

శాప విమోచన పొందుతున్నా"

రివేరా కవిత్వం అనే సముద్రంలో అనువాదం కూడా ఒక ముఖ్య అంశం. రివేరా అనువదించిన కవిత్వాలు అనివార్యంగా ఒక విప్లవ సాహిత్యానికి నిర్దిష్ట పరిస్థితుల్లో గుణాత్మక చేర్పుగా అర్థం చేసుకోవచ్చు. కానైతే ఈ ఎంపికలో తన వంతు పాత్రను సైతం చొప్పించి కూడా ముందుకు తీసుకు రావడం ఒక గొప్ప భాద్యతగా చెప్పుకోవాలి. అలా రివేరా కవిత్వ అనువాదాలలో భయం చుట్టూ భయం.. కవిత్వంలో

"పని చేవాడికి అదెక్కడ ఊడుతుందోనని భయం

అది లేనివాడికి ఎప్పటికీ దొరకదేమోనని భయం

ఆకలి భయం లేనివాడికి అమ్మో తినాలా అని భయం ...

ఫౌజీ అంతే పౌరులకు భయం

సరిపడా ఆయుధాలు లేవని ఫౌజీకి భయం

అయ్యో యుద్ధాలు తగ్గిపోయాయని ఆయుధాలకు భయం

ఈ కాలం నిండా చుట్టేసుకొన్న ఒకటే భయం..భయం.

గుంపులంటే భయం, ఏకాంతమన్నా భయమే

ఏమిటోనని భయం..ఏమయి ఉంటుందోనని భయం

చావాలంటే భయం..బతకాలన్నా భయం..భయం.."

తాను ఈ సమాజంలో జరుగుతున్న పరిణామాలను అత్యంత సూటిగా చెప్పడం అనే కర్తవ్యాన్ని అందిపుచ్చుకున్నాడు, ఈ భాద్యత అనే విషయంలో సామాజిక మార్పు

అనే కాలం కూడా కారణంగా చెప్పుకోవాలి. నిజానికి ఈ భాధ్యతను విప్లవ సాహిత్యం నెరవేర్చుకోవాలి. అయితే ఈ కర్తవ్యం అనివార్యంగా అన్యవర్గ ధోరణులను అధిగమించాలి. అయితే ఈ అధిగమన భాధ్యత విమర్శనాత్మక పద్ధతిలో సైద్ధాంతిక రూపంలో జరగడం ఇంకా ఒక జటిలమైనదిగా తయారైనది. ఎందుకంటే అతి తీవ్రంగా సాగుతున్న ఆధునికానంతర తాత్త్వికతే కారణంగా చెప్పుకోవాలి. ఈ తాత్త్విక సాంప్రదాయాలు అనివార్యంగా కవిత్వంలో సైతం రావడం, నిజానికి కవిత్వమే ఈ ఆధునికానంతర తాత్త్వికతను మోసుకెలుతున్న సాహిత్య ప్రక్రియగా మారిపోవడాన్నీ గమనించవచ్చు. అయితే ఈ తాత్త్వికతను విప్లవ సాహిత్యం భర్తీ చేస్తుంది. అయితే అది ఏ విప్లవం అని గ్రహించాలి. ఇక రివేరా శీర్షిక లేదు అనే కవిత్వంలో ..

“భూమి పొరల్లోంచి
తల బయటకు చాపి
ఆకాశానికి కలల అంటు
విత్తన గర్భం విషం చిమ్ముతూ,
పైరుని పీకి పారేస్తున్న చోట
పెళ్ల పెటీల్మన్నా సూర్యోదయమేగా!..
జ్ఞాపకమూ అంతే...
నీకు గేలమేసి
గతానికి కన్ను కొడుతుంది..
వాడు మొదట కాలాన్ని కాదన్నాడు
పండుని రాల్చేశాడు

కాంతిని ఆర్పేశాడు.

రుచిని చంపేశాడు.

ఆ తరువాత విత్తనాన్ని ఉరేశాడు.

ఇప్పుడు ఈ నేలా నాది అంటున్నాడు.

దులిపేసిన బిస్తర్ నిండా

పత్తి కాయల్లా పగిలిన కళ్లు

ఈ కళ్లే కదా

అవి పిల్లలవయితేనేమీ..

మన శరీరాలను చీల్చుకెళ్లాయి.

చీలిన మర్మాంగ రెప్ప కదులుతోంది

చూడు చూడు నవ్వుతోంది, చిదిమేయ్…"

ఈ కాలం యొక్క ప్రతిఫలనంగా కవిత్వాన్ని ప్రతిబింబించే కవిగా సాగడమే కాకుండా, రివేరా భవిష్య దర్శనం అనే దృష్టి ఒక అనివార్య కాలపు స్థితిగా అర్థం చేసుకోవాలి అలాగే తన కవిత్వంలోని వ్యక్తి స్థానం కూడా అనివార్యంగా కాలం యొక్క అంశాన్ని పరిగణించడం నుండి అర్థం చేసుకోవాలి. అప్పుడు మాత్రమే రివేరా కవిత్వాన్ని అంచనా కట్టవచ్చు. ఈ అంచనా నుండి మనం గ్రహించే విషయం విప్లవ కవిత్వం కేవలం ఒకానొక సామాజిక సామాన్యతను వ్యక్తం చేసే పరిమితి కాకుండా అదొక సామాజిక ప్రత్యేక రూపం యొక్క సామాన్య వ్యవహారంగా కూడా చూడాలి. అప్పుడే ఈ నాటి విప్లవ కవిత్వం అర్థం అవుతుంది. అందులోనూ సామాజిక సామాన్య స్థాయిలోని నూతనత్వాన్ని కొనసాగిస్తుందా లేకా కేవలం ప్రత్యేక రూపంలో పరిమితం

అయ్యి కొనసాగుతుందా అని గ్రహించాలి. నిజానికి ఈ రెండు రూపాలు అనివార్యంగా రివేరా కవిత్వంలో గమనించవచ్చు. కాబట్టే ఇప్పటి మన పరిశోదనకు ఉపయోక్తమైనదిగా ఉంటుంది. కావున ఈ నేపథ్యం నుండే రివేరా కవిత్వాన్ని అర్థం చేసుకోవాలి. కావున కాలం యొక్క పాత్రను అవగాహన చేసుకుంటూనే స్థలం యొక్క పరిస్థితినీ మనం గ్రహించి, పరిగణించి ముందుకు సాగాలి.

"శవాన్ని గడపలో పడేస్తే
ఇల్లూ చినిపోయినట్టా?
అక్కడ మనిషే లేదంటుంటే
నీ గోలీల గోలేమిత్రా?
ఆ ఆకాశంలో
ఏమేమి రాలాయో మొన్నా, నిన్నా
అప్పుడూ ఏ చప్పుడు చెరిపేసిందో
నిద్రపట్టనీయని నిశ్శబ్ద భంగిమలను
ఆత్మహత్యల శాసనం అమల్లో ఉన్నప్పుడు
హత్య చేసుకోవడమే తిరుగులేని మెటాఫర్
విసిరేసిన కరపత్రమంత అల్కాగా
చావుని ఎగరేసొచ్చి,
ఎప్పటిలాగే వోడ్కా వంపేయవూ అక్కా!"

రివేరా కవిత్వం యొక్క పరిణామం ఒక గుణాత్మక రూపాన్ని సంతరించుకుందని మనం ఇది వరకే గ్రహించాము. అయితే ఈ పరిణామం ఒక సూక్ష్మ రూపాన్ని

మనకు వెలిబుచ్చడం నుండి సూక్ష్మ రూపంలో ఒక సైద్ధాంతిక రూపంలో వ్యక్తమయ్యే వ్యవహారాన్ని గమనించగలం అందుకే అదొక అనుభవవాదంగా చలామణి అవ్వడం, ఈ అనుభవవాదం నుండి కవిత్వం వెలువడటాన్ని మనం గ్రహిస్తే రివేరా కవిత్వం ఒక నూతన రూపాన్ని సంతరించుకున్న గత తాత్త్విక శఖ యొక్క అనుసరణగా సాగడాన్ని గమనించవచ్చు. అయితే ఈ రూపంలో జరిగే విధానం ఖచ్చితంగా భారతీయ భావవాదపు తీవ్ర ఆధిపత్యంగా చెప్పుకోవాలి. కావునే అనుభవవాదంకు దారి తీస్తుందని నెట్టేయలేము కూడా, అది వ్యక్తి యొక్క తాత్త్విక నేపథ్యం కూడా అవ్వచ్చు. నిజానికి ఈ తాత్త్విక రూపం ప్రస్తుతం ఆధిక్యంలో ఉన్న కాలాన్ని గ్రహించవచ్చు. అయితే ఈ ధోరణిని విప్లవ సాహిత్యం ఆధిగమించడం అనేది ఇంకా జరగాల్సిన అవసరం ఉన్నది. అయితే ఈ అవసరం అనివార్యంగా గతితార్కికాన్ని నిలబెట్టే స్థాయిలోకి విప్లవ సంఘర్షణను తీసుకెల్లడం ద్వారా జరుగుతుందని గమనించాలి. అప్పుడే అది విప్లవ సాహిత్యంగా ఉంటుంది, ఉండాలి.

"ఎవరి మొదటి వాక్యమైనా వచనమే

బయలుదేరిన బిందువును చెరుపుకొంటూ

కనిపించినవారికల్లా చేతులు చాపడమే కవిత్వం..."

రివేరా కవిత్వం యొక్క దృక్పథం ఇక్కడ శైలి పరిణామం ద్వారా వ్యక్తం చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. అందుకే ఎవరి మొదటి వాక్యమైనా వచనమే అంటూ బయలుదేరిన బిందువును చెరుపుకొంటూ కనిపించినవారికల్లా చేతులు చాపడమే కవిత్వం అని స్పష్టపరుస్తున్నాడు. అందుకే రివేరా తనకు తానే స్వీయ విమర్శనాత్మక కవిత్వం ద్వారా ముందుకు వస్తున్నాడు. ఇటువంటి రూపంలో కవిత్వం రావడం ఒక గొప్ప పరిణామ క్రమంగా చెప్పుకోవాలి. అందుకే విప్లవ సాహిత్యంలో

కవిత్వానికి రివేరా పెద్ద పీటను వేయడానికి కారణం ఖచ్చితంగా తన విమర్శనాత్మక వైఖరిగా ప్రస్తావించుకోవాలి.

"అజంతా కావాలి

అజంతే కావాలి

అ..జాన్తా నయీ..

ప్రయపానం తరువాత

అచ్చులా, హల్లులా,

ఏదో ఒక రసగోల సాగనీయీ..

ఎవరి మొదటి వాక్యమయినా వచనమే

మీది రెప్పపై జీరాడుతూ

లీలగా కదిలాడుతూ

ఇదే ఆఖరు అనిపించే

బుంగమూతి బెంగే కవిత్వం.."

విసర్గ అనే కవిత్వంలో రివేరా బెజవాడ పట్టణాన్ని కవిత్వ రూపంలో వ్యక్తం చేయడం జరిగింది. ఈ కవిత్వం నిజానికి బెజవాడని పట్టుకునే పద్ధతిలో సాగింది, నిజానికి ఈ రకంగా రాయడం రివేరాకే చెల్లింది. ఆయన అస్థిత్వాలను పట్టుకుని సాగడంలో ఆరితేరిన కవిగా చెప్పుకోవాలి. అందుకే ఈ కవి తన సృజనాత్మక చైతన్యాన్ని కవిత్వంగా వెల్లడించడం ఒక భాధ్యతగా సాగడం–కర్తవ్యంగా ఉండటాన్ని చూడవచ్చు. అయితే ఆయన కేవలం అస్తిత్వాల నమోదు చేసే కవి కాదు, విప్లవ సాహిత్యంలో అస్తిత్వాలను ఇమిడ్చి చూడాలనే కృషిని సల్పుతున్న వాది.

"ఆఖరున తలుపు తట్టినా
తొలి పిలుపులాగే వినిపిస్తుంది
తాజాగా తయారయి
తమలపాకులతో ఇంటికొచ్చిన
హంతకుడిని తలపిస్తుంది
ఎటు తిరిగితే అటు రేగే మంటని
చీరేసే మంచుకత్తి కావాలి
అది తెచ్చిచ్చిన వాడి పేరు ఏదయితేనేం,
ఆకలిగొన్నవాడో, ఆత్మను అమ్ముకొన్నవాడో
ఎవరో ఎవరికో ఎందుకు..
మీ ఆఖరి ముఖం కోసం గాలించకండి
ఆ ముఖం మనిషిదా, పశువుదా అంటూ
దయచేసి బోనెక్కించకండి
ప్లీజ్..నన్నిలా వదిలేయండి."

మార్చి 8 అనే కవిత్వంలో శిల్పం యొక్క కృషి–వ్యక్తీకరణ ఖచ్చితంగా నూతన స్వభావాన్ని సంతరించుకుని సాగిందని చెప్పుకోవాలి. విప్లవ కవిత్వం యొక్క నూతన శిల్ప సృష్టిలో రివేరా యొక్క మార్చి 8 అనే కవిత్వ శిల్పం ద్వారా మనం గ్రహించవలసినది ఉన్నతమైన రూపాలను ఉద్భవించే వ్యవహారంలో గొప్పతనాన్ని, విప్లవ స్వభావాన్ని గుర్తించడం జరగవచ్చు. అయితే ఈ పద్ధతిలో సాగడం జరగదనే విషయాన్ని ఊహించిన మేధావులు ఉన్నారు అయితే ఈ విధానంలో ఈ మార్పు ఒక సంచనలంగా చెప్పాల్సిన

అవసరం ఉన్నది, అయితే మన దృష్టి ఈ వ్యవహారాల నుండి ముందుకు సాగి తాత్త్వికతపై నిలబడుతుందని, దాని నుండే మనం అసలు సిసలైన భావజాలాన్ని అంచనా కట్టాలని శాస్త్రం.

మన పేర్లు ఎలా రాద్దాం?

ముందూ, వెనకా...

ఎవరు ముందు?

పోనీ, పక్కపక్కన

ఎవరి పక్కన ఎవరు?

పోనీ, పైనా, కిందా..

ఎవరిపైన ఎవరు?

పోనీ, ఆ పేజీలో, ఈ పేజీలో

ఎవరు ఏ పేజీలో?

పేచీలొద్దు, రాజీలొద్దు

నీ, నాలొద్దు, నా, నీలొద్దు

ఇద్దరమూ సశేషమే

ఇద్దరమూ విశేషమే.”

భారతీయ తాత్త్వికతలో మనవులు నిర్థిష్ట అవస్థలుగా కలిగి ఉంటారని భావించడం జరుగుతుంది. ఈ దశలను వ్యవస్థలుగా చెప్పుకుంటారు. ఈ దశలు మూడు రకాలు ఒకటి జాగృతావస్థ, స్వప్నావస్థ, సుషిప్తావస్థగా చెప్పుకుంటారు. ఈ దశల నుండి నాలుగవ అవస్థగా తురీయా అవస్థను ప్రతిష్టించి భావవాదపు వస్తుగతాన్ని ప్రతిష్టించడం

జరుగుతుంది. అయితే ఈ అవస్థల కుదుపులో అంటే ఒకానొక అధిగమించడం జరిగే వ్యవహారం అనివార్యంగా అంటే మానవునికి జరిగే-జరుగుతున్న అవస్థల క్రమ విచ్ఛితి నుండి సంధి స్థితులు ఏర్పడతాయని భావిస్తారు. ఈ సంధి స్థితిలు మనిషికి జ్వరం లాంటి రోగాలు సైతం కారణమవుతాయని ప్రస్తావిస్తారు. ఏమైనా ఈ సంక్లిష్ట రూపాలను అధిగమించిన వాతావరణం శాస్త్రీయ అవగాహన నుండి సాగుతుంది కూడా, కానైతే భారతీయ సంధి స్థితిని వ్యక్తం చేసే రూపంగా రివేరా కవిత్వం వెలువడటాన్ని ఇక్కడ గమనించవచ్చు..

జ్వరపడినపుడు

జన్మ రహస్యాలు మేల్కొంటాయి

వసంతాన్ని వెంటేసుకొచ్చి

ఒక్కో ఆకు రాలుతుంది

ఒక్కొక్క రహస్యం మీద...

జ్వరపడినపుడు

అంతరంతరాల్లో బెకబెకలు

వాన బెంగ పెంచుతాయి

ఎడారి అంచుల్లో ఆకుపచ్చ సూర్యోదయం

నిజ బింబమయి ఆపై నిద్ర పట్టదు

విసిరిగొట్టే వేడి గాలులను ఛేదించుకొచ్చే

తొలి పథికుడి కథకు

ఊ కొడుతుంటాను ఒక రాత్రంతా.."

నేటి కాలంలో విప్లవోద్యమం జరుగుతున్న దాడిని, మరియూ నిర్బంధాన్ని గురించి రివేరా గొప్ప కవిత్వాన్ని రచించాడు, ఆయన జరుగుతున్న కుట్రలను గురించి పాలిమికల్ వాక్యం అనే కవిత్వంలో స్పష్టంగా చెప్పడం జరిగింది. ముఖ్యంగా ఈ కాలం సంక్షోభాల కాలం అది విప్లవం అవ్వచ్చు లేదా ఇప్పటి వ్యవస్థ అవ్వచ్చు లేదా అనుకుంటున్న ఉద్యమాలు రాకపోవడం లేదా నిర్వహించ లేకపోవచ్చు, అందుకే స్థూలంగా ఇదొక సంక్షోభాల కాలం. అందుకే కాసింత నిరసన కూడా సహించలేని వాతావరణం సాగుతుంది. అందుకే రివేరా ఇలా అంటున్నారు...

"కాలానికి కాకి ఎంగిలినీ

మోనానికి పెదాలనూ

అద్దడమేనా వారి నేరం?

అయినా, అరెస్టు ఏంటి?

ఆయుధమెత్తిన అంగాంగమే కదా

అయినా, బ్యారక్ లు ఏంటి?

తలవంచిన బాటలే కదా..

సూరీడి గాయమూ

పొద్దుతిరుగుడు నవ్వూ

కుట్ర అని అంటే

పట్రా అవి లేని ఒక్కరోజుని

సముద్రపక్షే ఇప్పుడు చరిత్రకు సాక్షి

గగనమూ, రెక్కలపామూ జుగల్ బందీ..."

నేను లేను వాళ్లలో అనే కవిత్వం మొత్తం ఒక ఆధునిక రూపంలో మలచబడిన అంశంగా సాగుతుంది. నిజానికి ఈ వ్యవహారం ఒక గొప్ప ప్రయోగం, అయితే ఈ ప్రయోగం రుజువు కాబడిన అంశంగా చెప్పుకోవాలి. అందుకే తన ఈ కవిత్వం అనుసరించతగిన వ్యవహారం. ఒక పెటీ బూర్జువా వర్గ స్థితిలో నిలబడిన వ్యక్తి తాలుకు అంశంగా జరిగే పద్ధతిలో సిద్ధాంతంగా సాగుతూ ఉంటుంది. అందుకే ఈ వ్యక్తిని పట్టుకు సాగడం ఒక అవసరమా అని విమర్శించవచ్చు కానీ తాను ప్రశ్నిస్తున్న క్రమం నిజానికి ఈ కవిత్వ రూపం తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని నిరూపిస్తుంది.

"నేను లేను వాళ్లలో

రాళ్లలో విత్తులు చల్లేవాళ్లలో

భుజం పట్టి

స్వప్న సంధానం చేసేవాళ్లలో

ఆ నదిలో పుట్టుకొచ్చేవాళ్లలో

నిజమే నీవన్నది

ఆ పుట్టుకొచ్చేవాళ్లలో నేను లేను

ఒకవేళ

జాము గుర్తులేని ఏ చీకటి వేళో

గుండెలు జారిపడినందుకో ఏమో

మార్క్స కీ, మార్పుకీ మొక్కి

ఎటోకటు కొట్టుకెళ్లడం వల్లనో ఏమో

పుట్టుకొస్తున్న ఆ నదీ చరిత్రల్లోనూ

లేం మనం ఆ జవజాడల్లోనూ...

నేను లేను వాళ్లలో

అనుకోవడం అపరాధంలా తోస్తోంది

నేను లేను వాళ్లలో

అనుకోవడం మహా బెంగగా ఉంది

నేను లేను అనుకోవడం

యారో, ఇది ఎన్నో సారో!"

కవినే ప్రశ్నించే కవిత్వాన్ని వెల్లబుచ్చడం మన కవి యొక్క భాద్యత–కర్తవ్యమును సందర్భంగా తీసుకున్నాడు. అందుకే రివేరా ఏవి కవీ! అనే కవిత్వంలో చాలా స్పష్టంగా కవిని అడుగుతున్న తీరే కాదు దాని వస్తువు సైతం స్పష్టంగా మనకు తెలుస్తుంది. అయితే ఇక్కడ చూడండి ఏమని అంటున్నారో..

"చీకటి రాతిపై మిణుగురులు

చేపలకు కాంతి సవాళ్లూ

ఏరుకు వసంతాలు వందలూ వేలూ

రేగే దుఃఖంలో తిరిగిరాని

అతిథుల ప్రతిబింబాలూ

తెంపితే కొప్పులోకీ, పిలిస్తే దోసిళ్లలోకీ

జారే మాలిమి జ్వరాలూ

కల్లాకపటం లేని మెత్తని కళ్లూ.. ఏవి కవీ!

మెదలయినప్పుడు

ప్రతివాడూ అర్ధ చంద్రుడే

వెల్లడయిననాడే, వెన్నెలయిననాడే

గుడ్డిదీపం కింద గోరుముద్ద చేదవుతుంది

ఆకాశవీధిని దత్తం చేసుకొని ఆ ఒక్కడే..

చిత్తం అనాలి ప్రతి ఒక్కడూ..

అద్దంలో పట్టరాని, అబద్ధంతో పిలువరాని

మిణుగురులు ఖాళీచేసిన వేదిక ఇది

పూర్ణ బింబం ఎవరికి వేడుక కవీ!"

జాతుల ద్వేషాన్ని రెచ్చగొట్టి నిర్మించే రాజకీయం స్వేచ్ఛనే కాదు, జాతిని కూడా నిర్మించలేదు అని మేధావులు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తారు. నిజానికి ఈ అభిప్రాయం ఒక నిర్థిష్ట రూపంలో సాగుతుందని మనం గ్రహిస్తే మన దేశం ఫాసిజం రూపంలో సాగుతున్న వాతావరణం మాత్రమే కాదు సామ్రాజ్యవాద కనుసన్నలలో సాగడంతో దాని రాజకీయ రూపంలో బ్యూరాక్రటిక్ రూపంగా సాగే ఫాసిజంగా చలామని అవుతుంది. అందుకే నేటి మన భారతదేశంలో సాగే ఫాసిజాన్ని బ్యూరాక్రటిక్ ఫాసిజంగా చెప్పుకోవాలి, దీనికి పునాది బ్యూరాక్రటిక్ పెట్టుబడిదారీ వ్యవస్థ. కావున ఈ బ్యూరాక్రటిక్ ఫాసిజం యొక్క భావజాలం నిరంకుశత్వ మతోన్మాదంగా సాగడం. ఇక్కడ రివేరా కవిత్వమైన జాత్యహంకారుల స్వర్గం...అనేదాన్ని చూద్దాం...

"జాత్యహంకారుల స్వర్గమిది

మన బిందువు వద్దే మొదలై ప్రతిదీ

మన చేతుల్లోనే సద్గతి పొందుతుంది

మన కలలను ఎవరో పూర్వీకుడు కంటాడు

కలిలో కనిపించావని ప్రాచి కావ్యమవుతాడు

ఏవో నాలుగు అక్షరాలు రాసుకొని

సవరిస్తావని రుషి పుంగవుల దండు

ఉమ్మి పెడితే తడుపుకొని పోతారు..

భాషాగారి సినిమాలో భాషావేత్తల గలాటా

సున్నాలేసిన తెరల ముందు జెండా పాట

అయ్యోరు బరిబత్తల ర్ లా ఉన్నాడంటే

నూరు తప్పులు చేసేసినట్టే..

కాకపోతే,

బూడిదలోంచి ఫినిక్స్ లేస్తుందనుకొంటే

జాత్యహంకారుల స్వర్గం మొట్టి పోతుంది"

రివేరా కవిత్వం యొక్క పరిణామం మొత్తాన్ని ఇక్కడ పరిశీలించడంతో మనం ఆయన కవిత్వం యొక్క రూపంలో చేసిన, చేస్తున్న కర్తవ్యాన్ని గ్రహించవచ్చు. అయితే ఆయన యొక్క కవిత్వంపై పరిశీలనలో కేవలం వ్యవస్థ మరియు పద్ధతిపై జరగాలనే సంకల్పంతోనే చర్చకు పూనుకోవడం జరుగుతుంది. అయితే ఈ పరిశీలన ఒక విమర్శనాత్మక రూపంలో సాగాలనేది ముఖ్యం అయితే ఈ పద్ధతి మనకు అత్యంత ఉపయుక్తమైనదిగా సాగుతుంది, సాగాలి కూడా. ఇకపోతే రివేరా కవిత్వం అత్యంత సులభ గ్రాహ్యం నుండి జటిల రూపంలోకి పయణించడం జరిగిందని గమనించాలి. అయితే ఈ వ్యత్యాసం ఆయన ఆచరణ–అవగాహనలోని మార్పులను వ్యక్తం చేసేదిగా

ఉంటుంది. అందుకే రివేరా కవిత్వంపై చదవరులకు ఈ పరిణామాన్ని గ్రహించే సౌలభ్యం ఉంది. ఇకపోతే రివేరా కవిత్వం ఒకే వస్తువును విభిన్న శిల్ప రీతుల్లో వ్యక్తం చేసే పద్ధతిని అలాగే ఒకే శిల్పాన్ని విభిన్న వస్తువుల నిర్మాణాత్మక ప్రతిఫలనంగా వ్యక్తం చెయ్యడాన్ని మనం గ్రహించాల్సిన అవసరం ఉంటుంది. ఇకపోతే రివేరా కవిత్వ పరంగా నూతనమైన రూపాలను సృష్టించారు అనడంలో అతిశయోక్తి కాదు. ఆయన వస్తువు సామాజిక మార్పు అదీ నూతన సమాజ ఆకాంక్ష అందుకే విభిన్న శిల్పాలు ఈ నూతన ఆశయంలో కొత్త పంథాను తొక్కాయనే చెప్పుకోవాలి. అయితే విప్లవ సాహిత్యం అనగా కేవలం శిల్పం, వస్తువు చర్చలతో కాలక్షేపం కాదు అది ఒక సామాజిక మార్పుకు సంబంధించిన వ్యవహారం, అందునా రాజకీయ విప్లవం-వర్గ వైరుధ్యం. అందుకే విప్లవ సాహిత్యం ఎక్కువగా ఈ పరిశోధకుల చట్రం నుండి విడివడి ఆధునికం వైపుకు సాగుతుంటుంది. నిజానికి రివేరా చేసిన-చేస్తున్న ప్రక్రియ ఇదే, ఆయన కవిత్వాన్ని చూడాల్సిన దృక్పథమూ ఇదే. అయితే రివేరా అనుభవాన్ని-అనుభవవాదాన్ని చక్కగా కవిత్వ రూపంలో కొత్త పుంతలు తొక్కించాడు. అదే ఆయన పరిణామంలో కీలక మలుపు. విప్లవ సాహిత్యంలో అనుభవాన్ని పరిచయం చేస్తూ ఒక స్వతంత్ర తాత్త్విక సాంప్రదాయాన్ని నిర్మించుకున్నాడనే రివేరా పై అంచనాకు రాగలము. అయితే ఆయన ఈ అనుభవవాద సాహిత్యం ఒకరకంగా భావవాద తాత్త్వికతలన్నింటికీ విరుగుడే అలాగే అది గతితార్కికానికి సైతం కొనసాగుతుంది. ఆయన కవిత్వ పరిణామం ఒక సామాజిక విప్లవ ఆకాంక్ష నుండి అనుభవ నేపథ్యంగా సాగే పరిణామక్రమమనేది అనివార్యంగా రివేరా కవిత్వం యొక్క నూతనత్వాన్ని వెల్లడిస్తుంది, ఈ నూతనత్వం పాత తాత్త్విక సాంప్రదాయం యొక్క నూతన రూపంగా సాగడం అని గ్రహించాలి కూడా. ఈ తాత్త్వికతే అనుభవ రూపంలో అస్తిత్వాలను సైతం పట్టి కవిత్వంగా వెలువడినది. అందుకే రివేరా కవిత్వం నేటికీ ఒక ప్రయోగంగా

సాగడాన్ని గమనించవచ్చు. అయితే కవిత్వం వంటి భావజాల సాహిత్యాలకు అనుభవమే కీలకం అని చర్చించడం కీలకం–ఆధారం అని అర్థం చేసుకోవాలి. అయితే దీనిని కళంకరహిత హేతువాదం యొక్క విరుగుడుగా చెప్పుకునే వారు లేకపోలేదు, కానీ వాస్తవికతను అర్థం చేసుకోవడంలో, వాస్తవికతకు సాహిత్యానికి ఉన్న సంబంధాన్ని, మరీ ముఖ్యంగా తాత్త్వికతకు సాహిత్యానికి మధ్య సంబంధాన్ని అర్థం చేసుకోవడంలో లోపమే కొన్ని విభిన్న, అన్యవర్గ సిద్ధాంత, భావజాలాలు ముందుకు రావడానికి కారణాలుగా అర్థం చేసుకోవాలి. ఈ అవగాహనను సైద్ధాంతికంగా–ఆచరణలో గతితార్కిక తత్త్వ శాస్త్రం ద్వారా విమర్శించబడాలి, అందుకు మనం పూనుకోవాల్సిన సమయం ఇప్పటికీ మన ముందు ఉన్నది, ఉంటుంది కూడా, కావున రివేరా కవిత్వం ఇందుకు ఒక ఉదాహరణగా చూడాలి.

ముగింపు:

మానవ సమాజం వర్గ వైరుధ్యంతో కూడినది, వర్గ వైరుధ్యాన్ని అవగాహన చేసుకోవడం అంటే చలన నియమాల శాస్త్రం యొక్క వివిధ రూపాల పరివర్తనను అవగాహన చేసుకోవాల్సిన అవసరంగా ఉంటుంది. కావున మానవ సమాజం సైతం చలనశీలమైనది. అందుకే మానవ సమాజ చలనశీలత అనేది అనివార్యంగా వర్గ వైరుధ్య క్రమంగా పరివర్తన చెందుతుంది, ఈ వైరుధ్యమే మానవ సమాజానికి మూలంగా నిలుస్తుంది. అయితే మానవ సమాజం పరివర్తనశీలమైనది కాదని అది జడమైనదని మరియు చలనరహితమని భావించేవారు ఉన్నారు. నిజానికి మానవ సమాజం ఈ సిద్ధాంతంతో సరిపుచ్చుకోలేదు మానవ సమాజం అనేది చలనశీలమైనదని భావించేవారు లేకపోలేదు కానైతే ఈ చలనశీలత అనేది యాంత్రికమైనదిగా భౌతికవాదంలో అభివృద్ధి చెందితే, అధిభౌతికవాదంగా వివిధ భావవాద తాత్త్వికతల ప్రతిఫలనంగా అభివృద్ధి కాసాగింది. నిజానికి ఈ మానవ సమాజం యొక్క వర్గ వైరుధ్యం దాని పరిణామ-పరిమాణ-గుణాత్మక స్థితులే ఇందుకు కారణమని గ్రహించాలి. అందుకే వైరుధ్యాన్ని అవగాహన చేసుకోవాలి, వైరుధ్యం అనగా రెండు విరుద్ధాంశాల ఐక్యతగా చెప్పుకుంటాము, ఈ ఐక్యతలోనే ఆయా విరుద్ధాంశాలు చలించడం-వ్యవహరించడం-కొనసాగడాన్ని గ్రహించాలి. అందుకే ఆయా ఐక్యతను గుర్తించి-గ్రహించడమే కీలకమైనదిగా ఉంటుంది. ఈ ఐక్యత అనేది మధ్యవర్తిత్వ ఐక్యతగా చెప్పుకోవాలి. ఈ ఐక్యత అనగా రెండు విరుద్ధాంశాలను కలిసిపోయినవిగా అర్థం చేసుకోకూడదు. ఈ వైరుధ్యం చలనశీలమైనదిగా అవగాహన చేసుకోవాలి. ఈ చలనశీలత ఈ రెండు విరుద్ధాంశాల ఘర్షణగా ఉంటూ దాని గర్భం నుండే పాతదాని స్థానంలో కొత్తది మరియూ నూతన-ఉన్నతమైనదిగా పరివర్తన చెందుతుంది. ఈ పరిణామం నిర్దిష్ట సందర్భంలో శాంతియుత రూపంలో జరగవచ్చు అలాగే నిర్దిష్ట సందర్భంలో బలప్రయోగం ద్వారా జరగవచ్చు.

అయితే ఒకానొక వైరుధ్యం మార్పు యొక్క రెండు పార్శ్వాలను ఒకే సందర్భంలో సైతం కొనసాగించవచ్చు కూడా. నిజానికి ఈ మొత్తాన్నీ మనం ప్రకృతికి మరియు మానవ సమాజానికి సైతం వర్తిస్తుందని అవగాహన చేసుకోవాలి. అందుకే మానవ సమాజం వర్గ వైరుధ్యంతో సాగుతుంది. అయితే ఈ వర్గ వైరుధ్యం అనేది మానవ సమాజానికి పునాదిగా ఉన్న ఉత్పత్తి సంబంధాలు మరియు ఉత్పత్తి శక్తుల మధ్య వైరుధ్యం నుండి ఆవశ్యకంగా ప్రతిఫలించడంగా చెప్పుకోవాలి. అందుకే వర్గ వైరుధ్యం ఒక ఆవశ్యక జనితంగా గ్రహించాలి (ఇటీవల కొందరు విశ్వవిద్యాలయాల్లోని పరిశోధక విద్యార్థులు ఉత్పత్తి విధానాన్ని పునాదిగా పరిశోధనలల్లో వాడుకుంటున్నారు కానీ పునాది అంటే ఉత్పత్తి సంబంధాలుగా గ్రహించాలి) అయితే ఒకానొక నిర్దిష్ట ఉత్పత్తి శక్తుల దశ యొక్క ఉత్పత్తి సంబంధాల అన్వయ నియమంగా అంటే సాధనమునకు-సాధ్యమునకు గల నియతి సంబంధంగా (అధ్యారోపితం) ఉపరితలం ఉద్భవిస్తుంది అందుకే మానవుని ఉత్పత్తి సంబంధాలలోని ఆస్తి సంబంధాలు-శ్రమ సంబంధాలు-పంపిణీ సంబంధాల ప్రతిఫలనాన్ని మనం ఉపరితలంలో గ్రహించవచ్చు. ఈ గ్రహింపు భావజాల సంబంధాలలో-సంబంధాల నుండి అని మనం అవగాహన చేసుకోవాలి. కావున ఈ భావజాల సంబంధాలపై శ్రమ సంబంధాల ప్రభావం అధికంగా ఉ ంటుందని అవగాహన చేసుకోవాలి. నిజానికి ఈ అవగాహన నుండే మనం మానవ సమాజ వర్గ వైరుధ్యాన్ని అర్థం చేసుకోవాలి. కావున నేడు మనం ఈ సైద్ధాంతిక అవగాహనలో ఏ మేరకు తర్ఫీదు పొందామో గ్రహించి ముందుకు సాగాలి. ఇకపోతే మానవుడు అన్నింటినీ తాను కల్పిస్తున్నట్లు, కలిగిస్తున్నట్లు భావించవచ్చు తాను సృష్టిస్తున్నదంతా తన యొక్క కల్పితంగా భావించడం జరుగుతుంది. అయితే ఈ కల్పనలు మరియు సృష్టులు తన యొక్క ఇచ్ఛలా సాగుతున్నా అది ఖచ్చితంగా మానవ సమాజం యొక్క భౌతిక వాస్తవికత ప్రభావంగా గ్రహించాలి, అర్థం చేసుకోవాలి. అదే ఉత్పత్తి సంబంధాల

ప్రభావం అని, పునాది అని గ్రహించడం. ఇకపోతే ఈ ఉత్పత్తి సంబంధాలను ప్రభావించడంలో ఉపరితలం మరియు ఆయా భావజాల సంబంధాల ప్రభావాన్ని అర్థం చేసుకోవాలి. ఈ ప్రభావం అనివార్యంగా రెండు రూపాల్లో జరగవచ్చు. ఆస్తి సంబంధాలు మరియు శ్రమ-పంపిణీ సంబంధాల అనుకూల ప్రభావం అలాగే ఈ శ్రమ-పంపిణీ సంబంధాల మార్పుల ఫలితంగా నూతన మరియు ఉన్నతమైన భావజాల ప్రభావాలనూ గ్రహించవచ్చు, ఇందుకు కారణం పాత వ్యవస్థ గర్భం నుండే నూతన వ్యవస్థ యొక్క ఆవశ్యకతే కారణంగా, అది ఉద్భవించడానికి మూలంగా ఉంటుంది. కావున పాత ఉత్పత్తి సంబంధాల గర్భం నుండే కొత్త ఉత్పత్తి సంబంధాల పరిణామ క్రమాన్ని అవగాహన చేసుకోవాలి, ఈ అవగాహనను పక్కకు పెట్టేసి కొందరు మేధావులు కేవలం అనుభవం లేదా ఫలిత ప్రాధాన్యం మరియు ఆధునికానంతరం మరియు అస్థిత్వవాదాల ద్వారా మానవ సమాజాన్ని అవగాహన చేసుకోవడానికి ప్రయత్నించడం జరుగుతుంది. వైరుధ్యాల స్థానంలో అస్థిత్వాల నిర్లక్ష్యాన్ని చొప్పించి ముందుకు సాగడం అనేది ఒక సైద్ధాంతిక కుట్రగా అవగాహన చేసుకోవాలి. ఛాందసంగా భావించాలి. మానవుడి ఇచ్ఛా శక్తే నిర్ణయాత్మకమైనదని భావించే వారు మెండుగా సాగిపోతున్నారు, అలాగే అదైనా-ఇదైనా అనేదే నిర్ణయాత్మకత అని మాత్రమే సర్వాన్నీ అస్తిత్వపరుస్తుందని భావించే దుష్టులు సాగిపోతున్న కాలం కూడా ఉన్నది. తమ మేధస్సును ఇక ఎవరికీ లేదనే ఛాందసవాద రొంప్పిలో సాగడంతో మొత్తం విప్లవానికే పట్టిన చెదలుగా గ్రహించవచ్చు. ఏమైనా కేవలం పాండిత్య ప్రకర్షకే తమను నిలబెట్టి ఆ కార్యమే ఘణకార్యంగా వెదజల్లే మన మాణిక్యాలు నిండుగా బురదలో దొల్లుతూ అన్ని వైపులా చల్లుతున్న కాలంలో గతితార్కిక సిద్ధాంతాన్ని-తాత్త్వికతను విప్లవ వ్యతిరేకతగా చలామణిని చేయసాగుతున్నారు-చేస్తున్నారు కూడా.

ఇకపోతే సాహిత్యం అనే మాహా సౌధాన్ని నిర్మించే వ్యక్తుల అనిర్ధిష్ట చైతన్య సృష్టినే సర్వంగా భావించే వాతావరణంలోకి జారుకున్న పరిస్థితిలో ఉన్నామనే స్పృహ

అవసరం. అయితే ఈ వ్యక్తుల అనిర్ధిష్ట చైతన్య సృష్టిగా సాగే పరిస్థితిని సంపూర్తిగా కాలదన్నే గతితార్కిక తత్త్వశాస్త్రం అవిష్కరించడంతో అన్నింట అంతర్గత-అంత:సంబంధాలను పట్టుకోవడం మరియు ఆవిష్కరించడం కీలకంగా మారింది. దీనితో సాహిత్యమనేది దానివంతుగా యాంత్రిక రూపం మరియు ఆధిభౌతిక రూపాలను విమర్శిస్తూ సాహిత్య గతితార్కికాన్ని ప్రతిష్టించడం కీలకంగా ఉన్న నేటి సందర్భాన్ని అవగాహన చేసుకోవాలి. కావున సాహిత్య గతితార్కికం అనేది భౌతిక వాస్తవికతపై ఆధారపడి ప్రతిఫలనం చెందేదిగా అర్ధం చేసుకోవాలి. కావున సాహిత్యం అనేది విప్లవ సాహిత్యంగా అభివృద్ధి చెందడం గొప్ప గుణాత్మక గెంతుగా భావిస్తే ఈ విప్లవం అనే భావన శాశ్వతమైనదని అది సాపేక్ష రూపమైన నిర్ధిష్ట పరిస్థితుల సాహిత్యాన్ని గుర్తిస్తూనే దాని మార్పును శాశ్వతం అని నిరూపిస్తుంది. కావున విప్లవ సాహిత్యం అనగా ఈ శాశ్వత విప్లవ భావాన్ని గుర్తిస్తూనే ఆయా నిర్ధిష్ట పరిస్థితుల సాపేక్షాన్ని గుర్తించడంగా అర్ధం చేసుకోవాలి.

రివేరా కవిత్వాన్ని మనం సామాజిక ఆచరణలో సాధారణ సామాజీకరణ మరియూ ప్రత్యేక సామాజీకరణగా విభజించి ప్రస్తావించవచ్చు. సాధారణ సామాజీకరణ అనేది వాస్తవ చైతన్యాన్ని ప్రతిఫలించేదిగా ఉంటుంది. అలాగే ప్రత్యేక సామాజీకరణ అనేది భ్రమాత్మక చైతన్యంగా అర్ధం చేసుకోవాలి. ఈ రెండు అంశాలను మనం రివేరా కవిత్వంలో పట్టుకోవచ్చు. సామాజీకరణ యొక్క సాధారణం అనివార్యంగా భౌతిక పరిస్థితుల మార్పులను, ఆ మార్పుల యొక్క సృజనాత్మక ప్రతిఫలనంగా కవిత్వం వెలువడటం అలాగే సామాజీకరణ యొక్క ప్రత్యేకం అనివార్యంగా భౌతిక పరిస్థితుల మార్పులను శ్రమ విభజన ద్వారా ఏర్పడే వర్గ స్థాయి-స్థితిపై ఆధారం చేసుకోని సాగే భ్రమాత్మక చైతన్య ప్రతిఫలనంగా చెప్పుకోవాలి. ఈ రెండు అంశాలు రివేరా కవిత్వం ప్రతిఫలిస్తుంది. ఈ ప్రతిఫలనంలో రివేరా కవిత్వ పద్ధతి వైరుధ్యాన్ని

గ్రహించే వ్యవహారం అనివార్యంగా నిర్ధిష్ట పరిస్థితులల్లో మార్జాల కిశోర న్యాయంగా మరియూ మారిన-మారుతున్న నిర్ధిష్ట పరిస్థితులల్లో మర్కట కిశోర న్యాయం రూపంలో సాగడాన్ని మనం గ్రహించాలి. అందుకే రివేరా భౌతిక పరిస్థితుల సాధారణ ప్రతిఫలనం నుండే విప్లవోద్యమాన్ని కవిత్వంగా మలిచాడు దీనికై మార్జాల కిశోర న్యాయపు పద్ధతి ప్రతిఫలనాన్ని అర్ధం చేసుకోవాలి, అలాగే ప్రత్యేక సామాజిక రూపాన్ని సైతం కవిత్వంగా ప్రతిబింబించాడు దీనికి మర్కట కిశోర న్యాయపు పద్ధతిని అన్వయించవచ్చు. నిజానికి ఈ సాధారణం మరియు ప్రత్యేకం భౌతిక వాస్తవికత యొక్క ప్రతిఫలనంగా గ్రహించాలి. మరింత లోతుల్లోకి వెలితే పెట్టుబడిదారి వ్యవస్థలో ఉత్పత్తి సామాజికం మరియు హెూదా వ్యక్తిగత రూపంగా చెప్పుకోవాలి. అందుకే కమ్యూనిస్టులు ఈ వ్యక్తిగత హెూదా రూపాన్ని రద్ధు చేయడమే కర్తవ్యంగా భావిస్తారు. ఈ భౌతిక నేపథ్యం ఉన్నంత వరకూ సామాజిక మరియూ వ్యక్తిగత రూపాలు వాటి చైతన్య ప్రతిఫలాలు సాహిత్యంలో సైతం ఉద్భవిస్తాయి కూడా. కావున విప్లవ సాహిత్యం ఖచ్చితంగా మరియు అనివార్యంగా సామాజిక అంశానికి ప్రాధాన్యం ఇస్తూ వ్యక్తిగత హెూదాను రద్ధు చేసే సాహిత్య కృషిని నిర్వహించడం అందుకు సంకల్పించడమే భాద్యతగా సాగడాన్ని మనం కర్తవ్యంగా పెట్టుకోవాలి కూడా.

ఇకపోతే గతితార్కిక తత్త్వశాస్త్రం వ్యక్తి స్థాయిలో సృష్టించే-నిర్మించే పాత్రలను సుధీర్ఘ మానవ సామాజిక పరిణామ క్రమంలో సాధించేదిగా ఉంటుందని భావిస్తుంది, అందుకే వ్యక్తి పాత్రను సామాజిక ప్రతిఫలనంలో భాగంగా గుర్తిస్తూనే మానవ సామాజిక సుధీర్ఘ పరిణామ క్రమంలో సాధించేదిగా భావించాలనే భావనను స్థిరపరుస్తుంది. కావున వ్యక్తుల సృష్టిగా అర్ధం చేసుకునే పద్ధతి నుండి సామాజిక ఉత్పత్తికి ఇవ్వాల్సిన ప్రాధాన్యాన్ని నొక్కి చెబుతుంది. ఏమైనా ఇప్పటికీ మన గతితార్కిక అవగాహనలోని లోపాలను వివిధ భావవాద అంటే వస్తుగత భావవాదం మరియు

స్వీయాత్మక భావవాదం మరియు ద్వైత సిద్ధాంతం లేదా యాదృచ్ఛిక భౌతికవాదంగా లేక యాంత్రిక మరియు అధిభౌతికవాదంగా సాగుతున్నాయి. వీటిని సైద్ధాంతిక స్థాయిలో విమర్శించి ఆచరణవంతం చేయడం మన విప్లవ భాధ్యతగా శాశ్వత కర్తవ్యంగా సాగాలి.

రివేరా కవిత్వాన్ని మనం ఈ నేపథ్యం నుండి గ్రహించాలి. అన్యవర్గ ధోరణులను విమర్శించి ముందుకు సాగే గతితార్కికాన్ని పెంపొందించుకోవాలి. కవిత్వంలోని ఆధునికానంతర ధోరణులను పట్టుకుని విమర్శించే ప్రక్రియ విప్లవ సాహిత్యానికి ఇప్పటికీ-ఎప్పటికీ మిగిలి ఉన్న కర్తవ్యమే అని గ్రహిద్దాం, కర్తవ్యాన్ని పూరిద్దాం.

***

ఇప్పటి దాకా....

1. మార్క్సిస్టు తత్వశాస్త్రం
   (స్టడీ నోట్స్)
   రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్
   ప్రచురణ కాలం: 2016
   ప్రచురణ కర్తలు: స్పైరల్ స్టడీ సర్కిల్

2. మార్క్సిజం అజేయం
   (వ్యాసాలు)
   రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్
   ప్రచురణ కాలం: 2018
   ప్రచురణ కర్తలు: విరసం కృష్ణా జిల్లా యూనిట్

3. బృందావనం

(దీర్ఘ కవిత్వం)

రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్

ప్రచురణ కాలం: 2019

ప్రచురణ కర్తలు: శ్రీ వైష్ణవ ప్రచురణ

4. సత్యపథం

(వ్యాసాలు)

రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్

ప్రచురణ కాలం: 2020

ప్రచురణ కర్తలు: స్పైరల్ పబ్లికేషన్స్, హైదరాబాద్

ఇకపై....

1. సత్త–సాంఖ్య, శూన్యవాదాలపై విమర్శనాత్మక పరిశీలన
   (పరిశోధన గ్రంథం)
   రచయిత: అంకాళ్ళ పృథ్వీరాజ్
   ప్రచురణ: స్పైరల్ పబ్లికేషన్స్

2. మతాలు–మత తత్త్వశాస్త్రంపై గతితార్కిక పరామర్శ
   రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్
   ప్రచురణ: స్పైరల్ పబ్లికేషన్స్

3. బృందావనం–2
   (దీర్ఘ కవిత్వం)
   రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్
   ప్రచురణ: శ్రీ వైష్ణవ ప్రచురణ

4. పురాణ–ఇతిహాసాలు గతితార్కిక పరామర్శ
రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్
ప్రచురణ: స్పైరల్ పబ్లికేషన్స్

5. న్యాయ సిద్ధాంత గతితర్కం
(డైలెక్టిక్స్ ఆఫ్ జ్యూరిస్ప్రుడెన్స్)
రచయిత: అంకాళ్ళ పృథ్వీ రాజ్
ప్రచురణ: స్పైరల్ పబ్లికేషన్స్